
ఆంధ్రపత్రి
స-చిత్ర వారపత్రిక
4 అణాలు
10-12-52



కాలజ్ఞానుల ప్రేమకలాపం

చిత్రకారుడు — శ్రీ జి. పి. పిళ్లై

(మద్రాసులో యిటీవల జరిగిన అభ్యుదయ చిత్రకారుల సంఘవార్షిక ప్రదర్శనంలోని చిత్రం)

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder . K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 16
10.12-52

నందన మార్గశిర బహుళ అష్టమి బుధవారము



గుజరాతీ సుందరి

చిత్రకారుడు: శ్రీ టి. ఆర్. శతగోపన్

(అహ్మదాబాదు చిత్రకారుల సంఘంవారు యువతీయుల ప్రాంగణంలో జరిపిన చిత్రకళా ప్రదర్శనంలోని చిత్రం)

విషయానుక్రమణిక

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫోటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులు అంటించి చిరునామా వ్రాసిన కవర్లనుగాని చేర్చి పంపవలసిందని మనవి. స్టాంపులను పంపేవారికి మాత్రమే వారిరచనలను గాని, చిత్రాలనుగాని ప్రచురించే ముందు ప్రచురణ విషయమై తెలియపరచగలము. ఈ సందర్భంలో రచయితలు, చిత్రకారులు మాకు సహకార మివ్వగలరని ఆశిస్తున్నాము.

—సంపాదకుడు.

కాలక్షేపం

వచ్చిన రాత్రులే తిరిగి వచ్చుట;
పోయిన వాసరంబులే
వచ్చు టెఱింగి; గూఢతర
వర్తనులై, పునరుక్త కార్యముల్
నిచ్చలు సేయుచున్, జనులు
నిష్ఫలవృత్తి జరింతు; రీభవా
భ్యుచ్చయరీతిచే జెడి,
కుబుద్ధులు సిగ్గువహింప రెంతయున్

తా॥ ఇదివరకు వచ్చిన రాత్రులే తిరిగి వస్తున్నాయి. గడచిన పగటిపూటలే తిరిగి వస్తున్నాయి. ఈ విషయము తెలిసినప్పటికిన్నీ, లోకులు అజ్ఞానులైనటువంటివారై చేసిన పనులనే తిరిగి చేయుచూ, సంసారమునందు భవబంధములు ఎక్కువ అయినటువంటివారైనప్పటికిన్నీ బుద్ధిచెడిన వీరు ఎంతమాత్రమూ సిగ్గువహించుటలేదు.

1952 సంవత్సరము (యింగ్లీషువారి పంచాంగం ప్రకారంగా) యీ డిసెంబరు నెలతో ఆఖరైపోతుంది. జనవరినెల రాగానే 1953 సం॥ ప్రారంభమవుతుంది. క్రీస్తుపుట్టిన తర్వాత 1952 సంవత్సరాలు వరుసగా గడచినవి. ఈ విధంగా మనము కాలమానము లెక్కపెట్టుకుంటూ ఉన్నాము. కనుక 1952 సంవత్సరము మనకు తిరిగిరావాలంటే రాదు. పోయిన సంవత్సరం తిరిగి రమ్మంటే రాదు. అటువంటిసందర్భంలో, వచ్చినరాత్రులే తిరిగి వచ్చుచున్నవనిగాని, పోయినవాసరంబులే మరలివచ్చుచున్నవనిగాని మనము వాదించడానికి అవకాశమున్నదా ?

కాలం అనేది ఒక మహా ప్రవాహంలాగున ముందుకు సాగుతోంది. కృష్ణానది గట్టుమీద ఒక రేవులో ఒక రాతిబండమీద మనము నిల్చుండి ఆ ప్రవాహంలో కాళ్లు కడుక్కోవచ్చు. మనము కాళ్లు కడుగుకొన్నప్పుడు ఉదయము సరిగ్గా 6 గంటలయింది అనుకోండి. తిరిగి సాయంకాలము 6 గంటలకు మనము ఆ రేవులోనికే వెళ్ళి ఆ రాతిబండమీదనే కాళ్లు కడుక్కోనడం సంభవించవచ్చు. ఉదయము ఏ ప్రవాహజలములో మనము కాళ్లు కడుగుకొన్నామో సాయంకాలము కూడా ఆ ప్రవాహజలములోనే కాళ్లు కడుగుకొనడం తటస్థించినదని భావిస్తాము. ప్రస్తావనవశంగా పదిమందితో అదేమాట అంటాము. కాని, యీ ప్రవాహతత్వ విషయమై లోతుగా దిగి ఆలోచిస్తే మనకు కలిగినభావం సవ్యమైనదికాదు. ఉదయం పూట మనము ఏ ప్రవాహ జలములో కాళ్లు కడుగుకొన్నామో ఆ ప్రవాహజలము అచటి నుండి ఇంకా ఏటి దిగువకు వెళ్లిపోయింది. ఉదయం మన కాళ్ళకు ఉండిన మురికిని కడిగివేసినటువంటి నీరు ఇంకా ఆ రేవులో లేదు. ఆనీరు సాయంత్రానికి అనగా 12 గంటలవ్యవధిలో కనీసం గంటకు ఎనిమిదిమైళ్ళ వేగంతోనైనా ప్రవహించి సుమారు వందమైళ్ళదూరం వెళ్లిపోయిఉంటుంది. మనము సాయంత్రము కాళ్లు కడుగుకొనుటకై రేవులోనికి వచ్చినప్పుడు, ఆరేవులో ప్రవహిస్తున్న జలప్రవాహము కేవలం కొత్తది కనుక ఏ ప్రవాహజలంలో ఉదయం కాళ్లుకడుగుకొన్నామో, సాయంత్రముకూడా ఆ ప్రవాహజలంలోనే కాళ్లుకడుగుకొన్నామని చెప్పడానికి వీలులేదు. క్షణక్షణమునకు ఆరేవులో పాతనీరుపోయి కొత్తనీరువస్తోంది. ఆ రేవులోని జలపదార్థము ఏ క్షణానికి ఆ క్షణం మారిపోతోంది. క్రిందటిక్షణంలో ఉన్న ప్రవాహజలమే ఇది అని మరుసటి క్షణంలో చెప్పడానికి వీలులేదు. ప్రవాహంలోని జలపదార్థము క్షణికవేగంతో మారిపోతూ ఉన్నటువంటి సందర్భంలో, ఒకే ప్రవాహజలంలో రెండోసారి కూడా అడుగుపెట్టగలవాడెవ్వడూ లేడు. కాలప్రవాహంలో కూడా పోయిన క్షణం తిరిగి రాదు. తిరిగివచ్చినదని వాదించుటకు వీలులేదు.

ఒక పేద బ్రాహ్మడికి ఒక గుడ్డ గొడుగు ఉండేది. ఆయన పేరు భావనారాయణ. కాని, ఊళ్లోఅందరూ ఆయనను "భావయ్య" అంటారు. ఆ గొడుగును భావయ్య చాలా భద్రంగా వాడుకుంటూ ఉండేవాడు. "స్వామీ యీ గుడ్డ గొడుగును మీరుకొని ఎంతకాలమైనదండీ!" అని ఎవరైనా ప్రశ్నిస్తే "12 సంవత్సరాలైనది" అని జవాబుచెప్పేవాడు. ఒక పుష్కరంనుంచీ యింత జాగ్రత్తగా గొడుగును పారవేసికొనకుండా, పాడుచేసికొనకుండా ఏ విధంగా భద్రం చేయగల్గినాడో వినవలెననే కుతూహలం చాలామందికి ఉంటుంది. అందుకు ఆ గొడుగు ఖామందు యీ క్రిందివిధంగా ఒకనాడు సమాధానమిచ్చాడు. "అయ్యా! 1940 సంవత్సరంలో మొట్టమొదట ఒక సాహుకారుగారు నాకీ గుడ్డగొడుగును నా మీద అనుగ్రహము కలిగి, ఉచితంగా నాకు యిచ్చాడు. కాని 1948 సం॥ కార్తీక మాసంలో పెద్ద గాలివానలో యీ గొడుగుపై గుడ్డ అంతా తుమ్మకొమ్మకు తగులుక్కొని చిరిగిపోయింది. అప్పుడొక పెద్దమనిషి డబ్బుయిచ్చి వేరే ఒక గుడ్డవేయించి పెట్టినాడు. కాని, దరిమిలాను ఈ గొడుగు ఇత్తాలు అన్ని అప్పుడొకటి అప్పుడొకటి విరిగిపోతూ వుండడంచేత అప్పుడొక అణా అప్పుడొక బేడా యిచ్చి కొత్తఇత్తములు వేయించి మరమ్మతు చేయిస్తూ వచ్చాను. మొత్తముమీద ఎప్పుడైతేనేమి, ఎనిమిది పాత ఇత్తాలున్నూ విరిగిపోవడంచేత కొత్త ఇత్తాలు వేయించాను. కాని ఒక్క సంగతి చెప్పడం మరచిపోయినాను. దేవుడు చాలా మేలుచేస్తే, ఆసంగతి ఏమిటంటే, గ్రామమునసబుగారు క్రిందటి కార్తీకమాసంలో నాకుగొప్ప సహాయం చేశారు. ఎదురుగాలికి ఆగలేక ముసలివాడనైన నేను గొడుగుతోసహా కొట్టుకొనిపోయి చెరువుగట్టుమీది రావిచెట్టుకు డీకొట్టుకొన్నాము. ఆ దెబ్బతో నా గొడుగు కఱ్ఱ (కామ) తునకలై పోయింది. గ్రామమునసబుగారి ధర్మమా అంటూ, ఆయనే ఒక రూపాయి యిచ్చి దానికొక కామ (కఱ్ఱ) వేయించి పెట్టారు. ఏదో మీ బోటివారి దయవలన 12 ఏండ్లనుంచి యీ గొడుగుతోనే జాగ్రత్తగా కాలక్షేపం చేస్తున్నాను బాబూ!" అన్నాడు.

ఈగొడుగు గొడవ చాలా చిత్రమైనది. గుడ్డపోతే వేరే గుడ్డవేయిం

కాలక్షేపం

చాడు. చెత్తాలన్నీ పాతవిపోతే కొత్తవి వేయించాడు. పాతకర్ర పోతే కొత్త కర్ర వేయించడమైంది. ఈ విధంగా గత 12 సంవత్సరాల కాలంలో పాతగొడుగులోని భాగాలన్నీ పోయి పూర్తిగా కొత్తసామగ్రితో కొత్త గొడుగు నిర్మాణం అయింది. కాని, ఆ భావయ్యగారి భావాభిప్రాయం ప్రకారంగా 1940 సం॥ లో సాహుకారు మూలంగా తనకు లభించిన గొడుగునే యీ 1952 సం॥లో కూడా తాను ఉపయోగిస్తున్నానని అంటాడు. వస్తువు పూర్తిగా మారిపోయింది. కాని, 12 ఏండ్ల నాటి పాతగొడుగే యిది అని వాదిస్తాడు.

మనం పీల్చేటటువంటి ప్రాణవాయువు మూలంగా శరీరరక్తంలోని చెడుపదార్థం అంతా దహించి వేయబడుతోంది. రక్తము ఎప్పటికప్పుడు శుద్ధిచేయబడుతోంది. పాత రక్తం పోయి శరీరానికి కొత్తరక్తం పట్టుతున్నది. మనం తినే ఆహారంలో అనేక ధాతుపదార్థాలు ఉన్నాయి - కొన్ని ధాతువులను మాంసకృత్తులని అంటారు. అటువంటి మాంసకృత్తు ధాతువుగల పప్పుదినుసులను మనము తింటూ ఉండడంచేత శరీరంలో రక్తం మాంసం వృద్ధి అవుతూ ఉంటాయి. కాయకష్టంచేసినప్పుడు శరీరంలోని ధాతువులు అనగా మాంసం, కొవ్వు మొదలైనవి కొంత కరిగి తరిగి పోతూ ఉంటాయి. మనం తినే ఆహారంవల్ల కొత్త ధాతు పదార్థాలు శరీరములో ప్రవేశించి శరీరంలోని కండలను, నరాలను, ఎముకలను మన కంటికి తెలియకుండా పునర్నిర్మాణం చేస్తూఉంటాయి. ఇంచుమించుగా 12 సంవత్సరాల కొకసారి శరీర తత్వం ఫిరాయిస్తుంది. అనగా శరీరంలోని పాత ధాతుపదార్థద్రవ్యం అంతా పోయి కొత్త పదార్థద్రవ్యంతో శరీర నిర్మాణమైనట్లుగా భావించవలసి ఉంటుంది. 1930 సం॥ లో పుట్టినటువంటి ఒక అమ్మాయికి విశాలాక్షి అనే పేరుపెట్టారు. ఆ అమ్మాయి పెరిగి పెద్దదై18ఏండ్లు వయస్సువచ్చి1948సం॥లో పెండ్లిచేసికొన్నది. ఇప్పుడు యీ 1952 సం॥ లో ఆమె యిద్దరు బిడ్డల తల్లిఅయింది. 1930 సం॥ లో ఈవిశాలాక్షియే పసిబిడ్డగా వుండి తల్లిపాలు తాగింది. కాని, నేడు ఈ విశాలాక్షియే చంటి బిడ్డకు పాలు ఇస్తోంది. 22 సం॥ల నాటి విశాలాక్షియే యిది అని- గ్యారంటీగా మనము వాదించలేము. ఆనాటి విశాలాక్షి శరీరమే యీనాటి విశాలాక్షి శరీరంకాదు. డబ్బాలోని సరకు సాంతంగా మారిపోయినా, డబ్బాకూడా మారిపోయినా, డబ్బామీది ట్రేడు మార్కు మారలేదు. ఇంగువ పోయినా యింగువ కట్టిన మూటకు వాసనపోవడం లేదు. ఇదే చిరస్థాయిగా ఉండే జన్మవాసన. 22 ఏండ్లనాటి మనిషికి "నేను" అనే ఆత్మభావం "అహం"భావం మాత్రము మిగిలిఉంది. శరీరంలో ఉన్న పదార్థంఅంతా పూర్తిగా తారుమారై, పాత శరీరం క్రమేణాపోయి కొత్తశరీరం ఏర్పడినప్పటికీ, "ఆనాడు చంటిబిడ్డనై తల్లిపాలు త్రాగిన నేనే, యీనాడు తల్లినై చంటి బిడ్డకు పాలుయిస్తున్నాను" అనే ఆత్మభావం, ఏకతీరుగా మొదటినుంచి చివరివరకూ ఉంటున్నది. ఆనాటి పాతగొడుగే యిది అనేది ఆ గొడుగును గురించిన ఆత్మభావం.

ప్రవాహంలోని నీరు అనుక్షణం మారిపోతూఉన్న సందర్భములో, అదే ప్రవాహం ఇది అని స్థిరమైనపేరుతో దానిని వ్యవహరిస్తున్నాము. దానినిగూర్చి మనకు ఉన్నటువంటి ఈ స్థిరమైన భావమే ప్రవాహాన్ని గూర్చిన ఆత్మభావం. వస్తువుల విషయంలో అనగా జడపదార్థముల విషయంలో సూక్ష్మంగా ఆలోచిస్తే, సూక్ష్మముగా పరిశోధిస్తే,అణువులు పరమాణువులు వీటిని ఆశ్రయించియున్న అణుశక్తి పరమాణుశక్తి ఎప్పటి కప్పుడు మారిపోతూనే ఉంది. సూర్యునిలోనుంచి పరమాణు శక్తి అనేది ప్రజ్వలించి వేడిమిగాను, వెల్తురుగాను అనంతాకాశంలోకి విస్తరిస్తోంది. అందువల్ల నిమిషానికి 25 కోట్ల టన్నుల చొప్పున సూర్యుని బరువు తగ్గిపోతోంది. ఆ పదార్థద్రవ్యం ఆకాశం అంతటా, తేజోష్ణ ప్రసార శక్తిరూపంలో వెళ్ళిపోతోంది. కాబట్టి అణుశక్తి రూపంలో పదార్థం ఖర్చుఅయి,బరువు తగ్గుతోంది. ఈ విధంగా పదార్థం అనేది శక్తిరూపంలోకి మారిపోయింది అని గ్రహించాలి.

ఏ పదార్థంలోనైనా ఇదివరకు ఉన్న అణుశక్తిపోయి కొత్త అణుశక్తి ఏర్పడుతూ ఉండవచ్చు. వస్తువులోని అణువులు మారవచ్చు. ఈ అణువులతో ఉండే అణుశక్తి కూడా మారిపోతూ ఉండవచ్చు. కనుక నిన్న ఉదయించిన సూర్యుడే నేడు ఉదయించాడని చెప్పడంస్థూలంగా నిజం. కాని సూక్ష్మంగాఅబద్ధం. అనుక్షణం జడపదార్థం మారిపోతోంది. అనుక్షణం, వస్తువులో ఉండే అణుశక్తి కూడా మారిపోతోంది.

భూతకాలం అంటే గడచిపోయిన కాలం అన్నారు. జరుగుతున్న కాలం అంటేవర్తమానకాలం అన్నారు. రాబోయే కాలాన్ని భవిష్యత్కాలం అన్నారు. ఇప్పుడు మనము కండ్లార చూస్తున్న విషయం అంతా వర్తమానకాలంలోని విషయం అని నిర్ణయిస్తున్నాము. ఒకవస్తువు మీదనుంచి వచ్చే వెల్తురుకిరణాలు మన కంటికి తగిలినప్పుడు ఆ వస్తువును చూడగల్గుతున్నాము. వెల్తురు కిరణాలు ఎంత వేగంగా ప్రయాణం చేస్తాయి అంటే,ఒక సెకండులో 1,86,000 మైళ్ళు ప్రయాణం చేస్తాయి. ఒక సంవత్సరకాలంలో కాంతి కిరణము (1,86, 000 × 60 × 60 × 24 × 365=58,97,00,00, 000 మైళ్లు) సుమారు 6 లక్షల కోట్ల మైళ్ళదూరం పోతుంది. ఏదైనా ఒక నక్షత్రం మనభూమికి 6 లక్షల కోట్ల మైళ్ళ దూరంలో ఉన్నదనుకోండి. అది ఒక కాంతికిరణ సంవత్సర దూరంలో ఉన్నదంటారు. మనకు చాలా దగ్గరగా ఉన్నట్లుకన్పించేనక్షత్రము 25లక్షలకోట్ల మైళ్లదూరంలో ఉంది. అంటే ఏమిటి? 4¼ కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. ఆ నక్షత్రంనుంచి మనకంటికి తగిలే కాంతి కిరణాలవల్ల ఆ నక్షత్రాన్ని మనము నేడు

చూడగల్గుతున్నాము. ఈ కాంతి అక్కడినుంచి బయలుదేరి $4\frac{1}{4}$ సంవత్సరాలైంది. ఆ నక్షత్రం ఏదో ఒక కారణంచేత నామరూపాలు లేకుండా నాశనమైపోయింది అనుకోండి. కాని యీక్షణంలో ఆ నక్షత్రం ఆకాశపథంలో అంతర్ధానమైపోయినప్పటికి $4\frac{1}{4}$ సంవత్సరాలవరకూ అది ఆస్థానంలో ఆకాశంలో ఉన్నట్లుగానే దూరదర్శిని అద్దంలో మనకు కన్పిస్తూ ఉంటుంది. కారణం ఏమిటంటే, ఆ నక్షత్రంవద్దనుంచి బయలుదేరిన కాంతి కిరణాలు ఇంకా $4\frac{1}{4}$ సంవత్సరాల వరకు మన కంటివద్దకు ఆకాశ వీధిలో ప్రయాణం చేస్తూనే ఉంటాయి.

జ్యేష్ఠానక్షత్ర కూటంలో ఉండే "అంటారిసు" అనేనక్షత్రం మనకు 360 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.

"అంటారిస్"నక్షత్రంలో మనుష్యులు ఉన్నారనుకోండి. ఆమనుష్యులలో కొందరికి బ్రహ్మాండమైన దూరదర్శని యంత్రాలు ఉన్నాయనుకోండి. వారు మన భూమివైపుకు ఆ దూరదర్శని గొట్టాన్ని త్రిప్పిచూస్తున్నారనుకోండి. మనఢిల్లీనగరం వైపుచూస్తున్నారనుకోండి. వారికంటికి మన భూమిమీద జరుగుతున్న విషయాలు కన్పిస్తూఉంటాయి. 360 ఏండ్లక్రిందట యీ భూమిమీద యీ ఢిల్లీనగరంలో జరుగుతూఉండిన విషయాలు "అంటారిస్" నక్షత్రగోళంలోని వారికి ఆ దూరదర్శని యంత్రంద్వారా కన్పిస్తూ ఉంటాయి. ఎందుచేత అని అడగండి. 360 ఏండ్లక్రిందట యీ భూమినుండి బయలుదేరిన కిరణాలు నేడు యీ క్షణంలో జ్యేష్ఠానక్షత్రరాశిలోని "అంటారిస్" నక్షత్రగోళంలోని వారికంటికి తగులుతాయి. అందువల్ల ఏ అక్బరు నాటి చరిత్ర విశేషములనో ఏ జహంగీరు పాదుషా నాటి చరిత్ర విశేషములనో చూడగల్గుతాడు. అనగా క్రీ॥ శ॥ 1592 సం॥ నాడు యీభూమిమీద ఢిల్లీలో జరిగిన విశేషములను అంటారిస్ నక్షత్రంలోనివారు నేడుప్రత్యక్షంగాకండ్లకుకట్టినట్లుగా వర్తమాన భూగోళ సత్యములుగా చూడగలరు. అదేవిధంగా అంటారిస్ గ్రహంలోని జనుల విశేషాలను మనము దూరదర్శినిలో చూడగల్గినట్లయితే, నేడు దూరదర్శినిద్వారా చూచేటటువంటి విషయములు ఆ నక్షత్రగోళంమీద 360 ఏండ్ల క్రింద జరిగిన విషయాలని గ్రహించాలి. నేడు వర్తమాన విషయంగా మనము దూరదర్శనిలో చూచేది అంతా వర్తమానకాలవిషయంకాదు. 360 ఏండ్లనాటి సత్యమును వస్తువులను మనుష్యులను నేటి వర్తమానకాలపు సత్యంగా చూసి ఆనందిస్తాము. "మనము యిప్పుడు చూస్తున్నాము" అనేమాట వర్తమానవిషయమే. కాని మనం చూచేది అంతా వర్తమాన సత్యంకాదు. "చూచుట"అనేది వర్తమాన కాలసత్యం. "చూడబడేది" మాత్రం 360 ఏండ్లనాటి భూతకాలవిషయం. "దర్శనము"వర్తమానసత్యం. "దృశ్యం" మాత్రం భూతకాలసత్యం. ఈవిధంగా కాలప్రవాహమందువర్తమానకాలంలో భూతకాలం- భవిష్యత్కాలంలో వర్తమానకాలం లీనమై పైకిక్రిందికి చక్రంలాగునతిరుగుతున్నాయి అని నిర్ణయించవలసి వస్తుంది. ఈ విధంగా భూత వర్తమాన భవిష్యత్తులు చక్రంలాగున తిరిగి మనలను పరిభ్రమింప జేస్తున్నాయి.

వచ్చినరాత్రులే తిరిగి వచ్చుచున్నట్లు

(52-వ పేజీ చూడండి)

ఓహోహో! గంగాజలా!

డాక్టరు డీ హెరిల్లీ అనే ఫ్రెంచి డాక్టరు గంగా ప్రవాహంలోని నీరును, వైద్యశాస్త్రరీత్యా పరిశోధించి చూచారు. కలరా వ్యాధిగల రోగుల శరీరములో నుండి క్రిములను తీసికొని, ఒక గాజు గొట్టములో వేసి, ఆ క్రిములసంఖ్య వృద్ధి అయ్యేటట్లు చేసెను. గాజు గొట్టంనిండా కలరా క్రిములు నిండియున్నప్పడు, గంగానదిలోని నీటిని తెచ్చి కలరాక్రిములు గల గాజు గొట్టంలో పోసి ఉంచెను. ఆ నీటిలోని క్రిములు వృద్ధి అయ్యేటందుకు చేయవలసిన క్రిమివర్ధన ప్రక్రియలు (ఇంక్యుబేషను) చేశారు. అటు పిమ్మట భూతఅద్దంతో ఆ నీటిలోని క్రిములను పరీక్షించి చూచారు. అందులోని కలరా క్రిములు నాశనమై పూర్తిగా అంతర్ధానమైనాయి. ఇది చాలా అద్భుతమైన గంగాజల మహిమా ప్రభావం అన్నారు. కలరావచ్చి చనిపోయినవారి శవములను గంగలో పారవేస్తారు. ఆ శవాలు తేలుచున్నటువంటి ప్రవాహ భాగంలోనికి వెళ్ళి ఆ శవాల క్రిందిభాగంలో ఉన్న నీరును తెచ్చి, భూత అద్దాలతో పరీక్షిస్తే ఆ నీటిలో కలరా క్రిములు లేవు.

కెనడా దేశములోని మాక్‌గిల్ విశ్వవిద్యాలయములోని మాక్డొనాల్డు కాలేజియొక్క ప్రిన్సిపాలు (ప్రధానాచార్యుడు) అగు డాక్టరు యఫ్. సి. హారిసన్ గారు "నీటిలోని క్రిమిజీవులు" అనే వ్యాసంలో యిలా వ్రాశారు:-

గంగానది జలమునందుగాని, యమునానది జలమునందుగాని కలరా క్రిములను చేర్చిఉంచిన యెడల ఆ క్రిములు 3 గంటలు మొదలుకొని 5 గంటల వ్యవధిలో ఆ క్రిములు నాశనమైపోతాయి. ఇది చాలా అద్భుతమైన విషయం, దీనికి సరియైన సహేతుకమైన సంజాయిషీ ఎవ్వరూ యివ్వలేదు. ఆ యమునానది జలమునే కాచిన యెడల, ఆ కాచిననీటిలో ఆ క్రిములు వృద్ధియగునేగాని నాశనం కావు.

ఆకలితో

[గమనిక:—ఆంధ్రనాటక రంగంపై ప్రజలమోజు పునరుద్ధరించడానికి - మన ప్రదర్శనా పద్ధతుల్లో అనేక కొత్తదనాలు ప్రవేశపెట్టడం ముఖ్యావసరంగా కనిపిస్తోంది. కథావిషయం, పాత్రపోషణలతోపాటు ప్రదర్శనా పద్ధతులు కూడా ప్రేక్షకుల్ని ఆకర్షించి, హృదయాలకు హత్తుకునే అనుభూతుల నివ్వగలిగిననాడు - మన నాటకరంగం సముజ్జ్వలం కాగలదు...ఈ విషయాలు దృష్టిలో పెట్టుకునే - యీ రచనను చేశాను. రాయలసీమ కరువుతో ఛిన్నాభిన్నమైన ఒక రైతు కుటుంబమూ, దాని సమస్యలూ కథావిషయంగా తీసుకుని - ఆకలి పెచ్చుమీరితే ప్రజ లెలా మారిపోతారో, అనేక విధాలుగా చిత్రించే దృశ్యాలు - సంతరించాను. కథాగమనాన్ని క్షణక్షణమూ ప్రస్ఫుట పథానికి నడిపించే కొత్తప్రదర్శనా పద్ధతుల్ని ప్రవేశపెట్టాను. ఓపికా, కుతూహలమూ గల స్టేజ్ మేనేజర్లు యీ కొత్తపద్ధతుల్ని అతి సులభంగా ప్రదర్శించగలరు. స్టేజ్ మేనేజర్ చురుకుదనమే యీ నాటకాన్ని ఎంతో వెలుగులోకి తీసుకురాగలదు. లేకపోతే - యిది చదువుకోడానికే బాగుంటుంది.—రచయిత.]

పాత్రలు:

సుబ్బయ్య—రైతు పెద్ద
బంగారం—రైతు కోడలు
చిట్టియ్య—మనమడు
సుందరమ్మ—అతని భార్య.
రామయ్య—రైతుబిడ్డ
గౌరి —రైతు కూతురు
చంటిది —మనుమరాలు
కుంటిది —అతని భార్య
కోటయ్య—యాత్రీకుడు
గుడ్డియ్య—యాచకుడు

—:బుర్రకథకులు–కరువు బాధితులు:—

మొదటి దృశ్యం

[రంగాలంకరణ:— పల్లెటూరి పెంకుటింటి ముందువైపు వరండా. రెండువైపులా అరుగులు, మధ్య పల్లపు నడవ; సింహ ద్వారం. తలుపులు ఓరవేసివుంటాయ్. కుడివైపు అరుగుమీద నాలుగు ధాన్యం బస్తాలూ, అపరాల మూటలూ, పశువుల అలంకార సామగ్రీ వుంటాయ్. ఎడమవైపు అరుగుమీద ఒక లేగ దూడా, పచ్చిమేతా వుంటాయ్. ఆ అరుగుమీదే చిట్టెయ్య (6 సం॥, మువ్వల పట్టెళ్ళతో ఆడుకుంటున్నాడు. నడవలో (14 సం॥) గౌరికి (24 సం॥) బంగారం జడ వేస్తూంటుంది. ముందు కొయ్యఫ్రేముగల అద్దం; బొట్టుపెట్టె; నూనెసీసా; పూల పళ్ళెం, వుంటాయ్. వారి వెనక గలద్వారానికి పసుపూ, కుంకుమబొట్లూ వుంటాయ్. ఈ వరండాకు ముందు 2 అడుగులస్థలం బజారువలె ఖాళీగావుంటుంది.]

చిట్టెయ్య: (మువ్వలతో ఆట) ఘల్ ఘల్ !!...ఆహోయ్...ఛో ఛో ఛో...!!!

గౌరి: (అద్దంలో తనముఖాన్ని చూచుకునేందుకు వంగుతుంది)

బంగారం: (విసుగ్గా చేతిలోని జడ వదిలి) అబ్బ! ఇట్లాగైతే నే నీజడ వెయ్యలేను.

గౌరి: లేదులే వదినా — వెయ్యి!

బంగారం: ఏం వెయ్యనూ - ఎట్లా వెయ్యనూ? ఎపుడూ ఆసులోకండెలాగా తల తిప్పుతూనే వుంటివి!

గౌరి: పాపిట సరిగ్గా తీశావో లేదోనని చూసుకుంటున్నా వొదినా!

బంగారం: (మళ్ళీ జడవేస్తూంది)

చిట్టెయ్య: కాదమ్మా! అద్దంలో తన బొమ్మచూసుకుని, నవ్వితాం దత్తయ్య!

గౌరి: (పళ్ళుబిగించి) ఒరేయ్-చిట్టిగా (చేత్తో బెదిరిస్తుంది)

బంగారం: ఉన్నమాటంటే అంత ఉలుకెందుకే మరదలా?! కాబోయే మొగుడు ముందు ఎట్లా నవ్వాలో యిప్పట్నుంచీ నేర్చుకుంటున్నావా?!

గౌరి: (ముందుకు జరిగి) పోవదినా—నువ్వ మరీనూ!

బంగారం: (జడతో వెనక్కులాగి) పొమ్మంటే పోతానా? తలదువ్వించుకోకపోతే నాకు వియ్యంకు డొచ్చేదెట్లాగో!

గౌరి: (మారాంచేస్తూ) ఎప్పుడూ అదే ఎగతాళా వొదినా?!

బంగారం: ఎగతాళేముందే - పెళ్ళి చేసుకోబోతున్నావు గనక అన్నానూ!!

చిట్టెయ్య: (పాటగా) అత్తయ్య పెళ్లికి పల్లకి యెక్కుతా,
వళ్ళోకూర్చుని మామకి చెబుతా,
అత్తియ్యెంతో కుళ్ళుమోతంటా॥
(చప్పట్లు)

గౌరి: (కోపం) ఒరేయ్!...ఏమిటమ్మా-నాకు సిగ్గేస్తాంటేనూ—

బంగారం: ఇపుడట్టాగే ఉంటావ్ — అమూడు ముళ్ళూపడితే ఆయన చెంగు వదుల్తావా?

గౌరి: అయితే, నువ్వ మా అన్నయ్యనట్లాగే పట్టుకూర్చున్నావా?

బంగారం: నాదేముందీ - మీయింటి ఆడపడుచులకు మల్లే, పెద్ద చదువా, సంధ్యా —మొగుళ్ళనదుపులో పెట్టుకోవటానికి?

గౌరి: అయితే, చదువుకున్నంత మాత్రాన మొగుళ్ళమీద పెత్తనం చేస్తారా ఏమిటి?

బంగారం: నువ్వేంచేస్తావో చూస్తానుగా...వచ్చే లగ్నాల నాటి కదీ తేలిపోతుంది. (జడఅల్లడం పూర్తిచేసి, పూలు పెడుతుంది).

[తెరలో అడుక్కునేవాళ్ళ పాట]

రామయ్య: (అప్పుడే పొలం నుంచి వచ్చాడు) మొహం కడుక్కో వాలి - నీళ్ళు తే, గౌరీ! (ఎడమ అరుగెక్కి; చేతి కర్ర నో మూలపెట్టి; అరుగు అంచున బజారువైపు కూర్చుని, తలగుడ్డ తీసి కొడుక్కిస్తాడు).

గౌరి: (లోనికి వెళుతుంది)

చిట్టి: (తండ్రిమీద వాలి) నాన్నా...అత్తయ్య కోప్పడిందీ!...

రామయ్య: ఎందుకురా?

చిట్టి: (గారాంగా) పెళ్లిచేసుకుంటుందని పాడితేనూ—!

రామయ్య: ఓరి, నీ దుంపతెగా! మీ అమ్మ నేర్పిందా ఏమిటే?

చిట్టి: ఊం...నేనంచక్కా పాడితేనూ!...(మారాం)

రామయ్య: సర్లే...నేనత్తని కోప్పడతా లే.

[ఇంతవరకూ దూరంగా విని పించినపాటదగ్గరౌతుంది. గుడ్డియ్య, కుంటిది

శ్రీ పోలవరపు శ్రీహరిరావు



అడుక్కుంటూ బజారుగుండా ప్రవేశం]

కుంటి: "కుంటిదాన్ని బాబు—
నారాయణా
నడవ కాళ్లే లేదు - నారాయణా॥

గుడ్డి: రెండు కళ్లూ లేవు—నారాయణా
కాబోది పచ్చినీ - నారాయణా॥

ఇద్దరూ: పట్టెడు ధర్మమూ—నారాయణా
పెట్టండి పెబువులా—నారాయణా॥"

గౌరి: (చెంబుతో నీళ్లు తెచ్చి అన్నకిస్తుంది.)

రామయ్య: (చెంబందుకుని) వాళ్ళ 'క్కాసి వడ్లు పెట్టు. (ముఖం కడుక్కుంటున్నాడు.)

చిట్టెయ్య: నే పెడతా నాన్నా. (పరుగెత్తుకెళ్ళి మూలనున్న సంచీలోని వడ్లు చేరెడు తీసి అడుక్కునేవాళ్ళకు పెడతాడు)

బంగారం: చంటాడిచేతి కేమొస్తయ్—నువ్ పెట్టు గౌరమ్మా.

గౌరి: (మూలకెళ్ళి, సంచీలోని వడ్లు దోసెడు తీసి కుంటిదానికి పెడుతుంది)

కుంటిది: వెయ్యేళ్లు వర్ధిల్లాలి-మీ యిల్లు చల్లగా.

గుడ్డియ్య: ధర్మ పెబువులు.

[యాచకులిద్దరూ నిష్క్రమణ]

రామయ్య: (బీడీ వెలిగించాడు)

బంగారం: పొద్దు గూకబోతుంటె కూచ్చుని బీడీ యెలిగిచ్చా రేమిటండీ—యెల్లి పాలు పితక్కా!?

రామయ్య: వెళ్తాగా...

బంగారం: ఇంకా గుడ్డ లిడవకుండా నుంచున్నా వేం గౌరమ్మా - వెళ్లి నీళ్ళోసుకుని కొత్తకోక కట్టుకో—

గౌరి: ఏం కొత్తకోక లున్నయ్యమ్మా- ఆ మబ్బురంగు కోకే గా—కట్టకుండా వుందీ?

బంగారం: అదే కట్టుకోమ్మా!

గౌరి: అది నాకేం బాగుండదమ్మా.

బంగారం: (బుగ్గను వేలేసుకుని) అంత జరీ అంచుంటే, అదే బాగుండలే దంటావేం? అయినా కొన్నాక కట్టుకోక పారేస్తామా ఏమిటి?

గౌరి: కావాలిస్తే నువ్ కట్టుకో - అది నాకొద్దు—రెండో పట్టుకోకన్నా కొనలేదూ—(అలుగుడు ముఖం)

బంగారం: మీ నాన్నగార్ని తెమ్మన్నాగా! ఇవ్వాళ తెస్తార్లే—వున్నది కట్టుకో!!

గౌరి: (విసవిసా యింట్లోకి వెళ్ళిపోతుంది)

బంగారం: మబ్బురంగు కోక, దాని ఒంటి కెంతో నిండుగా వుంటుందని కొన్నా!

రామయ్య: (లేచిలోనికి వెళిపోతాడు)

చిట్టి: (తల్లి పమిటె లాగుతూ) అమ్మా-నాకో?!

బంగారం: నీకేమిట్రా?

చిట్టి: కొత్తచొక్కా, లాగూ—

బంగారం: తాతయ్య తెస్తార్లె చిట్టీ!

చిట్టి: మరీ,... కారాపూసా, జిలేబీ-పళ్ళూ;

బంగారం: అన్నీ తెస్తారే బాబూ... తాతయ్యొస్తున్నారేమో వీధిలో కెళ్ళి చూడు.

చిట్టి: (ముంగాళ్ళ పరుగెత్తి, ముసలివాడిలాగా నోటను చెయిజేర్చి, దోవ పారజూస్తాడు)

"క్వయినా" అంటే ఏమిటి?

మన్య జ్వరానికి (మలేరియాకు) "క్వయినా" మాత్రలు వాడుతున్నారు. కాని, యీ మందు ఏ దేశం నుంచి యీ దేశానికి వచ్చింది? ఎప్పుడు వచ్చింది? దీనికి ఈ పేరెట్లు కలిగె? వినగోరెదమనిన అవధరింపుడు

దక్షిణ అమెరికాలో పెరూ అనే దేశం ఉంది. ఆ దేశంలో యీ క్వయినా చెట్టు అడవులలో పెరుగుతూ ఉంటుంది. పెరూ దేశభాషలో "క్వినా" అంటే చెట్టు యొక్క 'బెరడు" అని అర్థము — "క్వినా క్వినా" అంటే "ఔషధ ప్రభావం గల బెరడు"అని అర్థము. 16వ శతాబ్దములో స్పెయిను దేశము వారు దక్షిణ అమెరికాకు వెళ్లి పెరూ దేశమును ఆక్రమించారు. స్పెయిను దేశము తరఫున ఒక రాజప్రతినిధి (వైస్రాయి) పెరూ దేశంలో నియమింపబడి ఉండేవాడు. 1639 సం॥లో స్పెయిను దేశములో ఒక జమీందారు వంటి వాడైన "సింకోను ప్రభువు" పెరూ దేశములో వైస్రాయిగా ఉంటూ ఉండేవాడు. అతని భార్యకు అనగా సింకోన్ ప్రభ్వీణికి, (అక్కడ ఉండగా) మన్య జ్వరం వచ్చింది. అక్కడ ఉంటూ ఉన్న స్పెయిను దేశీయులగు క్రయిస్తవమత ప్రచారకులు "క్వినాక్వినా" బెరడు తెచ్చి పొడిచేసి, ఆ మార్గమును సింకోన్ ప్రభ్వీణికి ముందుగా యిచ్చారు. ఆమెకు జ్వరం అద్భుతంగా అంతర్థానమైంది. అప్పుడు ఆ స్పెయిను ప్రభుత్వపు వైస్రాయి అనగా సింకోన్ ప్రభువు యీ "క్వినా క్వినా" (మందు బెరడు) చెట్టును స్పెయిను దేశానికి తీసికొని పోయి అక్కడ విరివిగా పెంచెను. "సింకోన్" ప్రభువు తెచ్చి నాటిన మొక్క అగుట చేత యీ మందు చెట్టును స్పెయిను దేశంలో "సింకోనా" చెట్టు అని పిలిచేవారు. నేటికికూడా క్వయినామందుచెట్టును సింకోనా చెట్టుఅని పిలుస్తున్నాము. ఈ మందుచెట్టు యూరోపు ఖండంలోని ఆనేక దేశాలవారికి లభ్యమైంది. హాలెండు దేశమువారికి యీ చెట్ల గింజలు లభించాయి. హాలెండు ప్రభుత్వముయొక్క ఏలుబడిలో జావా ద్వీపం ఉంది. ఇది సింహళం లంకకు ఇంకా దక్షిణంగా ఉంది. ఈ జావాద్వీపంలో యీ సింకోనా చెట్లను హాలెండు దేశము వారు (అనగా డచ్చివారు) పెంచారు.

ఈనాడు ప్రపంచం అంతటిలో ఉత్పత్తి అవుతున్న క్వయినాలో నూటికి 90 వంతు జావాద్వీపం సప్లయి చేస్తోంది.

భారతదేశంలో హిమాలయాపర్వతాలలో డార్జిలింగు సమీపంగా మంగ్పూ అనే ప్రాంతంలో మన ప్రభుత్వం తాలూకు సింకోనా తోటలు ఉన్నాయి. అక్కడనే క్వయినా మందు తయారు చేసే ఫ్యాక్టరీ కూడా ఉంది.

★ ఆకలితో ★

బంగారం: (లోపలికి వెళుతుంది)

చిట్టి: తాతయ్యొత్తున్నాడమ్మా (చప్పట్లు) పెద్దమూట తెత్తున్నాడు. (గంతులు వేస్తూ ఎదురుదెబ్బ తగిలిపడి, ఏడుస్తున్నాడు)

బంగారం: చేటలో బియ్యంతో ప్రవేశించి, చేట అరుగుమీద పెట్టి; చిట్టియ్యను లేపుతుంది)

చిట్టియ్య: (గుక్కపట్టేడు)

బంగారం: (చిట్టి వీపు దులిపి యెత్తుకుని) థూ...థూ...థూ!! నా తండ్రే - ఎంత దెబ్బ తగిలిందంటేనూ! ...థూ...థూ - (వీపు తట్టి) పోతుందిలే బాబూ!

చిట్టి: (ఏడుస్తూనే) దెబ్బతగిలిందీ... యీ...ఈఁ...

బంగారం: థూ...పోతుందిలే బాబూ- పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశావో - పాడుదెబ్బ తగిలింది...థూ - థూ -

చిట్టి: (ఏడుపు)

బంగారం: ఊరుకో బాబూ - తాతయ్యొచ్చేశాగు చూడు...

చిట్టి: ఏడీ?

సుబ్బయ్య: (భుజంమీద మూటలూ, చేత సంచీతో ప్రవేశం.)

బంగారం: అదుగో - నీకు పళ్లు తెచ్చారు చూడు...(దింపుతుంది).

చిట్టియ్య: (పరుగెత్తి తాత సంచిని లాగుతాడు.)

సుబ్బయ్య: ఏడుస్తున్నావెందుకురా చిట్టే...(సంచిలోనుంచి అరటిపళ్లు తీసి యిచ్చి) యివిగో.

చిట్టి: (అరటిపళ్లు తీసుకుని, ఒకటి నోట్లో కుక్కుకుని) థాతయ్య..థెచ్చారూ ...(లోనికి పరుగెత్తిపోతాడు).

సుబ్బయ్య: (మూటలు దింపుతూ) మళ్లా పడ్డావురా - చిట్టే... (మూటలు కోడలి కందిస్తాడు.)

బంగారం: (మూటలు అరుగుమీద పెట్టి) వెళ్ళినపని ఏమయిందండీ?

సుబ్బయ్య: (అరుగుమీద కూచ్చుని) కుర్రాణ్ణి చూశాం-బాగానే వున్నాడు... వాళ్ళ తండ్రీ వాళ్ళూకూడా వచ్చారు... ఈ యేటి కొద్దూ, వచ్చే యేటికి బియ్యే కూడా అయిపోతుందీ—అప్పుడు పెళ్ళి చేసుకుంటానన్నాడు.

బంగారం:(నడవలో కూచ్చుని బియ్యం ఏరుతూ) పెళ్ళికొడుకు బాబు చెప్పలేదటండీ—మనమ్మాయి యీ తేరి కూచ్చుందనీ?

సుబ్బయ్య: చెప్పాడు—ఘట్టిగానే చెప్పాడు. కుర్రాడేమో చదువు పాడైపోతుందని ఒప్పుకోలేదు—ఏమంటాం యికా?

బంగారం: ఒకవేళ పెళ్లికొడుక్కి మన సంబంధం నచ్చలేదేమో?!

సుబ్బయ్య: నచ్చకపోవడమేమిటీ— పదివేలూ యిస్తానన్నానుగా! మనమ్మాయేమో నచ్చిందనే చెప్పాడు...నాతో— తప్పకుండా యీ సంబంధమే చేసుకుంటాననీ, యీయేటి కాగమనీకూడా చెబితేనూ-

బంగారం: అట్లాగా! అట్లాటి సంబంధంకోసం ఆగితేమట్టు కేంలెండి!!

సుబ్బయ్య: నేనూ అట్లాగే అనుకున్నాను - ఖాయమనిపించుకుని వచ్చాను.

బంగారం: మంచిపని చేశారు! దాని పెళ్ళి కూడా శుభంగా జరిగితే - నేనత్తగారి కిచ్చినమాట దక్కుతుంది...అందరూ 'యింకా పెళ్లి జెయ్యలేదేం మరదలకి' అని అడుగుతున్నారు.

సుబ్బయ్య: అడుగుతారు!...ఎవరేమనుకుంటే నీకేం తల్లీ—నువ్వే మా యింటికి లక్ష్మివని మేం అనుకుంటూంటే!! కళ్యాణం రావద్దూ—

బంగారం: అత్తగారు గౌరిని నా చేతుల్లో పెట్టిపోయిందిగదా అని యింత యిదీను...సరిగానీ, కట్నంకోసం వుంచిన అయిదువేలూ మళ్ళీ వ్యవసాయంమీద పెట్టక - అట్లాగే వుంచండి; లేకపోతే సమయానికి దొరక్క యిబ్బంది పడవలసొస్తుంది.

సుబ్బయ్య: సకాలంలో వర్షాలుపడితే యీ యేడు, మిగతా అయిదువేలు కూడా మన పొలంమీదే వస్తాయ్.

బంగా: అవున్లెండి - పెళ్ళిఖర్చులకి ఒక వెయ్యి అప్పుచేసినా, పైపంటలో తీర్చుకోవచ్చును - ఒక్కగానొక్క ఆడబిడ్డ !!

సు: ఏది తప్పుతుందిలేమ్మ! మనగడ్డ చల్లగుండాలిగాని మనకేం తక్కువౌతుందీ ?!

బంగా: పదే-స్నానానికిలే మామయ్యా.

[తెర]

రెండవ దృశ్యం

[రంగాలంకరణ:— ముఖ్య యవనికకు నాలుగడుగుల వెనుకనే మరొక తెర; దాని మీద బజారు దృశ్యం. ఒకమూల ఒక పెంకుటింటి వసారా కనిపిస్తుంది. రెండవ మూల ఒక ఆవు ఎండిపోయి, కన్నీళ్లు కారుస్తూంటుంది. ఆవు ప్రక్కనే వెనుకటి రంగంలోని దూడ చచ్చి పడివుంటుంది. ఈ రెండవ తెరకు ఒక గజం వెనుక మరొక తెర. ఈ తెరపై ఎండి నెరియలు గొట్టిన చేల దృశ్యాలు; మోడువారిన చెట్లూ వుంటాయ్. ఒకప్రక్కను నూతి అంచు కనిపించుతూంటుంది. ఈ లోపలి తెరలూ, ముఖ్య యవనికా వాలియుండగానే బుర్రకథకులు రంగంముందు నిలచి పాడతారు. తర్వాత తెర లేస్తుంది.]

—:॥ బుర్రకథకులు ॥:—

కనరా భారతపౌరా, వినరా-
కరువుబాధ, నేడు॥ ॥కనరా॥

1. రత్నగర్భయే దేశము నేడూ-
భగ్నజీవియాయె ,,
అన్నపూర్ణయా దేశములోనా
అన్నమె కరువాయె॥ ॥కనరా॥

2. నాలుగేండ్లుగా వానలు లేకా-
చాలు దున్న లేదు ,,
సాలుపాకుగునా పనులేలేవూ-
నీలు, పాలు లేవు॥ ,,

3. పచ్చని పైరులు పండే చేలా-
పచ్చికైన లేదు ,,
పచ్చపచ్చనీ సంసారాలూ-
పల్చబడెను నేడు॥ ,,

4. నిల్వయుండెడీ గింజలు పైకం-
చెల్లిపోయినాయి॥ ,,
చేలగొట్టినా నెరియలవలె నే-
యిళ్లుగుల్లలాయె॥ ,,

5. దినముగడచుటే కష్టమాయెనూ-
మానవులకు నేడు ,,
కనకనలాడే పొట్టలబాధలు-
కనరండీ మీరు॥ ,,

అదుగదుగో అటు-మాడుడు బాబు
॥తంధ-నా తంధాన తంథన॥

ఊరుకు పెద్దా-రైతులవారు, ,,
దానధర్మముల్-జేసేవారు ,,
నాలుగేళ్ళగా-పంటలు లేక, ,,
పస్తుల బాధలు-పడగా లేక, ,,
బతికుంటే బలు-సాకు తినొచ్చని, ,,
దూరసీమలకు-సంసారంతో, ,,
గోడుగోడుమని పోవుచుండిరీ -
కనుడి బాబులార॥

[బుర్రకథకులు ప్రక్కకు నిష్క్రమిస్తారు. ముఖ్య యవనిక లేస్తుంది. సుబ్బయ్య చింకిపంచె పైకెగగట్టి, చింకి తలగుడ్డ, చేతికర్ర, భుజాన మూటలతో వంగి వడుస్తున్నాడు. రామయ్య వంటసామగ్రి గల మూట నెత్తుకున్నాడు. బంగారం పసిబిడ్డ నెత్తుకుని, మరోచేత చిట్టెయ్యను పట్టుకుంది. గౌరి ఒక ట్రంకు నొకచేతా, రెండవ చేతితో చిట్టెయ్యనూ పట్టుకుంది. అందరూ ఎంతో ఎండిపోయి, దీనంగా వున్నారు. వీరు వసారాకొస కనిపిస్తున్న వైపునుంచి ప్రవేశించి రెండో వైపుకు కన్నీళ్ళతో నడుస్తూంటారు.]

సు: (రంగస్థలంలో సగం నడిచి, వెనక్కు తిరిగి) తాతముత్తాతలనుంచీ వున్న యిల్లూ, వూరూ విడిచిపోవాల్సిందేనా? నా కాళ్లు రావటంలేదు.

రా: (తండ్రి చెయి పట్టుకుని) బతికుంటే మళ్ళీ వస్తాంగా—రా!

సు: నే రాలేన్నా! (కన్నూతంగా నేలనాన్చి నిలబడతాడు)

రా: ఇంట్లో గింజల మొహం చూచి రెణ్ణెల్లయింది గందా—యింకా యిక్కడ బతికే దెలా నాన్నా ?

గౌరి: వారం రోజుల్నుంచీ దుంపలు కూడా దొరక్క పస్తులుంటున్నామే-యింకా ఎన్నాళ్ళిలా బదగ్గలం ?!

సు: పుట్టిపెరిగిన యిల్లూ, వాకిలీ వదిలిపెట్టటమంటే పేగులు తెగుక్కుపోతున్నయ్.

రా: అది నిజమేనాన్నా-అందుకనేగా నాలుగేళ్ళనుంచీ కుంచెడు గింజలు పండకపోయినా, ఎట్లాగోకట్లా యిక్కడే గడుపుకున్నాం? ఏ పూరన్నాపోయి, కూలో నాలో చేసుకు కొన్నాళ్లు బతికితే - యిక్కడ వానలవీ పడగానే మళ్ళీ వచ్చి, మనింట్లో మనం వుండొచ్చు.

బం: బతికుంటే బలుసాకన్నా తినొచ్చని నువ్వే అన్నావుగా మామయ్యా... మనదృష్టం బాగుంటే వచ్చేయేడన్నా వానలు పడకపోవు.



ఒక దాక్షిణాత్య శిల్పానికి
గోటితో గీసిన ప్రతిరూపం.

—చిత్రకారుడు: శ్రీ వి. సూరన్న
(మద్రాసు)

★ ఆకలితో ★

గౌరి: అప్పుడు మళ్ళీ వద్దామనే వెళ్తున్నాంగా - నాన్నా! రా!

సు: (కళ్ళు తుడుచుకుంటూ) నీ పెళ్ళికని వుంచిన డబ్బు కూడా తినేశాం - పెళ్ళా చెడగొట్టాం. (ఏడ్పు)

గౌరి: ఊరుకో నాన్నా! అంతా బతికి బాగుండాలిగాని - యిప్పుడు నా పెళ్ళికేం తొందరా??

సు: (మెల్లగా నాలుగడుగులు నడుస్తాడు)-

చి: నా బుచ్చిదూడ అట్లా పడుకుందేం అమ్మా?

బం: చచ్చిపోయింది బాబూ.

చి: దాని అమ్మ పాలివ్వలేదా?

బం: మనకి మల్లేనే, దానికీ తిండి లేదుగా బాబూ - అందుకని పాలెండి పోయాయ్.

చి: అయ్యో - మరి నాకు బుచ్చిదూడెట్టాగా—?

గౌ: మనం వూరెళ్ళి వచ్చే సరికి— యింకోటి పుడుతుందిలే, చిట్టీ!

చి: ఊఁ...నాకిప్పుడే కావాలీ...నే నాడుకోవాలీ!...ఈఁ...

గౌ: మారాం చెయ్యకూడదు...అట్లాగైతే నాజతొద్దు......మేం వూరెళ్ళి, అంచక్కా పరమాన్నం తింటాం.

చి: నిజంగానా అత్తయ్యా...అట్టయితే నేనూ వత్తా, నీజతుంటా.

గౌ: మంచివాడివి, నువ్వు — మనిద్దరం జతి!!

చి: ఆ వూళ్ళో అన్నం; పప్పూ; కూరా — అన్నీ పెడతారా?

గౌ: ఓ...కావాలసినన్నీ!!

చి: భలే...భలే (చంకలు కొట్టుకుని) ఆకలవుతోం దత్తయ్యా. (నీరసంగా)

గౌ: వెళుతున్నాంగా! (చకచకా నడుపుతుంది)

రా: (ఆవును నిమురుతాడు)

[అందరూ ముందుకు నడిచి తెరలోకి వెళ్ళిపోతారు; ఆవు కూడా...ఇంతవరకూ కనిపించిన వీధిదృశ్యపుతెర లేస్తుంది. దాని వెనుకనున్న పొలాలదృశ్యపుతెర, నూతితో సహా కనిపిస్తుంది. నూతిప్రక్కను చనిపోయిన పశుకంకాళాలూ, కాకులూ వుంటాయ్. పై దృశ్యాంలోని అందరూ నిష్క్రమించిన వరుసప్రకారం, రెండవ వైపునుంచి ప్రవేశం.]

గౌ: ఇదేరా చిట్టీ, మన పొలం.

చి: ఇదేనా? నే నొకసారొత్తే అంతెత్తున జొన్నకంకు లున్నయ్‌గా?

గౌ: నాలుగేళ్ళనుంచీ వానల్లేక గరికన్నా మొలవటం లేదుగా!

బం: ఏటా గరికెడు పండేది...!

రా: మళ్ళీ ఆరోజు లెప్పుడొస్తయ్యో!

సు: మా ముత్తాత, రోజు కణా కానీ కూలిచొప్పున సంపాయించి, కొన్న పొలం యిది. ముళ్ళపొప్పలతో అడివిగా వున్న దాన్ని మా తాత చేతులు రక్తంకారేట్టు కొట్టి బాగుచేశాడు. మా అయ్యా అన్నదమ్ములు నలుగురూ రేయింబగళ్ళూ బాగుచేసి బంగారంలా చేసిపోయారు. నా పెళ్ళినాటినుంచీ, నీ పుటకలదాకా మిగిలిన పంటతో పాటిమట్టి కొనితోలాను.

రా: మనం ఆ నుయ్యి తవ్వటానికి రెక్కలిరుచుకున్నాంగదా, నాన్నా!

సు: అది తవ్వాక ఎంతబాగా పండిందిరా పొలం! కన్నతల్లి, కామధేనువు లాంటిది గదరా యీ గడ్డ!!

గౌరి: ఎంతటిదైతేనేం - వానల్లేక పాడైపోయె.

సు: (వంగి పిడికెడు మట్టితీసి) పట్టిందల్లా బంగారంచేసిన నేల!! మన వంశాన్ని పుట్టించి పెంచినగడ్డ. (నిశ్శబ్దంగా ఏడ్పు.)

రా: నిజం, అంతేగా నాన్నా.

సు: (పిడికిలిలోని మట్టినే చూస్తూ) మా బతుకులూ, సుఖాలూ...అన్నీ నువ్వే ...నువ్వే...నిన్నొదిలిన రైతు బతకలేడు.

గౌరి: రైతైనా - ప్రపంచంలో ఎవరూ బతకలేరు నాన్నా!

సు: (అదే చూపు) మా ముత్తాతలనాటి నుంచీ మా వంశాన్ని వుద్ధరించావ్...మా వంశానికి కూడూ, గుడ్డా యిచ్చావ్...మా కండలూ, రక్తమూ నీవల్ల పెరిగాయ్...

రా: గిద్దెడు నీళ్లు తడిపితే - ఎంత పండేదీ!!

బం: వానల్లేక నుయ్యే ఎండిపోతే, యిక పొలమేం తడుస్తుందీ...

రా: రెక్కలిరిగేట్టు తవ్వినా, మళ్ళీ నీళ్ళే పడవయ్యె.

సు: నిన్నొదిలి ఎట్లాపొయ్యేది; ఎట్లా బదికేది?

చి: నుయ్యి చూద్దామా అత్తయ్యా.

గౌరి: నీళ్లులేవు ... ఎంతోలోతు ... చూస్తే కళ్లు తిరుగుతయ్ చిట్టీ.

రా: ఇకపోదాం (గుటకమింగి) పదండి.

సు: (మట్టిని ముద్దు పెట్టుకుంటాడు).

రా: రా, నాన్నా.

సు: నే రాలేను... నా భూమా తను

వదిలి రాలేను. (మాట పారేసి, చతికిల బడతాడు.)

రా: అన్నీ తెలిసిన నీక్కూడా ఎన్ని సార్లు చెప్పాలి నాన్నా?

సు: నువ్వెన్నన్నా చెప్పు రాములూ - నే నీ కన్నతల్లిని వదల్లేను. నా శరీరం యిక్కడ బూడిదవ్వాలిశిందే.

గౌరి: ఛా - అవేంమాటలు నాన్నా! కాలం బాగుంటే మళ్ళీ నాలుగు నెల్లకే తిరిగొస్తాంగా!!

సు: ఊహుం... నేనొదల్లేను (భూమి మీద పడుకుని) నాకిక్కడే సుఖంగా వుంది...నా చేతుల్తో బలంచేసి, నీరెట్టి పెంచిన పచ్చని పైరులు గుర్తొస్తున్నాయ్... ఏనాడో పోయిన మా అమ్మ వళ్లో పడుకున్నట్లుంది.

బం: అయ్యొ దేవుడా...అవేం మాటలు మామయ్యా?!

సు: నాకు మతోయింది...పోయింది గనక నే యీ కన్నతల్లిని వదిలి పోదామని బయల్దేరాను.

రా: (వంగి, తండ్రిని లేపి) అదేమిటి నాన్నా-రా.

సు: నే(నాను...నన్నొదులు (గుంజుకుంటాడు)

రా: నా మాట విను నాన్నా- వానా కాలంరాగా నే తిరిగొద్దాం.

సు: ఈ శరీరంలో ప్రతిరోమాన్నీ యీ భూదేవి పెంచింది... నే నొదల్లేను. ... మీరు పొండి... నే నా తల్లిఒడిలో చస్తాను.

గౌరి: ఛా...అలాటిమాటలనకు నాన్నా ...రా, పోదాం (చేయిపట్టుకుంది)

సు: (గౌరిచేతిని వదిలించుకుని, లేచి, పరుగెత్తుతూ) నాతల్లిని నే వదల్ను...నా తల్లి...నాభూదేవి...

రా: నాన్నా (ఆత్రంతో)

సు: నేరాను...మీరు పొండి...(నూతి వైపు పరుగెత్తుతున్నాడు)

బం: మామయ్యా—!

సు: నాభూదేవి...నే వదుల్ను నాతల్లిని (నూతిలోకి దూకుతాడు)

గౌరి: నాన్నా. (నివ్వెరపోయి చూస్తూంటుంది.)

రా: (పరుగెత్తి, నూతి అంచుననిలచి) నాన్నా—

బం: మామయ్యో ... మామయ్యో - (శోకాలు.)

చి: (తండ్రికాళ్లకు పెనవేసుకుని) తాతయ్య...తాతా—

[అందరూ ఏడుస్తూండగా-తెర]

[మూడవదృశ్యం]

[రంగాలంకరణ: —ముఖ్యయవనికకు నాలుగడుగులు వెనుకగా, చుట్టూ అరగజం వెడల్పు నల్లనిబోర్డర్ గల తెల్లతెర. మామూలుగా రంగస్థలానికి ముందుండేలైట్లు—వెనుక తెరకు మధ్యగా వేలాడగట్టాలి. తెల్లతెరకు వెనుకనుండే మనుషులఛాయలు తెల్లతెర మీదపడి ప్రేక్షకులకు కనిపిస్తాయ్. ఈ క్రింది కరువుదృశ్యాలు వరుసగా తెల్లతెర మీద ఛాయాదృశ్యాలుగా కనిపిస్తుండగా— తెల్లతెరముందు ఓమూలగానిలచి బుర్రకథకులు ఆయా దృశ్యవిశేషాలు గానం చేస్తారు. వీరి ఆకారాలు కొంచెంగా కనిపించేట్లు, పాదాలకుదగ్గరలో గుడ్డిలాంతరుంటే చాలు. తెల్లతెరముందు కాంతి వుంటే ఛాయా దృశ్యాలు సరిగా కనిపించవు.]

బుఱ్ఱకథ :- మొదటిఛాయాదృశ్యం—

కనరా భారతపౌరా, వినరా-
కరువుబాధ నేడు॥

1. నెలరోజులుగా అర్ధాకలితో-
వెళ్ళబుచ్చె నామె
నాల్గునాళ్ళుగా కటికపస్తులతో-
నీరసించె నామె.

2. పొత్తిలిలోనీ పసిబిడ్డకుతా-
పాల నివ్వలేక
'పాడుజన్మ'మని తల్లిగుండెలూ-
బాదుకొంచునుండె.

3. ఎంతపీల్చినా పాలురాక శిశు-
గొంతుతడియలేదు.
విలవిలదన్నుక ప్రాణాల్ విడచెను-
వొడిలో బిడ్డండు.

4. వంశాంకురమే ఒక్కబిడ్డడూ-
నాశమగుట కేడ్చి
శోషవచ్చియా తల్లికూలెనూ-
దోషితానె యంచు.

5. ఆమెభర్త ఆరోజున ఎటులో-
అకులలము దెచ్చి
వండి తిందమని యింటికిరాగా-
నుండెనిట్లు యిల్లు.


6. నిద్రపోయిరని భార్యను బిడ్డను -
కదిపి జూచినాడు
దీర్ఘనిద్రలో మునిగినారనీ -
దీనముగా నేడ్చె.

7. భార్యాబిడ్డల నీ విధమ్ముగా -
కళువు కరగజేసి
బ్రదుకు టెందుకని గోడకు తలనూ -
బ్రద్దలేశాడు.

—: రెండవ ఛాయాదృశ్యం :—

అదుగదుగో అటు-చూడుడు బాబు
॥తంధానా తంధాన తంధన॥
పెద్దరెడ్డిదా-లోగిలి బాబు, ,,
జనమంతా అటు-మూగి రెందుకో ,,
తలుపులు తీసీ-చూడుడు బాబు, ,,
అదుగదుగో ఆ-దూలాల కదుగో ,,
ఉరులు వేసుకొని-వ్రేలుచుండిరీ ,,
పెద్దరెడ్డి మరి-భార్యాబిడ్డలు ,,

(53-వ పేజీ చూడండి)



ఒక దాక్షిణాత్య శిల్పానికి
గోటితో గీసిన ప్రతిరూపం.
—చిత్రకారుడు: శ్రీ వి. సూరన్న
(మద్రాసు)

కలదులే నీపాలి కామేశ్వరమ్మ

"గుర్తించడానికి వీల్లేనంతగా మారిపోయావు" అన్నది మా వదిన చిరునవ్వుతో.

"అంటే? బలిశానా? కుషించిపోయానా?" అని ప్రశ్నించాను.

"లావైవుంటే చింతలేదు, ఉన్నట్టుండి కృశించిపోవడానికి ప్రారంభించినట్టున్నావు" అన్నది వదిన.

"వదినా! నేను నీకు మరదిని, వదినలు మరదుల్ని పరిహసించడమనేది మన తెనుగుదేశంలో చాలా సహజమైనవిషయం. నువ్వు నాతో పరాచికాలాడాలంటే వద్దనను. ఐతే నిర్హేతుకంగా నామీద ఈ అపనింద మోపడముంది చూడూ, ఇదిమాత్రం అక్రమం, అన్యాయం" అన్నాను నేను.

"ఏమోమరి. నువ్వు మునుపటిలా లేవు" అన్నది వదిన.

"మునుపటిలా లేక ఏమైపోయానంటావు? నేను తెగబలిసి ఈ యింటి కడప పట్టనంత వాణ్ణైతేగానీ నీకు తృప్తికలిగేట్టు లేదు. ఐనా వదినా! మా నాన్నగారెంత సంపాదిస్తున్నారో నీకు తెలుసు. కానీ వారి స్వల్పసంపాదనపై ఆధారపడి మేము ఏడేనిమిది మంది ఎలా బ్రతుకుతున్నామో నీకు తెలియదు. ఒకవేళ మాలో ఎవరైనా పలచబారితే అందుకు కారణంవుంది. కానీ మా అన్నయ్య సంపాదనంతా నువ్వొక్కతెవే తిని, జీర్ణించుకుంటూ వున్నప్పటికీ ఎందుకిలా చిక్కి సగమైపోయావో నా కాశ్చర్యంగావుంది" అన్నాను నేను ఉబికివస్తున్న నవ్వును అపుకొంటూ.

నిజానికిమావదిన తీసిపోనూలేదు, పాడూలేదు. పుట్టుకతో నే స్థూలశరీర ఐన ఆమె ఇప్పుడు మరింతలావుగా తయారైంది. తన బ్రతుకు ఈలావుండగా ఆమె ఇతరుల సంగతి మనకెందుకని ఊరుకోవచ్చుగదా! అలా ఊరుకోకపోవడమే మా వదిన స్వభావంలో గల విలక్షణం.

"బస్సుదిగివచ్చిన వాడితో మాటలు పెట్టుకున్నావేమిటే? నువ్వు ముందు స్నానంచేసి రా నాయనా! ముఖం వాడిపోయింది. ఎక్కడ భోంచేశావో, ఏమో" అధికారమూ, అనునయమూ కలిసిన ధోరణిలో ఈ మాటలు వినిపించేసరికి నేను వెనుతిరిగిచూచాను. ఆమె నాకు అపరిచిత. వయస్సు అరవై కి పైన వుండవచ్చు. తలపండిపోయింది. కట్టుకొన్న చీరకూడా తెల్లనిది. ముఖంలో ముడుతలు లేవు. ఒక ముసలావిడనుగురించి ఇంతకన్నా ఎక్కువ చెప్పడం అనవసరమనుకుంటాను. ఐనా ఇంకొక్కమాట చెప్పకతీరదు. ఆ కర్ణాంత విశాలాలైన ఆమె నేత్రాల్లో నాకేకాదు, ఎవరికైనాసరే ఏదో ఒక రాజ్ఞీత్వం గోచరిస్తుంది.

ఆమె ఎవరో అడిగి తెలుసుకుందామని అనుకొంటూవుండగా, అన్నయ్య ఆఫీసు నుంచి వచ్చాడు. వదిన వడ్డించగా మేము ఇద్దరం భోంచేస్తున్నాం.

"ఈరోజు నువ్వు వస్తావని తెలియదు. లేకుంటే పాయసం చేసివుందును" అన్నది వదిన మా భోజనాలమధ్య. "నీపాయసం అలావుండనీ వదినా! ఈలాటి వంకాయల కూర నాజన్మలో తిని ఎరుగను. నలుడు, భీముడుకూడా నీ దగ్గర పాకశాస్త్ర పాఠాలు నేర్చుకోవలసిందే" అని మా అన్నయ్యముఖం చూచాను.

శ్రీ మధురాంతకం
రాజారాం

"ఒరి పిచ్చివాడా! మీ వదిన చేతిలో అంత విద్యఉంటే నాకిక లేనిదేముంది? ఇది మా అత్తయ్యచేతి వంట" అన్నాడు అన్నయ్య.

"అత్తయ్యా? నాకు తెలియకుండా ఎక్కడ సంపాదించావన్నా కొత్త అత్తయ్యని" అన్నాను.

"ఈమధ్య నే ఒకచోట దొరికిందిలే" అని మా అన్నయ్య ఆ సంభాషణ అంతటితో ఆపేశాడు.

దొరకడానికి అత్తయ్యేమైనా జడపదార్థమా అని నాకు ఆశ్చర్యంకలిగింది. కడుక్కొన్న చెయ్యి ఆరకమునుపే అన్నయ్య ఆఫీసుకు వెళ్ళిపోయాడు. రాకరాక వచ్చిన తమ్ముణ్ణి పరామర్శించడానికైనా అవకాశమివ్వని అతని ఉద్యోగం మీద నాకు కోపం వచ్చింది. ఆ కోపాన్ని ఎట్లా, ఎవరిపైన వినియోగించాలో తెలియక తీరిగ్గా కూచొని వున్న వదినతో ఉద్యోగుల్లో స్వాతంత్ర్యేచ్ఛ క్షీణించి, బానిసతత్త్వం వృద్ధైపోతోందని, సక్రమంగా ఉద్యోగం చేయాలంటే మాత్రం, మిగతా స్వంత కార్యాల్ని నిర్లక్ష్యం చేయడం ఆత్మద్రోహమనీ చిన్న లెక్చరు దంచాను. మా వదినకు నామాటలు అర్థమైనట్టులేదు. ఆమె మా అన్నయ్యకు ఇటీవలనే దొరికిన ప్రమోషనుగురించీ ఏడాదిక్రితం రెండువందలతో నే సాగిపోతూండిన తమ సంసారానికి ఇప్పుడు మూడువందలైనా చాలకపోవడం గురించీ మాట్లాడి, మాట్లాడి అలసిపోయింది. మళ్లీసేద తేరుకొన్న తరువాత తన అనారోగ్యంగురించి మాట్లాడ్డం ప్రారంభించింది. ఆమెకు ఆరోగ్యం తిన్నగా లేదని ఎవరూ అనుకోలేరు. ఎండమావిలో నీరుందని భ్రమించినట్టే మావదిన తన కేదో వ్యాధి దాపురించిందని నిర్ణయించుకున్నదేమోనని నా ఊహ. నా ఊహ నామెతో చెబుదామనుకొన్నాను కానీ ఆమె అనారోగ్యాన్ని గురించిన సంభాషణకు విసుగెత్తి "సంపాదన జాస్తీ అవుతున్నా ఖర్చులకు చాలనట్టే, నువ్వేమో లావెక్కుతున్నా, ఆరోగ్యం మాత్రం చెడిపోతున్నది" అన్నాను. ఈ మాటే మా అన్నయ్య గనుక అనివుంటే వదిన ధూంధాములు చేసివుండేది. నామీదవున్న వాత్సల్యంచేత ఆమె నాహాస్యంలో తప్పు పట్టదు.

ఇప్పుడైతే మా కుటుంబం చీలిపోయిందిగానీ, అన్నయ్యకూడా మావూర్లోనే వున్నప్పుడు చూడాలి తమాషా. అది అన్నయ్యకు పెండ్లైనకొత్త. నేను మూడవఫారం చదివేవాణ్ణి. ఎందుకో తెలియదుగానీ, అప్పుడు ప్రతిరోజూ మా అన్న వదినపై కోప్పడేవాడు. వదిన ఆయనపై అలుకపూనేది. వీళ్లిద్దరూ మామూలుగావుండకపోతే నాకేదో కొంతగా వుండేది. ఎలాగైనా వీళ్ళని నవ్వించాలని నేను పట్టుబట్టేవాణ్ణి; నవ్వించేవాణ్ణికూడా. అందువల్ల రాజుకూరాణికీ విదూషకుని పైన వుండగల ఆత్మీయత, అన్నకు తమ్ముని పైనా, వదినకు మరదిపైనా వుండగల వాత్సల్యం, ఈరెండూ వున్నవి మా వదినా, అన్నయ్యలకు నాపైన.

సాయంత్రం ఐదుగంటలకు వదిన "నీతో మాట్లాడుతూ కూచొంటే నాకు జరుగుతుందా? ఇంక వంటచేయాలి" అంటూ లేచింది.

"ఎందుకు జరగదు? గెజటెడ్ ఆఫీసర్ హోదాలోవున్న ఉద్యోగిభార్యవు, నువ్వు వంటచేయడమేం గ్రహచారం? ఐనా మీ వంటలక్కవుందిగా" అన్నాను నేను.

"వంటలక్కా? మా కెక్కడిది?" అ



వదిన నివ్వరపోయింది. "ఆ ముసలావిడ వంటలక్క కాదా?" అని ప్రశ్నించాను. ఎందుకో వదిన ముఖం క్షణంలో వన్నె తిరిగింది. ఆమె "నువ్వెప్పుడూ ఇలాగే తొందరపడి తెగవాగుతావు. ఎప్పుడో నా చిన్నతనంలో చనిపోయిన నా తల్లే ఈ రూపంగా మళ్లీ బ్రతికివచ్చిందని నేననుకొంటున్నాను. ఆమె నాకు ఇలువేల్పు" అన్నది.

"ఇంతకూ ఆమె ఎవరో తెలిపేభాగ్యం కట్టుకో వదినా!" అని ప్రాధేయపడ్డాను.

ఆమె పేరు కామేశ్వరమ్మట. అన్నయ్య నెల్లూరిలో వుద్యోగంచేస్తున్నప్పుడు వదినకు ఆమెతో పరిచయం కలిగింది. వీళ్లు బాడుగకువున్న ప్రక్క ఇంట్లోనే కామేశ్వరమ్మ నివాసం. ఒకసారి వదినకు టైఫాయిడ్ రాగా కామేశ్వరమ్మ తోడునీడై కాపాడింది. ఆమె తోడ్పాటు వినా వదిన బ్రతికివుండేదట. కాలక్రమేణా ఆమె తమతోబాటు వుండకపోతే బ్రతుకు సాఫీగా గడవదనుకొనే స్థితికి వచ్చేవారు వదినా అన్నయ్యలు. నెల్లూరునుంచి అన్నయ్య ఈ ఊరికి బదిలీకాగానే, కామేశ్వరమ్మ ఇక్కడికి తరలివచ్చేసింది.

"పానీలేవదినా! అన్నయ్య ఇంతసంపాదించిచేస్తున్న ఒకే ఒక సత్కార్యం ఏమంటే, ఒక అనాథను పోషించడం. ఆ పుణ్యం నీకుకూడా దక్కుతుందిలే" అన్నాను.

"అదిగో మళ్లీ తొందరపడుతున్నావు. ఆమె అనాథని ఎవరుచెప్పారు నీకు? ఆమెకు రాధామనోహరుడువంటి కుమారుడున్నాడు. అపరంజిబొమ్మలాంటి కోడలువుంది. ఆ ఇద్దరూ బొంబాయిలోవున్నారు. కుమారుడు ఏదో కాలేజీలో ప్రొఫెసరట" అంటూ వదినవెళ్లిపోబోయింది.

"కామేశ్వరమ్మ కథ కడుంగడు ఆశ్చర్యకరంగా వుంది వదినా! అది మధ్యలో ఆపేసి వెళ్తే నాకేమీ తోచదు" అని అడ్డుతగిలాను నేను.

"కామేశ్వరమ్మకు అయిదున్నరకంతా కాఫీ త్రాగకపోతే తలనొప్పివస్తుంది. మిగతాకథ నువ్వేఊహించుకో" అని వదిన వెళ్లిపోయింది.

ఒకటిరెండుకథల్ని స్వయంగా కల్పించి కూడా వ్రాసివున్న నేను, పూర్తికాని ఈకథను ఒకవిధంగా పూర్తిచేసుకోగలిగాను. ఐతే ఈలాటి సర్వసామాన్యాలైన సశేషపుకథల్ని పూర్తిచేసేందుకు రచయితే ఎందుకు? లౌకికజ్ఞానంగల మరెవరయినాసరే, ఈ పని సులభంగా చేసుకోగలరు. నే నూహించుకొన్నట్టు తరువాతి కథ సంక్షిప్తంగా యిది: కామేశ్వరమ్మ కొడుకు ఒక "రోగ్"ఐవుంటాడు. అతడు భార్యచేతి కీలుబొమ్మై తల్లిని నిరాదరణ చేసివుంటాడు. అందువల్లనే అతని పేరైనా తలపెట్టకుండా కామేశ్వరమ్మ పరుల పంచలో నివసిస్తోంది.

మార్చిలో ఎస్. ఎస్. యల్. సి. పరీక్షలు వ్రాసి ఏప్రిల్ అంతంలో కాబోలు అన్నయ్య దగ్గరికి వెళ్ళాను. ఆయన ఏదైనా ఉద్యోగం యిప్పించేవరకూ ఆ ఇల్లు వదలిపెట్టకూడదని నాదృఢ సంకల్పం. రెండుమూడువారాలు గడిచాయి. ఒకరోజు సాయంత్రం సినిమాకు పోవాలని వదినను డబ్బు అడిగాను. డబ్బు నాదగ్గర లేక కాదు, అలా అడగడమంటే నాకు సరదా! మరి వదినకు డబ్బు ఇవ్వడంకంటె లేదు లేదనడం, సినిమాకు పోరాదని హితోపదేశంచేయడమంటే సరదా! ఈవిషయంపైన మేము వాదులాడుకొంటూవున్నాం. కామేశ్వరమ్మ లోపలినుంచి వచ్చి ఒక ఐదురూపాయల నోటు నా చేతికిస్తూ "వెళ్లిరా నాయనా సినిమాకు" అన్నది.

నేను దిగ్భ్రాంతితో "అవ్వా వద్దండి. నేను ఊరికే వదినను అడుగుతున్నాను నా దగ్గర డబ్బులేక కాదు" అన్నాను.

"నీదగ్గర డబ్బు వుందో లేదో నాకు తెలియదు. ఈరోజు సినిమాకు నిన్ను నేను పంపుతాను. ఇకమీదైనా నువ్వు సినిమాలకు వెళ్ళినప్పుడైనా నన్ను డబ్బిమ్మంటుంటే నాకదేచాలు" అన్నది కామేశ్వరమ్మ. ఆమె ఇస్తున్న డబ్బును నిరాకరించడానికి నా స్వాభిమానం, మనస్సు, బుద్ధి ఏవీ ఒప్పుకోలేదు. అందుకుతోడు వదినకూడా "తీసుకో, తీసుకో" అని బలవంతపెట్టింది. సినిమాకు పోవాలంటే ఐదురూపాయల నోటు విసిరిపారేసే కామేశ్వరమ్మను తల్లిగా సంపాదించుకొన్నందుకు నావదినను నేను మనసులోనే అభినందించుకొన్నాను.

ఆ మరునాడు తెల్లవారి వదినకనబడగానే "ఐతే మీ అమ్మగారి దగ్గర ఎంత కాసువుంది వదినా?" అని అడిగాను.

"బాంకిలోవున్న పదివేలరూపాయల మాటలటుంచగా, కుమారుడు బొంబాయి నుంచి నెలనెలా ఏభైరూపాయలు పంపిస్తాడు" అన్నది వదిన.

హాల్యకోని క్రాస్‌వర్డ్ పజిల్లా తయా

★ 'కొత్తగొడుగు' ★



కలదులే నీపాల కామేశ్వరమ్మ

రైంది మళ్లీ కామేశ్వరమ్మ కథ! తరువాత తీరిగ్గా సాల్వుచేసుకొనే ఉద్దేశంతో "అమ్మదొంగా! ఆ డబ్బంతా నువ్వే కొట్టేయాలనుకుంటున్నావా ?" అన్నాను వదినతో. వదినేదో బదులు చెప్పబోయింది కానీ, ఇంతలో ప్రక్క గదిలోనుంచి కామేశ్వరమ్మ బయటికి వచ్చింది నవ్వుతూ. ఆమె ఆ గదిలో వుందని నాకేం తెలుసు ? దొరికిన దొంగ వలే తలవంచుకొన్నాను. కామేశ్వరమ్మ నాదగ్గరకువచ్చి "వదిన కెందుకయ్యా డబ్బు ? మీ అన్నయ్య సంపాదనే ఆమెకు చాలు. మరి నువ్వింకా పెండ్లికాని వాడివి, ఉద్యోగంలేనివాడివి, నా డబ్బంతా నీకిచ్చేస్తాను, తీసుకో" అన్నది.

నేను డంగై పోయాను!

కామేశ్వరి అన్న పేరులోనే ఏదో మాధుర్యముంది. లేకుంటే "సుకృతాత్ములు, రససిద్ధులు, సుకవీంద్రులు" చెళ్లపిళ్లవారు ఆమెనెందుకు ఇష్టదేవతనుచేసుకొంటారు? ఐతే మానవాంగనలు ఆపేరుంచుకొన్నంతమాత్రాన అంతటి వారౌతారా ? కాగలరేమో ననిపించింది, మా కామేశ్వరమ్మను, చూచిన తరువాత ! కామేశ్వరీదేవి కున్నంత మహాత్యం లేకపోవచ్చు. కానీ ఆదేవి అంశలో ఏసహస్రాంశమో ఈ కామేశ్వరమ్మలో నెలకొనివుంటుంది. లేకుంటే ప్రేమ, కరుణ మొదలైన దైవిక గుణాలే ఆకృతి గొన్నట్టుగా ఆమె మాకెందుకు గోచరిస్తుంది ?

కామేశ్వరమ్మ ప్రభావం నాపై ప్రసరిస్తున్న ఈ సమయంలో ఉన్నట్టుండి ఒకనాడామెకు జ్వరంవచ్చేసింది. విలయం సంభవించినా ఆఫీసు ఎగగొట్టలేని మా అన్నయ్య మూడురోజులు సెలవు పెట్టేశాడు. ఆరాత్రే బొంబాయికి వైర్ వెళ్లింది. వైర్ వెళ్లిననాల్గురోజులకు కామేశ్వరమ్మ కొడుకూ, కోడలు వచ్చిచేరారు.

కామేశ్వరమ్మకొడుకు స్ఫురద్రూపి. అతనివేషంలో పూర్తిగా తెనుగు తనం ప్రతి ఫలిస్తుంది. చూడ్డానికి చాలామంచివాడుగా కనబడతాడు. ఐతేనేం ? కన్నతల్లిని దగ్గరుంచుకోలేని కఠినుడు !

కామేశ్వరమ్మ కోడలు మా వదిన అన్నట్లు అపరంజి బొమ్మకాదు, నే ననుకొన్నట్లు అందాల బరిణా కాదు. సామాన్యమనుజభామిని ! ఐతే ఆమె హావభావ ప్రకటనలు, నడకలో ఒయ్యారాలు, చూపుల్లో విభ్రమాలు, మాటల్లో తీయందనాలు ఎంతటివాణ్ణయినా ముగ్ధుణ్ణిచేస్తాయి. ముగ్ధుడై మైమరచిపోబట్టే ఆమె భర్త తల్లిని పరుల పంచలో విడిచిపెట్టి లోకంలో తల ఎత్తుకొని తిరుగుతున్నాడు !

కొడుకునూ, కోడల్నీ చూడగానే కామేశ్వరమ్మముఖం వికసించింది. ఆమరునాటికి జ్వరం ఏమయ్యిందో కానీ ఆమె అటూ, ఇటూ తిరుగసాగింది. విచారించగా, కొడుకునూ, కోడల్నీ చూడాలనుకొన్నప్పుడల్లా ఆమెకు ఏదో ఒక జబ్బు వస్తుందనీ, చూడగానే నయమై పోతుందనీ తెలిసింది. ఇది నిజంగా విచిత్రమైన విషయం. ఆ మాటకు వస్తే కామేశ్వరమ్మే విచిత్రమైన వ్యక్తి !

నాకు అనేకమందిని గురించి మొట్టమొదట దురభిప్రాయపడడం, తరువాత అలా అనుకొన్నందుకు పశ్చాత్తాపపడడం మామూలైపోయింది. కామేశ్వరమ్మగారి కోడలి విషయంలో కూడా సరిగ్గాఇలాటి పొరబాటే జరిగింది. ఆమె నేననుకొన్నట్టుగా - వగలాడికాదు. సాధ్వి. ఆమె హావభావప్రకటనల్లో ఏదైనా విలక్షణముంటే, అది ఆమె ఏడెనిమి దేండ్లుగా బొంబాయి నగరంలో గుజరాతీ, మహారాష్ట్రస్త్రీల సాహచర్యంలో వుండినందువలన కలిగినఫలితం. నడకలో ఒయ్యారముండడంచేత ఆమెను జాణ అనుకోవడం నా పొరబాటు. అసలు స్త్రీలనడకలో ఒక ప్రత్యేకతవుండి తీరాలి. అది లేకుండా స్త్రీలుసైతం పురుషునివలే నడిస్తే శృంగారం సగం చచ్చి ఊరుకొంటుంది.

మహాపతివ్రతలుకూడా సహగమనలో, మత్తే భయానలో ఐవున్నారు కాబట్టి, నడకలో ఒయ్యారమున్నందుకు కామేశ్వరమ్మ కోడల్ని మరోకవిధంగా భావించడం నాబుద్ధిజాడ్య జనితో న్మాదం! మరి చూపుల్లో విభ్రమాలుగానీ, మాటల్లో తీయందనాలుగానీ కృత్రిమంగా కలుగజేసుకొనబడేవి కావు, భగవంతుడిచ్చేవి. ఈలా ఆలోచించుచూడగా కామేశ్వరమ్మ కోడలిపైనకూడా నాకేదో గౌరవ భావం కల్గడం ప్రారంభించింది.

వారంరోజుల తరువాత కామేశ్వరమ్మ కొడుకూ, కోడలూ వెళ్లిపోయారు. వెళ్ళే సమయంలో కామేశ్వరమ్మ కోడలు వెక్కి వెక్కి ఏడ్చింది, ఆమె తమతో రానం

కలదులే నీపాల కామేశ్వరమ్మ

దుకు ఆ ఏడుపు హృదయ విదారకం. ఐనా కామేశ్వరమ్మ చలించలేదు, రానంటే రానన్నది.

కామేశ్వరమ్మ కొడుకుతో నివసించడానికి ఎందుకు నిరాకరిస్తుందో అనూహ్యం. కథారచయిత పరేంగితావగాహిగావుండి తీరాలన్నారువిజ్ఞులు. ఐతే ఇతరుల్ని అర్థం చేసుకోడంలో నా నేర్పు ఏడ్చినట్టేవుంది. ఇందుకు సరైన ఉదాహరణం ఆదినుంచీ కామేశ్వరమ్మ విషయం నాకు చిదంబర రహస్యంగానే వుండిపోవడం. ఆఖరుకు మా వదిన చెప్పకపోయివుంటే నేనామెను గురించి ఏ నిర్ణయానికీ రాక నే పోయి వుందును. నా బుద్ధిహీనతకు చింతిసూ, ఇకనైనా నా స్వంతఅభిప్రాయాలతో అసలు కథలు తారుమారుచేయకుండా వదిన నాతో చెప్పిన విషయాన్ని ఉన్నదున్నట్టు వ్రాసేస్తున్నాను. కామేశ్వరమ్మకు ముగ్గురు కుమారులట. ఆమెకు పాతికేళ్లున్నప్పుడే భర్త చనిపోయాడు. అతడు చనిపోయే నాటికి ఏభై ఎకరాల పొలమూ, ఐదు వేల రూపాయల రొఖ్ఖమూ సంపాదించాడు. ఆ డబ్బుతో ఆమె ముగ్గురు కుమారుల్ని బి. ఎ. వరకూ చదివించింది. పెద్దకొడుకు పట్టా చేతబట్టుకొని ఏదో ఉద్యోగంలో ప్రవేశించాడు. అతడు ఉద్యోగం చేసింది ఒకటంటే ఒక నెల. మొదటి నెల జీతం తెచ్చి తల్లిచేతి కిచ్చిన మరునాడే అతడు హఠాత్తుగా హృద్రోగంచేత మరణించాడు. రెండవ కుమారునికీ ఇదేగతి తటస్థించింది. అతడు మొదటి నెలసంపాదన తెచ్చి తల్లిచేతికిచ్చిన వారం రోజుల్లో ఒక కారు ప్రమాదంలో కాళ్లుచేతులు విరిగి హాస్పటల్లో మరణించాడు. ఇద్దరు కొడుకులూ ఇలా ఐపోవడంతో కామేశ్వరమ్మకు మతి చలించిపోయింది. తరువాత కొన్ని నెలలకు కోలుకుని మామూలుమనిషి కాగలిగినా, ఆమెకు తన మూడవకొడుకువిషయమై దిగులు మరింత హెచ్చింది: ఈ పరిస్థితిలో ఎవడో ఒక జ్యోతిష్కుడు ఆమె తన కొడుకుల సంపాదన అనుభవించడానికి ఇచ్చిపెట్టుకోలేదనీ, అలా అనుభవించిన తక్షణం కొడుకులు మృత్యువువాత పడటం జరుగుతుందనీ ఘంటాపథంగా చెప్పేడు. అందువల్ల మూడవకుమారుడు ఎంత పట్టుబట్టినా కామేశ్వరమ్మ అతని దగ్గర వుండలేకపోయింది. తినెక్కడున్నా, తన కొడుకు క్షేమంగా బ్రతకాలని ఆ కన్నతల్లి ఆశయం. ఆ ఆశయసిద్ధికోసమే ఆమె కొడుకుతో వెళ్ళలేదు. అతడు నెలనెలా ఏభై రూపాయలు పంపిస్తున్నా అందులోనుంచి ఆమె చిల్లిగవ్వైనా ముట్టదు. ఆ డబ్బును పేద విద్యార్థులకో, అనాథసంరక్షణాలయాలకో ఆమె దానం చేస్తుంది, తన కుమారుని శ్రేయస్సు కోరుతూ.

ఐతే పుత్రునికి దూరమైన కామేశ్వరమ్మలో వున్న పుత్రప్రేమ ఏమౌతుంది? అది దగ్గరున్న ఇతరులపైకి ప్రసరించక తప్పదు. మాతృత్వమే కరుడుగట్టిన కామేశ్వరమ్మకు, కుమార్తె లేని లోటు మా వదిన వల్ల తీరిపోయింది.

ఆ ఇద్దరు కొడుకుల మరణాల్ని మనం కాకతాళీయంగా భావించవచ్చు. జ్యోతిష్కుని మాటలు బూటకమని కొట్టివేయవలావచ్చు. ఐతే కామేశ్వరమ్మ నమ్మకాన్ని మాత్రం కించిత్తైనా మార్చలేం. ఈ నమ్మకంవల్లనే మా వదినకు తల్లిగా, అన్నయ్యకు అత్తగా కామేశ్వరమ్మ అవతరించగల్గింది. ఇదేదో పూర్వజన్మ సంబంధం. త్రెంపినా తెగని అనుబంధం!

మదరాసులో ఉద్యోగం దొరికి, నేనక్కడనుంచీ వచ్చేసే సమయంలో వదిన మా అమ్మగారి నొక్కసారి వీలుజేసుకొని రమ్మని మరీ మరీ కోరింది. "ఇంతమాత్రం నేనామెకు కుమార్తెనై వుంటే సంవత్సరాని కొక్కసారైనా వచ్చి పోదా? ఈ వూళ్ళో నా అన్నవాళ్లు లేక ఎంతకాలమని వుండను" అని ఆక్రందించింది.

"నీకేం వదినా! నీపూర్వజన్మసుకృతంవల్ల మా అన్నయ్యకు మంచి ఉద్యోగం దొరికింది. అంతేగాక, సిరి తనంతగా తానే వలచివచ్చినట్టు ఎప్పుడో చనిపోయిన నీ తల్లి మళ్ళీ నిన్ను వెదుక్కొంటూవచ్చింది. నీ కెందుకు చింత? కలదులే నీపాల కామేశ్వరమ్మ!" అని నేను ఒకసారి వదినకు కామేశ్వరమ్మకు నమస్కరించి జట్కాలో ఎక్కి కూర్చున్నాను. ★

కథానాయకుడు

నా పేరు చిన్న గుమాస్తా. అందరికీ నేను చిన్న గుమాస్తానే. దీనికంతకీ మా నాన్నే కారణం. అంతా మా నాన్న చేసిందే. ఆ పేరుతో పిలిపించుకోవడం నాకెప్పుడూ ఇష్టంవుండదు. నా పేరు ఎవరికీ తెలీదు. నేను చిన్నతనంనుంచీ ఏ పనిచేయకూడదని బిగ్గరగా నిశ్చయించుకుంటూవచ్చానో, ఆ పనే నాకు ఇష్టం లేకపోయినా, నా అంతట నేనుగా తు. చ. తప్పకుండా వేళకి హాజరై చేస్తున్నాను. లేకపోతే ఉద్యోగం కాస్తా ఊడలాక్కుంటారేమో అని భయం. తిండికోసం బట్టకోసం కట్టుకొన్న భార్యాబిడ్డలకోసం నలుగురిలో నూ హీనపడకుండా నిలబడడంకోసం ఈ ఉద్యోగం చేస్తున్నాను. ఇందులో ఏ పుణ్యమూ, పురుషార్థమూ లేని మాట వాస్తవమని త్రికరణశుద్ధిగా మీ అందరిముందూ మనస్ఫూర్తిగా చెబుతున్నాను. నాకు తెలుసు ఈ వైభవంకోసమే మీరంతా ఎదురు చూస్తున్నారని!

నేను మా నాన్న మాట కాదని ఏదో గొప్ప ఉద్యోగం వెలిగిద్దామనుకోలేదు. మా నాన్న గుమాస్తాయే. నేనూ గుమాస్తానే. మా అబ్బాయికీ పెద్దఉద్యోగం చేయాలనే ఆశవుంటుంది. ఉండడంలో తప్పులేదు. కాని అది ఎట్లానూ సాధ్యపడకపోవడం నిజం. నాకూ వాడు గొప్పహోదాలో వుండాలని వుంటుంది. ఏ తండ్రి తన కొడుకు గొప్పవాడు కావాలని కోరుకోడు గనక? మా అబ్బాయికీ గుమాస్తాగిరీ అంటే అసహ్యమే. పోషించేవాడిని నేను గనక, వాడికింకా రెక్కలురాలేదు గనక, నామీదే ఆధారపడిఉన్నాడు కాని లేకపోతే ఏనాడో లేచిపోయి వుండేవాడే నేను చేసే ఈ గుమాస్తా ఉద్యోగానికి. వాడు నాదగ్గర ముళ్ళమీద ఉన్నట్లే ఉన్నాడు. కానీ వాడికి తెలియడంలేదు. కొద్దిరోజుల్లో ఇదే ఉద్యోగం చాలుననుకొని దీనికే తనూ ఎగబడతాడు. అందుకే వాడిని పైకి చదివించే ఉద్దేశమూ లేదు. తాహతూ లేదు. ఎట్లాగూ వాడు గౌరవనీయులు, ఏలినవారైన శ్రీ సర్కారువారి నౌకరీ చేసికొంటూ పెళ్ళాం పిల్లలని పోషించుకుంటే చాలదూ? అంతకంటె ఆశ కూడదు. ఆశకు అంతేమిటి?—

అందరూ పెద్ద ఉద్యోగాల కెగబడే వాళే ఐతే చిన్న ఉద్యోగాలు చూసే వాళ్ళెవరూ! ఏదో అట్లా ఎగబడడమే మంచిది! మావాడికి చప్పున చిన్న ఉద్యోగం దొరికితీరుతుంది. వాడికీ పెళ్ళవుతుంది. మరోగుమాస్తాకి ఎక్కడో ఈపాటికి ఆడపిల్ల పుట్టేవుంటుంది. పుట్టకుండా వుండదు. వాడికీ ఆడపిల్లల కొరత వుండదు. నిజానికి ఇంటి అందం ఆడపిల్లలతోటే-పెళ్ళిళ్ళు చేయలేక అట్లా నిరసనగా వుంటాం కాని, ఆడపిల్ల అంటే లక్ష్మీదేవే కదూ! మా వాడి


'కనక్ ప్రవాసి'

పిల్లల పెళ్ళిళ్ళనాటికి ఇంతలేసి కట్నాలు వుండవు. అప్పటికి ప్రపంచం చాలా మారుతుంది. కట్నాల నిషేధంబిల్లు తప్పక వచ్చి తీరుతుంది. కాదనుకోవడానికి వీల్లేదు. ఫరవాలేదు మావాడి బ్రతుకు మావాడు ఎట్లానూ బ్రతకగలడు. ఆ ధైర్యం నాకుంది.

మా నాన్న నన్ను ఎప్పుడూ పూర్తి పేరుతో పిలవలేదు. అమ్మకూడ అంతే. అందరూ ఆడపిల్లలే పుట్టుకొస్తూవుండడంచేత (గుమాస్తాసహజగుణం), మగపిల్లవాడు కనక పుడితే 'ఫలానా దేముడి' పేరు పెడదామనుకొన్నాడట. తీరా పుట్టాక పూర్తిగా దేముడిపేరు పెట్టడం ఇష్టంలేకపోయింది. అందుచేత సగం దేముడిపేరు, మిగిలిన సగం మా తాతయ్యపేరు చేర్చి తన సంతృప్తిని వెళ్ళబుచ్చాడుట. మావాడు కలక్టరీ చేస్తాడనో, గవర్నరీ వెలిగిస్తాడనో నేను పుట్టనిక్రితంనుంచీ సర్వసాధారణంగా గుమాస్తా ఆశలు, కలలు కనివుండేవాడు. దేవుడిపేరు పెడతానని దేముడికి ఆశ కల్పించే వాగ్దానం ఒకటి చేసి మా నాన్న తద్భిన్నంగా మా తాతపేరుమీద అత్యంత శ్రద్ధ వహించి దేముడిని తక్కువ చేయడంవల్ల, నామీద మా నాన్న ఆశలకు ఆ దేముడే అంతరాయం కలిగించి వుండాలని నాకు నమ్మకం. లేకపోతే మా నాన్న ఆశించినట్లు, ఏ గవర్నరునో అయి, నా నిజనామంతో, ఖంగున మీలో మ్రోగక పోయేవాడినా?

★ కథానాయకుడు ★

ఏ తప్పు మానాన్న దేముడిపట్ల చేశాడనుకుంటున్నానో అదే నేనూ మా కుర్రాడిపట్ల కూడ అనుకోకుండా చేశాను. మా నాన్న కొంచంతోటే సరిపెట్టి వదిలాడు. నేను చాలా కోరికలు చూపెట్టాను! అందుకే దేముడికి నేనంటే మండుతూ వుండాలి! ఇంతా చేసి నాన్న నన్నెప్పుడూ పూర్తిపేరుతో పిలవలేదు. మా అమ్మ కూడ 'బాబీ' అనే పిలిచేది ఒట్టుపెట్టినట్లు. ఒక్కసారీ పొరపాటునకూడ పూర్తి పేరుతో పిలిచేది కాదు. ఎందుకంటే నా పేరులో మా తాతయ్య పేరుకూడా వుందని భయం. మా నాన్నకూడ తండ్రిపేరును ఉచ్చరించటానికి ఎందుకో విముఖుడుగా వుండేవాడు. మా అమ్మ నిర్భయంగా మామగారిపేరును ఉచ్చరించటానికి ఎంత దన్ను ఉండాలని? తమ్ముళ్ళు, చెల్లెళ్లు, నాపేరెట్టి పిలుస్తుంటే - "ఆ బొడ్డుకోసి పిలవడమేమిటి! అన్నయ్యా అని పిలవలేరూ" అని ఇంటిల్లిపాదీ వాళ్ళమీద విరుచుకుపడేవారు. మా అక్కయ్యలు నన్ను పేరు చివర 'గా' తగిలించి పిలిచే వాళ్లు అసహ్యంగా. అప్పట్లో నేను అన్నీ ఎంత సహనంతో భరించి ఊరుకున్నదీ ఇప్పుడు తెలుస్తూంది. స్కూల్లో కుర్రాళ్లు నా కింకోపేరు పెట్టి పిలుస్తూండేవారు. మా క్లాసు టీచర్లకు నేను జీవితాంతం కృతజ్ఞత తెలుపుకుంటూనే వుంటాను. ఎక్కడైనా నా పేరుకు సంపూర్ణమైన (నా దృష్టిలో) నిజమైన గౌరవం దక్కిందంటే; అది అప్పట్లో క్లాస్ టీచర్ల దగ్గరా, తరువాత వందా రెండువందలూ అప్పిచ్చే వాళ్ళదగ్గరా, (ప్రామిసరీ నోటులో) అని చెప్పుకోగలుగుతున్నా. కానీ స్కూలు ఫైనల్ లో కొచ్చేసరికి ఒక తిక్క లెక్కల మాస్టరు వచ్చి ఒక్కసారి పాతపద్ధతికి స్వస్తి చెప్పాడు. ప్రారంభంలో ఇంతంత పేర్లేమిటని ఏడిపించేవాడు. తరువాత, తరువాత పేర్లు కుదించుకోమనేవాడు. తాను గా పూనుకొని ఎటెండెన్సు పిలిచేటప్పుడు అందరినీ, కుదించి పిలిచి, మామీద ఉండే తన కసిని (తృప్తిని) సాధించుకొనేవాడు.



అప్పట్లో నాకు ఆయనమీద మహాకోపంగా వుండేది. అయినా నన్నొక్కడినే అట్లా కించపరచటల్లేదని, క్లాసందరికీ జరిగే సన్మానమే నని — అందరిలోనూ, నేనొకడిగా భావించుకుని సంతృప్తిపడేవాడిని. నాకు స్కూలులో కూడ ఏ విధమైన పేరు ప్రఖ్యాతులూ లేవు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. నేను పరిమళించే పువ్వును కాదుగా. నాలోది గుమాస్తా రక్తం. నేను గుమాస్తా వాసన కొడతాను.

స్కూలుఫైనలు అయిన తరువాత ఊరికే కూర్చోనని, ఏదో చదవడమో, ఉద్యోగంలో చేరడమో జరుగుతుందని మాత్రమే నాకు తెలుసు. కాని ఖచ్చితమైన గుమాస్తాగా నన్ను నేనెప్పుడూ ఊహించుకోలేదు. ఆ లెక్కల మాష్టారు, పాపం; చచ్చి ఏ లోకాన ఉన్నాడో మహానుభావుడు "స్కూలుఫైనలు తరవాత ఏం చేస్తావని" నన్ను అడగడం పోయి, "ఏదో గుమాస్తా ఉద్యోగం చూసుకో — పెద్ద చదువుల్లో మాత్రం ఏముంది గనక — పెద్ద ఎత్తులకు పోకు. ఐదు వేళ్ళూ నోట్లోకి పోయేటట్లైతే చాలు–అదృష్టముండాలి కాని పెద్దచదువులేం చేస్తాయని" అన్నాడు ఆయనే ముందుగా. ఆయన చెప్పింది చాలా న్యాయమైనది. ఆయన చెప్పినట్లు అదృష్టమనేది ఉండాలి. అది అందరికీ లభ్యమైతే ఇక కావలసిం దేమిటి?

నేను బుద్ధిమంతుడననీ, తెలివైనవాడిననీ ధైర్యంగా చెప్పుకోడానికి ఎంతమాత్రం జంకను. స్కూలుఫైనలు మొదటి ఛాన్సులోనే ఆ కాసిన్ని సర్వీస్ కమిషన్ మార్కులు తెచ్చుకోగలిగాను అంటే అది నాబుద్ధిగా చదువుకోటాన్ని స్వంత తెలివిని తప్పించి, వేరు కాదని మీకు తెలియదా! ఎస్. ఎస్. ఎల్. సి. రిజిష్టరు వచ్చాక మా నాన్న ఒకటే అడిగాడు "సర్వీస్ కమిషన్ పరీక్షకి సరిపోయే మార్కులు వచ్చాయా" అని—అప్పుడే ఆ ప్రశ్నను బట్టి నిశ్చయించుకున్నాను నాన్నకు నన్ను పైకి చదివించే ఉద్దేశం ఎంతమాత్రమూ లేదని. ఆ ఉద్దేశమే ఉన్నట్లయితే నన్ను ఇలా గుమాస్తాగా పిలిచే అవకాశం మీకుండునా? నేడీ అవకాశం కల్పించడానికి ఆనాడు మీకోసం మా నాన్న నన్ను తయారుచేశాడు. ఆయనకు "వచ్చాయి" అని నానుంచి సమాధానం రాగానే ఉత్సాహం కలిగింది. అయినా ఆయన "ఎట్లాగూ వస్తా యనుకున్నా" అని తేల్చేశాడు. నిజంగా కష్టపడ్డది నేను. ఆయన కొమాత్రం సానుభూతి లేకపోతే ఎట్లా?

గుమాస్తాగిరీ సంపాదించుకోవడం ద్వారా నేను మా నాన్నకు కొడుకు నని

పించుకొన్నాను. చిన్నతనంనుంచీ నన్నెరిగిన పెద్దవాళ్లు "ప్రయోజకుడు — బుద్ధిమంతుడూ"—అని ప్రశంసించారు. మావాళ్లు ఆ ప్రశంసను, మా కుటుంబానికే గర్వ కారణంగా భావించారు. ఎంత ప్రయోజకుడినీ కాకపోతే నెలకి 80 ఎట్లా సంపాదించ గలుగుతున్నారు. ఎంతటి బుద్ధిమంతుడినీ కాకపోతే మినుగుల్లో మట్టిబెడ్డలా వుంటూ, పేచీ పూచీలు లేకుండా, ఎండకీ వానకీ జడవక, వేళకి ముందే ఆఫీసు మొగంతో పోతూ, వేళదాటిన తర్వాత వస్తూకూడా ఆఫీసుచాకిరిని చంకనెట్టుకొని, ఇంట్లో అవసరాలను వాయిదా వేస్తూ ఆఫీసే సర్వస్వంగా నౌకరి చేసేదెవరు. చాకిరినాది. మంచి పేరులు నా గుమాస్తా సోదరులవి.. వాళ్లు తెలివైనవాళ్ళయితే అవుదురుగాక, ఆఫీస్‌వర్క్ తమది కానట్లు తిరగడం ఏమంత భావ్యం ?

ఒక్కరోజునే కష్టానికి తగిన ఫలం లభిస్తుందా ? ఎవడో తన పని చేసిపెట్టానని (దయతల్చి) ఒక అరటిగెల పంపాడు. దాంతో పిల్లలిద్దరికి జ్వరాలు తగిలి వారం రోజులు మంచానపడ్డారు. నా మట్టుకు నాకూ పడలేదు. మొన్న ఎవడో పనిమీద వచ్చి కాఫీహోటల్ కు తీసికెళ్ళి "ఇంతే దగ్గరున్నాయి నాలుగు రూపాయలు" అంటూ నా చేతిలో పెట్టబోయాడు. "అబ్బే! వద్దు! వద్దు!" అన్నాను. లోపల ఆశ ఏడిపిస్తూనేవుంది. అతనిచేత, కాదూ కూడదు అనిపించుకొనే; జేబులో వేసికొంటుంటే దూరంగా కూర్చున్న గుమాస్తాసోదరుడి కంట బడింది. అతని ఏడుపు - నేనేదో వందలూ వేలూ తింటున్నానని! ఖర్మంజాలక తప్పి జారి పుచ్చుకోవడం వాళ్ళకి కన్నెర్ర. వాళ్లు ధైర్యంగా నిలవేసి వసూలుచేస్తుండడం ఘరవా లేదు పాపం!! ఇంతా చేసి సరిగా ఒక్కపూటకి ఇంట్లోకి రాదు.

నేను చిన్న గుమాస్తాని, మా ఆవిడ చిన్న గుమాస్తా పెళ్ళాం; మా అబ్బాయి (గౌరవంగా) చిన్నగుమస్తాగా రబ్బాయి. ఎవరికీ నాపేరు తెలీదు. పేరు ఉండీ లేనివాళ్ళలోనే జమ అవుతున్నాను. పొధవగోల! షావుకారు కాతాలో కూడ 'చిన్న గుమాస్తా' అనే రాస్తాడు. పేరు అడిగి వ్రాయరాదూ? - నా పూర్తి పేరుతో వీళ్ళకు ఎందుకు సంబంధంలేదో! కాని ఎప్పుడైనా పొరపాటున ఎవరైనా పేరెట్టి పిలిస్తే ఏదో తప్పుచేసినవాడిలా, సిగ్గుపడిపోతాను. అసలు పేరుతో పిలిపించుకొనే గౌరవం ఎన్నాళ్ళకు! అనిపిస్తుంది. ఆప్తబంధువుని చూసినట్లూ, ఖరీదైన సిగరెట్టు కాలుస్తున్నట్టు అనిపిస్తుంది మనస్సుకి - ఆ పేరుకు మొగం వాచిపోయినట్లు ఎంతో అనురాగం పుట్టుకొస్తుంది.

అంచనాకు అందని ఆటవికులు!

ఆటవికుల జీవిత రీతుల్ని గురించి పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్త ఒకాయన అడవిలో వుంటూ, అక్కడి కోయ వాళ్లతో బాగా పరిచయం చేసుకొన్నాడు. ఆ కోయ వాళ్లు కూడా యీయన అంటే ఎంతో గురుభావంతో మెసులుకొంటూ వుండేవారు.

ఇలా వుండగా ఒక రోజున వృథైపళ్ల కోయవాడొకడు యీయనదగ్గరకు ఏడుస్తూ వచ్చాడు. 'ఎందుకు ఏడుస్తున్నావ'ని శాస్త్రవేత్త అడిగాడు. 'మానాన్న కొట్టాడ'ని ఆ కోయవాడు సమాధానం చెప్పాడు. 50 ఏళ్ల కొడుకుని పట్టుకొని కొట్టగల తండ్రి వున్నాడంటేనే ఆశాస్త్రవేత్తకు చాలా అబ్బురం తోచింది. ఆ తండ్రి ఎలా వుంటాడో చూద్దామని బుద్ధి పుట్టి "మీ నాన్నగారిని చూపిస్తావా; మీ యింటికి వస్తాను" అని అడిగాడు.

కోయవాడు ఆయనను తన యింటికి తీసుకు పోయాడు అక్కడ 85 ఏళ్ల ముసలివాడొకడు పార పట్టుకు త్రవ్వుతున్నాడు. అతడికేసి చూపించి 'ఆయనే మా తండ్రి' అని కోయవాడు చెప్పాడు. శాస్త్రవేత్త త్రవ్వుతున్న కోయవాడి దగ్గరకు వెళ్లి పలుకరించి ఆమాటా యీ మాటా మాట్లాడుతూ, 'ఇందాక మీ అబ్బాయిని కొట్టారట. అతను ఏడుస్తూ మా యింటికి వచ్చాడ'ని అన్నాడు.

దాంతో ఆ 85 ఏళ్ల వృద్ధుడూ క్రుద్ధుడై "కొట్టాలా? కొట్టి పాతెయ్యాలా?--యిలాంటి పొగరుబోతు కుర్రకుంకని! మా అయ్య వస్తే కూర్చొన్న చోటినుంచీ లేవలేదు; యీ పుండాకోర్!" అన్నాడు.

శాస్త్రవేత్తకు మరీ ఆశ్చర్యం తోచింది. 85 ఏళ్ల వృద్ధుడికి తండ్రి వున్నాడంటే, ఆతని వయస్సు ఎంత వుంటుందో, మనిషి ఎలా వుంటాడో చూడాలని బుద్ధి పుట్టి "ఓహో; అలాగా! నాకు తెలియదులే. అయితే మీ నాన్నగారు యిప్పుడుఎక్కడ వున్నారు?" అని అడిగాడు.

"అదుగో నండీ; ఆ కావిడి మోసుకు వస్తున్న ఆయనే మానాన్న" అన్నాడు ఆ కోయవాడు అటువైపు చూపిస్తూ.

శాస్త్రవేత్త అటు తిరిగి చూస్తే 120 ఏళ్ల వాడొకడు బరువైన కావిడి మోసుకొని చకచకా పోతున్నాడు.

ఇంతకీ నా అసలుపేరు మీకు తెలియదు. నాపేరు ఏ పత్రికలోనూ అచ్చులో పడే అవకాశం పొరబాటున కూడ లేదు. మరోవిధంగా కీర్తినిపొందే దగ్గరమార్గమూ లేదు. ఇంతకీ నా పేరేమిటే అని ?- ఎవరో నన్ను, (చాలామంది) చాలా రోజుల

(౫౧-వ పేజీ చూడండి)

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

45

ఆ లేఖను పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇలా చదివి వినిపించాడు:

'బీవాయ్ వాస్తవ్యుడు, అనంతరం పారిస్ నివాసి, అయిన, దురదృష్టవంతుడు డాక్టర్ అలెగ్జాండర్ మానెట్ అనే నేను, 1767 సంవత్సరం డిశంబరుమాసంలో, బాస్టిల్లీ ఖైదులోని ఈ చీకటికొట్లో వుండి, అవకాశందొరికిన సమయాల్లో ఈ విషాద గాథను వ్రాస్తున్నాను. ఈ లేఖను పూర్తిచేసి పైనున్న పొగ గూటిలో, నేను యిందుకుగాను ప్రత్యేకం తయారుచేసిన కన్నంలో దీన్ని భద్రపరచాలని యత్నించుతున్నాను. అలా చేయటంవల్ల, నేనూ నా కష్టాలూ మట్టిలోకలసి నశించిపోయిన అనంతరం, యెప్పుడైనా ఒకప్పుడు, యీ కాయితం యే సహృదయుని చేతిలోనైనా పడవచ్చుననే ఆశాలేశంతో ఈ పని చేస్తున్నాను.

'ఇప్పటికి నన్ను ఈ ఖైదులో బెట్టి పదిసంవత్సరాలైంది. ఈ పదో సంవత్సరం చివరిమాసంలో, పైనున్న పొగగూడునుంచి రాలిన మసిని రక్తంలో రంగరించి తుప్పుపట్టిపోయిన ఈ ఇనప ములికి సహాయంతో ఈ అక్షరాలు ఏదోవిధంగా గిలుకుతున్నాను. నాలో జీవితాశలన్నీ నశించిపోయినాయి. నా శరీరంలోనూ, మనస్సులోనూ కనుపించుతున్న సూచనలనుబట్టి, యిక యెక్కువ కాలం నా మెదడుపనిచేయదని నాకు తెలిసిపోతోంది. కాని యిప్పుడుమాత్రం నేను సరియైన వ్యక్తతలోవుండి భగవంతుని ముఖంచూసి, సత్యప్రమాణమైన ఈవిషయాన్ని అక్షరరూపంలో వెలిబుచ్చుతున్నాను.

'ఆ వేళ మబ్బుపట్టి కొంచెం మసక వెన్నెలగా వుంది. 1757 వ సంవత్సరం డిశెంబర్ 22 వ తేదీ అని జ్ఞాపకం. నేను సెనీ నదితీరానికి షికారువెళ్ళి ఒంటరిగా వస్తున్నాను. అప్పట్లో నేను వైద్యకళాశాల వీధిలో వుంటూవుండేవాణ్ణి. మా యింటికీ నేను షికారు వచ్చిన స్థలానికి దాదాపు మూడు నాలుగు మైళ్ళ దూరం వుంటుంది. నేను వస్తూవుండగా ఆ గుడ్డి వెన్నెలలో, నా వెనకనుంచి యేదో ఒక బండి వస్తున్నట్టు గమనించాను. బండివాడు గుర్రాల్ని అదిలించుతూ బండిని అఘమేఘాలమీద తోలుకొస్తున్నాడు. ఆ బండి నామీదగా పోతుందేమోననే భయంతో పక్కకు తప్పుకున్నాను. బండి నా సమీపానికి రావటంతోటే ఎవరో ఒకాయన బండిలోనుంచి తల బయటపెట్టి నావంక చూసి, బండి ఆపమని బండివాణ్ణి కేక బెట్టాడు.

'బండి పది గజాలు ముందుకు పోయి ఆగింది. బండిలోవున్న పెదమనిషి నన్ను పేరుపెటి కేక వేశాడు. నేను బండిదగ్గిరికి చేరుకునేలోగానే, బండి తలుపు తెరుచుకుని యిద్దరు పెద్దమనుషులు క్రిందికి దిగారు. ఆ యిద్దరూ ఆపాదమస్తకం పెద్దకోట్లు తొడుక్కుని, గుర్తు తెలియకుండా వుండటానికి ప్రయత్నించుతున్న వాళ్ళలా కనుపించారు. వాళ్ళు యిద్దరూ షుమారు నా వయస్సులోనే వున్నారు. ఇద్దరూ ఒకే పోలికలో వున్నారు.

"డాక్టర్ మానెట్ మీరేనా?" అని యిద్దరిలో ఒకరు ప్రశ్నించారు.

"అవును."

"బీవాయ్ డాక్టరనీ శస్త్రచికిత్సలో అఖండులనీ పారిసంతా చెప్పుకుంటున్న డాక్టరు మీరేనా?" అని రెండోవాడు ప్రశ్నించాడు.

"మీరు పొగడుతున్నంత గొప్పవాణ్ణి కాదనుకోండి—చిత్తం—డాక్టర్ మానెట్ అంటే నేనే'—

'మేవుఁ మీయింటికి కూడా వెళ్ళొచ్చాం; తమరు ఇలా షికారు వచ్చారని చెప్పారు. దయవుంచి కాస్త బండిలోకి యెక్కండి-కొంచెం పనుంది; మా యింటిదాకా దయచెయ్యాలి.'

వాళ్ళు యించుమించు అధికార కంఠంతోనే మాట్లాడుతున్నారు. సాయుధులైకూడా వున్నారు. నేనుమాత్రం వట్టి చేతులతోనే వున్నాను. ఈమాట చెపుతూనే మొదటి పెద్దమనిషి పోయి బండితలుపు తెరుస్తున్నాడు, రెండవవ్యక్తి నా వెనక వచ్చి నిల్చున్నాడు. నేను యిద్దరికీ మధ్య వున్నాను, అయినా ధైర్యం చేసి అడిగాను.

'మీరు నా సహాయం కోరివచ్చారు గనుక మీరెవరో తెలిసికోవటంలో తప్పులేదనుకుంటాను—ఇంతకూ నేను చికిత్స చేయవలసిన వ్యాధివిషయం కూడా యేమీ చెప్పారు కారు'—

'ఏదో యింత గౌరవమర్యాదలున్న కుటుంబంలోవాళ్ళమేలెండి—వ్యాధిసంగతేవిట్లో మేవు చెప్పేదానికంటే మీరే స్వయంగా పరీక్షించితే బాగుంటుంది. దయవుంచి బండిలోకి యెక్కుతారా?"—

వాళ్ళు చెప్పినట్టు చెయ్యటంమినహా నాకు మరోమార్గమేమీ తోచలేదు. కిక్కురుమనకుండా లోపలికి యెక్కి కూర్చున్నాను. బండితిరిగి అఘమేఘాలమీద వెళ్ళిపోతోంది.

'బండి పారిస్ వీధులన్నీ అతిక్రమించి పోతోంది; నార్త్ బారియర్ దాటి పొలాలగుండా వెడుతున్నాం. అలా యెంత దూరం ప్రయాణం చేశామో చెప్పలేను. బండి యెకాయెకి వెళ్ళి, నిర్జనప్రదేశంలో యేకాంతంగావున్న ఒక భవంతిముందు ఆగింది. ముగ్గురం బండి దిగి ఉద్యానవనానికి మధ్యగాబడి, మంచుకు దమ్మ్మకునివున్న కాలిబాటవెంట ఆయింటిగుమ్మంలోకి జేరుకున్నాం. ఆతోట్లో వున్న జలయంత్రం చూసేదిక్కులేక నీళ్లు పొర్లిపోతోంది.

'ఆయిద్దరిలో ముందు నడుస్తున్నవ్యక్తి గబగబా తలుపు కొట్టాడు. కాని వెంటనే యెవరూవచ్చి తలుపుతీశారుగారు.

అనువాదం: తెన్నేటి సూరి

కొంచెం ఆలస్యమైంది. ఒకటిరెండు క్షణాలలో వచ్చి తలుపు తీసిన ఆ నౌకరును, ఆ పెద్దమనిషి మొహానికడ్డంగా చూసి ఒక పెద్ద దెబ్బకొట్టాడు.

'ఇది నాకు పెద్దవింతగా తోచలేదు. ఎంచేతనంటే యజమానులు నౌకర్లను కుక్కల్ని బాదినట్లు బాదడం నేను చాలా సార్లు చూశాను. కాకపోతే చిత్రమేమిటంటే, మొదటివ్యక్తి కొట్టిన అనంతరం, అదేమో స్తరు కోపంవచ్చివున్న కారణంగా ఆ రెండో పెద్దమనిషికూడా అదేవిధంగా ముఖంమీద కొట్టాడు. ఆ సమయంలో ఆ యిద్దరిముఖాలు నిజంగా ఒకే కరువున పోతబోసినట్టున్నాయి. ఒకవేళ వాళ్లిద్దరూ కవలసోదరులేమోననే అనుమానం కలిగింది.

'మేము ఆ భవంతి ఆవరణా గేటు ముందు బండిదిగిన మరుక్షణంనుంచి, లోపలున్న మేడమీదినుంచి యేదో యేడుపు వినిపిస్తూనేవుంది. ఆ యిద్దరిసోదరులలో ఒకడు తన దగ్గరున్న తాళం చెవితో ముందుగేటుతాళంతీసి మళ్లా మేము లోపలికి రావటంతోటే గేటు మూసేసి లోపల్నుంచి తాళంవేసేశాడు. ఇంట్లో కొంతమంది మనుషులు వుండగా యజమాని వీధిగేటు తాళం వేసి ఆ తాళంచెవి అస్తమానం మొల్లోగట్టుకు తిరుగుతూ వుండటం చిత్రమైన సంగతే.

'మేము ఇంట్లో ప్రవేశించి, మేడపైకి మెట్లెక్కుతున్న కొద్దీ ఆ ఏడుపు మరింతదగ్గరగా వినిపిస్తోంది. నన్ను సరాసరి ఆ గదిలోకే తీసుకువెళ్లారు. కొండలపెట్టున జ్వరంతో మతిచెడి, ఒక స్త్రీపక్కమీద పడుండి యేడుస్తోంది.

'అంతజ్వరతపుందంలో వుండికూడా ఆ స్త్రీ యెంతో అందంగా వుంది. ఇరవైయేళ్లకు మించివుండవు. జుట్టంతా చీకిరి బాకిరిగా రేగిపోయివుంది. చేతులురెండూ తాళ్లతోనూ, చిరిగిపోయిన కోటుపీలికలతోనూ కట్టేసివున్నయ్. ఆ కోటు పీలికల మీద ప్రభువులుధరించే అధికారచిహ్నాలున్నయ్. "E" అనే అక్షరం పట్టుతో కుట్టివుంది.

'రోగిని చూసిన మొదటి క్షణంలోనే ఇంతవరకు గమనించాను: ఇంత పరీక్షగా యెందుకు చూడవలసి వచ్చిందంటే, ఆ స్త్రీ కల్లోలంగా యేడుస్తూ నోటితో ఆ కట్టు పీకెయ్యటానికి ప్రయత్నించుతోంది. పక్కమీద నలికెళ్ళపాములాగు మెలికల్లు తిరిగిపోతోంది. ఆ ప్రయత్నించటంలో ఆ గుడ్డలు నోటినిండా కుక్కుకుపోయి ఊపి రాడకుండా పోయింది. నేను ఆవిడకు ఊపిరాడేలా చెయ్యడానికి ముందు ఆ గుడ్డపీలికలు నోట్లోనుంచి యివతలికి లాగటంతో ఆ చిహ్నాలన్నీ కంటబడ్డయ్.

'నెమ్మదిగా రెండుచేతులా మనిషిని పట్టుకుని వెల్లకిలగా పడుకోబెట్టి, నెమ్మదిగా గుండెలమీద చెయ్యివేసి రాస్తూ, కొంచెం శాంతి పరచటానికి ప్రయత్నించాను. ఆవిడ కనుగుడ్లు తిరిగిపోయి, అయోమయంగా వుంది. ఊపిరి సలపకుండా కేకలు పెట్టి యేడుస్తోంది. ఆ కేకలు, పిచ్చెత్తిపోయిన మనిషిలా ఒకే వెర్రి ధోరణి:

'నా భర్త! — నా తండ్రి! — తమ్ముడు! — అమ్మయ్యో! — ఒకటి, రెండు, మూడు, నాలుగు' ఇలా పన్నెండుదాకా అరుస్తుంది. ఇలా అరిచి ఒకక్షణం ఆగి మళ్లా అదేప్రకారంగా ఏడ్చి పన్నెండు అంకెలూ లెక్కబెడుతుంది.

"ఈ స్థితి యెప్పటినుంచీ అని అడిగాను"

ఆ యిద్దరు సోదరులలోనూ, పెద్దవాడుగా అధికారకంఠంతో మాట్లాడుతున్న ఆ పెద్దమనిషి: "నిన్నరాత్రి యీ వేళనుంచీ" అన్నాడు.

"ఈవిడకు భర్త, తండ్రీ, తమ్ముడూ వున్నారా?"

"తమ్ముడున్నాడు" అన్నాడు ఆ రెండో పెద్దమనిషి.

"మీరేనా?" —

"ఛీ!" —



★ రెండు మహానగరాలు ★

"పన్నెండేవిటి ?"

"అదోటుంది లెండి—పన్నెండుగంట లన్నమాట."

"రోగిస్థితి యిలా వుందని అక్కడే చెపితే నేను కావలసిన మందులూ మాకులూ తెచ్చుకు నేవాణ్ణి; యిప్పుడు నేను యిక్కడికి వచ్చీ ప్రయోజనం లేకుండావుంది. ఈ నిర్మానుష్య ప్రదేశంలో మందులు ఎక్కడ దొరుకుతై ?"

'ఈమాట అనేసరికి పెద్దవాడు తమ్ముడివంక చూశాడు. ఆ చూపుతో తమ్ముడు—"మందులున్నయ్‌లే" అంటూ నాతో అతి బేమర్యాదాగా అని లోపలికి పోయి మందులపెట్టె ఒకటి తెచ్చి అక్కడున్న బల్లమీద పడేశాడు.

'అందులోవున్న సీసాలు ఒకటొకటే బయటికితీసి, బిరడాలు తీసి వాసన చూస్తున్నాను. పరమవిషాలైన మత్తుమందులు మినహా మరోటి ఆ దశలో వాడి ప్రయోజనం కనుపించలేదు గనక వాటిని వాడగలిగాను గాని లేకుంటే వాటిని ముట్టుకు నేవాణ్ణే గాదు.

"ఏవిటి అనుమానించుతున్నారు?" అన్నాడు చిన్నవాడు.

"ఏవీ లేదు—వాడుతున్నానుగా"—

'అంటూ, మరుమాట లేకుండా, ఒక మందు తీసి గ్లాసులో పోశాను. ఆ అమ్మాయిచేత ఆ డోసు త్రాగించేటప్పటికి నాకు తలప్రాణం తోకకొచ్చింది. ఆ డోసు యెలా పనిచేస్తుందో చూసుకుని, మళ్ళా అదే మందు మరోడోసు యివ్వాలనే ఆలోచనతో ఆపక్కకు దగ్గరగా కూర్చుని పరిశీలించుతున్నాను. పిరికిపందలా తయారై బిక్కచచ్చివున్న మరోస్త్రీ అక్కడ వుండి కావలసిన ఉపచారాలు చేస్తోంది. నేను అక్కడ స్థిమితంగా కూర్చోవటం చూసి ఆ మనిషి అవతలికి వెళ్లిపోయింది. ఆ గది యావత్తూ తేమగా ముంజుకంపు గొడుతోంది. చాలారోజులుగా పాడుబెట్టి, యిటీవలనే ఒకటి రెండు రోజులుగా ఉపయోగించుకుంటున్న గదిలా తోచింది. సామాను చెల్లాచెదరుగా పారేసివుంది. ఆ రోగి అరుస్తున్న కేకలు బయటికి బాగా వినిపించకుండా వుండటానికి కిటికీలకు మందపాటి పట్టాగుడ్డలు వ్రేలాడదీసి మేకులు పాతారు. ఆవిడ అలా కేకలు పెడుతూనే వుంది: "నా భర్త!—నాన్న!—తమ్ముడు!—ఒకటి, రెండు, మూడు......పన్నెండు." ఆ స్త్రీ యించుమించు ఉన్మాదావస్థలో వుండటంచేత గొంతు నులిమేసుకుంటుందేమో ననే భయంతో, చేతికట్లు విప్పకుండా అలానే వుంచేశాను. కాకపోతే వున్న సుగుణమల్లా యేమిటంటే, గుండెలమీద చెయ్యివేసి రాస్తే, కాస్త ఉపశమనగా కనుపిస్తోంది. శరీర చలనంలో కొంత తమాయింపు కనుపిస్తోంది గాని అరుపులుమాత్రం యథాప్రకారంగానే వున్నయ్.

'ఇలా దాదాపు, ఒక అరగంటసేపు అక్కడ కూర్చున్నాను. ఇంతసేపూ ఆ యిద్దరు సోదరులూ అక్కడ కూర్చుని నావంక చూస్తూనే వున్నారు. తరువాత పెద్దవాడు "డాక్టర్! మరో రోగిని చూడాలి" అన్నాడు.

'నాకు ఆశ్చర్యం కలిగింది: "అదికూడా అర్జెంటు కేసేనా?" అని అడిగాను.

"వచ్చి చూడండి!"—అంటూ అతి బేఫర్వాగా సమాధానం చెప్పాడు. లాంతరు తీసుకు బైలుదేరాడు.

* * * *

'ఆ రెండో రోగి భవనానికి వెనకతట్టు గావున్న మరోపాడుబడ్డ గదిలో పడున్నాడు; గుర్రపుశాలలో పైనకట్టే అటకలా వుంది ఆ గది. దానినిండా యెండుగడ్డి పడేసివుంది. ఆరిపోయిన కాగడాలు మూలబారేసివున్నయ్. మరికొంతభాగంలో సీమరేగిపళ్లు యిసకలో కావేసి గుట్టలు పోసివున్నయ్, ఇంటి పైకప్పూ తనాబీలూ నెత్తికి తాకుతున్నయ్. ఆ చెత్తాచెదారం మధ్యగా బడి గది అవతలిగోడ మూలకు నడిచాం. ఆ మూల, ఒక రైతుకుర్రాడు గడ్డిమీద పడున్నాడు. అతడు పదహారు పదిహేడేళ్ల వయసులో వున్నాడు. అతను వెల్లకిలగా పడుకుని పైకప్పువంక చూస్తున్నాడు; పళ్లు కచ్చగా కదనొక్కుకున్నయ్; అరచేతితో గుండెలదగ్గర కండరాన్ని గట్టిగాపట్టుకుని బాధపడుతున్నాడు. అతని గాయమెక్కడో నేను వెంటనే తెలుసుకోలేకపోయాను. నెమ్మదిగా దగ్గరకూర్చుని పరిశీలించాను. గాయమెక్కడో తెలియలేదుగాని, ఆ ముఖకవళికలనుబట్టి అతను ప్రమాదకరమైన యేదో గాయంతగిలి మరణావస్థలో వున్నాడని గ్రహించగలిగాను.

'నేను డాక్టర్ని నాయనా!—నీ గాయాన్ని పరీక్షించనియ్యి'—అన్నాను.

'అనవసరం—పరీక్షా గిరీక్షా అనవసరం—అలా వుండనీ'—

'అతను అలా అంటున్నా, నెమ్మదిగా అనునయించి చెయ్యి పక్కకు తొలగించి చూచాను. చేతికి క్రిందుగా డొక్కలో పెద్ద కత్తిపోటు. అప్పటికప్పుడు చికిత్సచేసినా అతను బ్రతికే సావకాశంలేని గాయం; పైగా ఆగాయం తగిలి యిప్పటికి దాదాపు యిరవై నాలుగుగంటలదాకా గడిచిపోయింది. అతనిప్పుడు కేవలం మృత్యుముఖంలో వున్నాడు. నేను, ప్రక్కనే నిల్చునున్న సోదరులవంకచూచాను. వాళ్లిద్దరూ ఆ కుర్రాడివంక, వేటాడి క్రిందపారేసిన పక్షిని చూసినట్టు చూస్తున్నారు.

"పాపం ఇలాంటిగాయం యెలా తగిలిందో" అన్నాను.

సోదరులలో పెద్దవాడన్నాడు: "వాడు వట్టి బజారుకుక్క—మా చేలల్లో పనిచేసే బానిసతొత్తుకొడుకు—కత్తిదూసి నా తమ్ముణ్ణి రెచ్చగొట్టాడు—తమ్ముడి కత్తి పొడుచుకుంద"—

ఆ మాటలు చెవులబడి కుర్రాడు కళ్లువిప్పి అతనివంక తీవ్రంగా చూశాడు. తరువాత నా వంకకు తిరిగాడు:

"డాక్టర్! వాళ్లు జమీందార్లు— అదీ వీళ్ల అహంకారం; మేవుఁ బజారుకుక్కలం—మాలోకూడా ఆత్మాభిమానం అప్పుడప్పుడు పొటమరించుతూ వుంటుంది. వాళ్లు మమ్మల్ని దోపిడీ చేస్తారు. మా ఆడవాళ్లని చెరుస్తారు—మమ్మల్ని కొరడాలతో కొడతారు—నరికి చంపుతారు; కాని అప్పుడప్పుడు మాలోకూడా అభిమానం రేగుతుంది.—డాక్టర్ మా అక్క!— అవిణ్ణి చూశారా ?"

ఆ స్త్రీ ఆక్రోశం ఆ మారుమూలగదిలోకికూడా వినిపిస్తూనే వుంది.

"చూచాను" అన్నాను.

"ఆవిడ మా అక్కగారు—ఈ జమీందార్లకి కొన్ని హక్కులున్నయ్—తరతరాలనుంచీ వస్తున్న దురాగతమైన హక్కులు; మా అక్కచెల్లెళ్ల మానసౌశీల్యాలను వీళ్లయిష్టంవచ్చినట్లు ఉపయోగించుకోవచ్చు; కాని, మాలోకూడా మానాభిమానాలు గల ఆడపిల్లలు పుడుతున్నారు. పవిత్రంగా బ్రతకటానికి ప్రాణాలు అర్పించే ఆడవాళ్లు మాలో కొందరున్నారు. ఈ సంగతి నిజం-నాకు తులుసు—నా తండ్రికూడా నాతో చాలాసార్లు ఈసంగతి చెప్పేరు. ఇప్పుడు మీరుచూసిన ఆ అమ్మాయి, మా అక్క ఆ కోవలో మనిషి—దాన్ని ఒకతని కిచ్చి పెళ్లిచెయ్యటానికి నిశ్చయమైంది; అతనుకూడా ఈ జమీందారు రైతే—మేవంతా వీళ్లరైతులమే. అదుగో అ నిల్చున్న ఆ పెద్దాయన జమీదారు—ఆ రెండో ఆయన ఆయన తమ్ముడు; ఈ కిరాతవంశానికి కట్టకడపటి వారసుడు"

'ఈ మాటలు పెకల్చుకోవటానికి, పాపం, ఆ కుర్రాడు

వొంట్లో వున్న జవసత్వాలన్నిటినీ బలవంతాన లాడదీసుకోవలసి వస్తోంది; కాని ప్రతి మాటనూ తుపాకిగుండ్లులా బలంగా విసురుతున్నాడు.

"ఈ దేశంలో ఈ జమీందారులు మాబోటి బజారుకుక్కల్ని నిలువుదోపు చేస్తూవుంటారు—అలాగే ఆ నిల్చున్నాయన మా సర్వస్వాన్నీ దోచుకున్నాడు; మేవుఁ చెల్లించే పన్నులు యిన్నిన్ని కావు; కూలీనాలీ లేకుండా వాళ్ళ పొలాల్లో పెట్టి చాకిరీ చెయ్యాలి; వాళ్ల మరలో నే మేవుఁ ధాన్యం విసురుకోవాలి; వీళ్లు పెంచుతూవుండే వేలాది పక్షులు మా చేలమీద పడి తినిపోతుంటై. వాటిని మేవుఁ అదిలించకూడదు. మేవు యే చిన్ని పిట్టనీ పెంచుకోగూడదు—ఇంతెందుకు, మేవు రవ్వంత మాంసం ముక్క నోట్లో వేసుకోవాలంటే తలుపులు బిగించుకుని దొంగ

★ రెండు మహానగరాలు ★

తనంగా తినాలి—వాళ్ల నౌకర్ల కంటబడితే పీకమీదికి వస్తుంది. వాళ్లు మమ్మల్ని దోపిడీ చేసింది ఒకవిధంగా గాదు. జంతువుల క్రింద వేటాడారు. వాళ్ళ దోపిడీతో మేవుఁ గర్భదరిద్రులమై నాశనమై పోయాం. బిడ్డల్ని కని ఈ కిరాత ప్రపంచంలో పారేసే కంటే మా ఆడవాళ్ళంతా గొడ్రాళ్ళయి, ఈ నికృష్టజాతి యింతటితో నశించిపోవాలని, మా పెద్దలంతా దేవతలకు మొక్కుకుంటూ వుంటారు"

'పీడిత ప్రజానీకంనుంచి జ్వాలలు లేస్తాయని వినటమే గాని, అదేవిఁటో ప్రత్యక్షానుభవ మేవీ లేదు—ఆ కుర్రవాడు మాట్లాడుతుంటే ఆ సత్య మేవిఁటో బోధపడ్డది.'

అతను మళ్ళీ మొదలెట్టాడు:

"డాక్టర్! మా అక్కగారు పెళ్లి చేసుకుంది. ఆవిడ అతన్ని చిన్నప్పటినుంచీ యెంతో ప్రేమించుతూ వుండేది. అప్పట్లో అతను జబ్బుస్థితిలో వున్నాడు. పెళ్లి చేసుకుంటే అతనికి పరిచర్య చేసే అవకాశం కలుగుతుందని, ఆ జబ్బుస్థితిలో వున్న వాణ్ణే పెళ్లి చేసుకుంది. అతన్ని మా గుడిసెలోకే తెచ్చుకుని ఉపచారం చేస్తోంది—గుడి సేవిఁటి లెండి—ఈయన అన్నట్టు కుక్కలగూడే; అప్పటికి పెళ్ళి అయి ఎన్నో రోజులు కూడా కాలేదు—కొద్ది వారాలు గడిచినై—ఈయన తమ్ముడు మా అక్కని చూచాడు—మా అక్క అందంగా వుందనుకున్నాడు—ఆ స్త్రీని తనకు వప్పజెప్పమని మా బావకే కబురు చేశాడు—మాలో మొగుడంటే యేవిఁటి బాబూ! అతను అందుకు యిష్టపడ్డాడు కూడా; కాని మా అక్కకు మాత్రం పరమ అసహ్యం వేసింది—ఇతనంటే మా అక్కకు చాలా అసహ్యం లెండి—నాకూ అంతే—వీళ్ళిద్దరూ, మా అక్కను ఎల్లాగైనా ఒప్పించమని మా బావను నానా యిబ్బందులూ పెట్టారు.

"డాక్టర్! మీకు తెలియదేమో—వాళ్ళకు అనేక హక్కులున్నయ్; మా బజారుకుక్కల్ని వాళ్లు బళ్ళకు కట్టి జంతువుల్ని తోలినట్టు తోలొచ్చు. మా బావను అలా తోలారు. రాత్రిళ్లు, కప్పలు అరిచి మహాఘనత వహించిన వాళ్ళ నిద్రలకు భంగం రాకుండా మమ్మల్ని రాత్రి తెల్లవార్లూ కప్పల్ని అదుపు చెయ్యటానికి వాళ్ళ చేలమీద మంచులో అట్టే పెట్టెయ్యొచ్చు; మా బావను అలా రోజుల తరబడి అట్టే పెట్టారు. పగలల్లా బండి లాగేవాడు రాత్రి తెల్లవార్లూ మంచులో వుండేవాడు. అయినా అతను లొంగలేదు. అతని పని సాంతం అయిపోయింది. కొన్ని వారాల తరబడి ఇలా యమయాతన లనుభవించాడు. ఒకనాడు కనికరించి కాబోలు, తిండి తినిరమ్మని యింటికి పంపివేశారు. అతను ఇంటికి వచ్చాడు—ఇంటికి జేర్చారు. అతను మా అక్క భుజంమీద పడుకుని యేడ్చాడు—చర్చిలో గంటలు గొట్టినప్పుడల్లా గుబులు గుబులుగా యేడ్చాడు—మధ్యాహ్నం ఒంటి గంటనుంచీ రాత్రి పన్నెండింటిదాకా అలా పన్నెండుసార్లు ఏడ్చాడు-పన్నెండో గంటకు మా అక్క భుజంమీద అలానే ప్రాణం విడిచేశాడు.

"అనంతరం, ఈయన తన అన్నగారి అనుమతితోనూ, మద్దతుతోనూ మా అక్కను మాగుడిశలోనుంచి తన భవనానికి యీడ్పించుకుపోయాడు; ఎంత మొత్తుకున్నా దానిగోల వినేవాళ్లెవరూ లేరు; అల్లా యీడ్చుకుపోతుండగా నేను రోడ్డుమీద చూశాను. తలవంచుకుని యింటికి వెళ్లిపోయాను. ఇంటిదగ్గిర మా నాన్న గుండె బాదుకుని యేడుస్తున్నాడు. నాకు మరో చెల్లెలుంది. దాన్ని వీళ్లబారి పడకుండా కాపాడాలనుకున్నాను. దాన్ని వెంటబెట్టుకుని వీళ్ల యేలుబడిలోది కాని మరో గ్రామానికి చేర్చి తిరిగివచ్చాను; వీళ్ళ సంగతీ నా సంగతీ తేల్చుకోవాలనుకున్నాను—నేను బజారుకుక్కనే—కాని కత్తి చేత్తో బుచ్చుకొని నిన్నటి అర్ధరాత్రి ఈ మేడమీదికి ఎగబాకాను. అదుగో ఆ కిటికీలోనుంచే లోపలికి దిగాను.

"నేను లోపలికి రావటం పసిగట్టి మా అక్క ఏడుస్తూ నా దగ్గిరికి పరుగెత్తుకొచ్చింది. అతని అంతం చూసేవరకూ నువ్వు నా దగ్గిరికి రావద్దని మా అక్కను మందలించాను. అతనుకూడా లోపలికొచ్చాడు. మొదట నా మీదికి డబ్బులు విసిరాడు; తరవాత

గబగబా దొర్లుకొంటూ పోయి నీటి ప్రవాహంలో పడిపోతుంది. అది అనుకొన్నట్లుగా నీటిలోనే పడు తోందా లేక మరెక్కడైనా ఆగి పోతుందా అని అది ఎంత జాగ్రత్తగా చూసు కొంటుంది.

ఏనుగుల విషయం ప్రస్తావనకు వచ్చింది కాబట్టి ఆఫ్రికా ఏనుగు లకీ, ఆసియా ఏనుగులకీ వుండే పెద్ద వ్యత్యాసం ఒకటి తేట తెల్లంగా చెప్పవలసి వుంది. ఆసియా ఏనుగుల చెవులు చిన్నవిగా వుండి, ఇండియా దేశపటం ఎలా వుంటుందో ఆ ఆకా రంలో వుంటాయి. ఆఫ్రికా ఏను గుల చెవులు అల్లాకాక బాగా పెద్ద విగా వుండి ఆఏనుగుల మోకాళ్ల వరకు దిగజారి వుంటాయి. అయితే మనం సామన్యంగా చూసే ఏను గుల్లో ఆసియా ఏనుగులే వుంటాయి కాని ఆఫ్రికా ఏనుగులు సామా న్యంగా వుండనే వుండవు. దానికి కారణం ఆసియా ఏనుగులైతే మచ్చిక చేయటానికి లొంగి వస్తాయి; ఆఫ్రికా ఏనుగులు మహా భీభత్సం చేయటమేకాక, తెలివి తేటలు అంతగా వుపయోగించను కూడా వుపయోగించ లేవు.

ఏనుగకి వుండే తొండం ప్రకృతి అంతటిలోనూ చాలా విచిత్రమైన విషయం. ఈ తొండం ఒక్కటీ మామూలుగా మన కందరికీ చెయ్యి, నోరూ రెండూ చేసే పనులు చేసి పెట్టుతుంది. నిజానికి ముక్కు, పై పెదవీ యీ రెండూ కలిపివేయగా తయారైనదే యీ తొండం. తొండం చివరను వుండే ఆ రెండు మొరికలు మన చేతివేళ్లు మనకు ఎన్ని విధాల వుపయోగ పడతాయో, అవి అంతగా ఆ ఏనుగులకు వుపయోగ పడతాయి. వీటి సహాయంతో నేలమీద నుంచీ ఎంత చిన్నవస్తువు నైనా యివి సునాయాసంగా పట్టుకు పైకి లాగ గలవు. ఒకానొక జ్యూలో జంతు వులను చూడబోయిన చిన్న పిల్ల జేబులో చాక్‌లెట్ ముక్కవుంటే, అది పసిగట్టిన ఏనుగు ఒకటి, తన తొండాన్ని ఆ పిల్ల జేబులోకి దూర్చి, చాక్‌లెట్ ముక్కను పైకి తీసేసుకొని నోట్లో పెట్టేసుకొందట ఒక్కొకప్పుడు ఏనుగులు మందలు మందలుగా వున్నచోట పరీక్షగా చూస్తే ఒక ఏనుగు రెండో ఏనుగు నోట్లోకి తన తొండాన్ని పెట్టి, ఆమిత్రుడు ఆనిమిషాన నములు

(4-వ పేజీ చూడండి)



పరుగెత్తుతున్న కొన్ని జంతువుల బొమ్మలు యివి. అవి ఏ జంతువులో పోల్చుకొని, అన్నిటికంటే వేగంగా పరుగెత్తగల జంతువు ఏదో యోచిం చండి.

శ్రీ టి. చిన్నప్ప.

కష్టార్జితం

వెంకన్న మాసిరెడ్డిపాలెం నివాసి. అతను చాలా బీద వాడు. పురిట్లోనే తల్లి పోయింది. తండ్రే అష్టకష్టాలు పడి, పెంచి, పాతిక యేళ్లవాడిని చేశాడు. అతని నొక యింటివాణ్ణి చేసి చనిపోయాడు.

ఆతరువాత ఆరేళ్లు గడిచాయి. ఈ ఆరేళ్లలోనూ చాలా మార్పులు కలిగాయి. భార్య క్షయ వ్యాధితో చనిపోయింది. తల్లిమీది ప్రేమవల్ల మూడేళ్ల పిల్లవాడు మంచం పట్టి మట్టిలో కలిసిపోయాడు. ఇక నా అన్నవాళ్లు లేరు కాబట్టి, ఆవూళ్లో వుండడం నీచమనిపించింది వెంకన్నకు. ఉన్న పాతపూరి పాకను పూరివారికి అమ్మజూపాడు. దాని వైభవం చూచి ఎవ్వరూ దాన్ని కొనడానికి ముందుకు రాలేదు. బ్రతికివుంటే తిరిగి రావచ్చునని, మూటా ముల్లె సర్దుకుని దగ్గరున్న పట్నం చేరాడు.

ఆకాశాన్నంటుతున్న భవనాల్ని, రోడ్ల వెంబడి పోయే కార్లనూ చూస్తూ అలా నిలబడి పోయేడు వెంకన్న. వెనుకనుంచి కారు హారను వినిపించింది. తప్పుకోబోయి కారుక్రింద పడిపోయాడు. హాస్పిటల్‌కి చేర్చారు నలుగురూ కలిసి!

ఆ కారుగలాయన పెద్ద జమీందారు. దయదలచి వెంకయ్యను తన పూదోటలో, మాలిగా చేర్చుకున్నాడు. దేవిడీలోనే రోజూ మూడుపూటలా భోజనం దొరుకుతుంది; ఇక తనకు కావల్సిందేమిటి అనుకున్నాడు వెంకయ్య. తోట

శ్రీ శింగపల్లి అప్పారావు

మాలిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చుతూ నమ్మకంగా అతి జాగ్రతగా పని చేస్తూ వుండేవాడు.

వెంకయ్య నౌకరీలో కుదిరి దరిదాపుగా పది సంవత్సరాలు గడిచిపోయాయి. ఇతని మంచితనాన్ని సహనశీలతని మెచ్చి, అతని భావి జీవితానికి వుపయోగపడే నిమత్తం పది రూపాయల జీతం కూడ ఏర్పాటు చేశారు, జమీందారు గారు.

జమీందారు గారు ముసలివాడయ్యారు. ఆయనకు తాను చచ్చిపోయేముందు, విదేశాలు చూచిరావాలని బుద్ధి పుట్టింది. తన జమీందారీ వ్యవహారాలన్నీ తన గుమస్తాకు వప్పజెప్పి విదేశాలకు వెళ్లిపోయారు.

మరుసటి నెలలోనే గుమస్తాకు వెంకయ్యకు పొత్తు కుదరలేదు. "ముసలాడివి, నీకు డబ్బు ఎందుకు మూడు పూటలా తింటున్నావుగా! యింకా జీతం దేనికి! పిల్లా పీచా!" అన్నాడు గుమస్తా, వెంకయ్యతో. నెలాఖరున జీతంరాళ్లకోసం కచ్చేరికి పోయిన వెంకయ్య యీ మాటలు విని చల్లుమన్నాడు.—

"బాబుగారి సొమ్ముమీద మీ అధికారమేమిటండీ! ఆయనగారు ప్రతినెలా యిస్తున్నట్టు మీకు తెలియదా?" అన్నాడు వెంకయ్య. "తెలుసునో తెలియదో నీకదంతా ఎందుకు? ఇప్పుడు జమీందారీ వ్యవహారమంతా నాచేతిలో వుంది. అంతా నాయిష్టం! వుంటే వుండు! లేకపోతే కొలువు మానేసి చల్లగా జారుకో" అన్నాడు గుమస్తా వెటకారంగా!

వెంకయ్యంటే గుమస్తాకు కోపం. జమీందారు వెంకయ్యను దయగా చూడ్డం అతనికి గిట్టేదికాదు. వెంకయ్య మాటపడేరకం కాదు. అతని అభిమానం దెబ్బతిన్నది. తనకు తెలిసిన ఒక షాహుకారు గారి మామిడితోటలో నెలకు ఐదు రూపాయల జీతం మీద కుదిరాడు. ఆతోటలో యిద్దరు కాపలావాళ్లు. ఒకడు వెంకయ్య; రెండవతను రామయ్య. రామయ్య అంతకు ముందునుంచే నౌకరీ

పట్నంలో బి. కాం. చదువుతున్న కుర్రాడు శెలవులకి యింటికి వచ్చాడు. వచ్చీ రాగానే వాళ్ల నాన్న దగ్గిర కెళ్లి "నాన్నా! నువ్వు డబ్బు అంతా బ్యాంకులో వెయ్యకుండా యినప పెట్టెలో దాచి పెట్టుతున్నావు: ఎంత వడ్డీ నష్టమైపోతున్నదో ఆలోచించావా?" అని అడిగాడు.

"అంతమాత్రం నాకు తెలిదట్రా! ఆ అసలుకు ఎంత వడ్డీ అవుతుందో అంతా ఎప్పటికప్పుడు ఆ పెట్టెలోనే పడేస్తున్నాలేవోయ్!" అని సమాధానం యిచ్చాడు-ఆ తండ్రీ సగర్వంగా.

చేస్తున్నాడు. రామయ్యా కొక కొడుకు. వాడిపేరు సూరిగాడు. వయస్సు పన్నెండేళ్లుంటుంది. చాలా అల్లరి చిల్లరగా తిరుగుతాడు. షనీపాటా చేతగాదు. వాడి యావ ఎంతసేపూ ఎక్కడ, ఎవరు ఏం చేస్తున్నారో అనేగాని మరొకటి వాడి మనస్సుకు పట్టేది కాదు.

వెంకయ్యా తనకుగాను ఒక చిన్న పాకను రామయ్యా పాకకు దగ్గర్లోనే వేసుకొని అందులో వుంటున్నాడు.

వెంకయ్యా షాహుకారి వద్ద పనికి కుదిరి సంవత్సరం కావస్తూ వుంది. ఒకనాడు వుదియం, వెంకయ్యా మామిడి అంటు కడ్తున్నాడు. ఇంతలో వెనుక నెవరో కిఱ్ఱు, కిఱ్ఱు, మని శబ్దం చేసుకుంటూ వస్తున్నట్లు తోచి వెనక్కి తిరిగి చూశాడు. కాని ఆవచ్చినతను మరెవరో కాదు, 'పాత స్నేహితుడు' గుమాస్తా గారే! అతన్ని చూడగానే వెంకయ్యకు లోపల పాతకోపం పొంగి వస్తున్నా పైకి మాత్రం సవినయంగా చేతులెత్తి నమస్కారం చేశాడు. నమస్కారం అందుకొని చిరునవ్వు నవ్వుతూ "చాలా అదృష్టవంతుడివోయ్, వెంకయ్యా! మా అందరికంటే నువ్వే అదృష్టవంతుడివి! నిజంగా నీమీద యింత అనురాగం చూపెట్టారంటే జమీందారు గారు ఎంత దయామయులో వేరే చెప్పాలా!" అన్నాడు గుమాస్తా.

'జమీందారుగారు తిరిగి వచ్చినట్టున్నారు. మళ్ళీ పనికి పిలిపించి వుంటారు. అనుకున్నాడు వెంకయ్య. "జమీందారుగారు వచ్చారా!" అని అడిగాడు వెంకయ్యా అనుమానం తీరక!

"లేదు! వారు యిక మనకు కన్పించరు. విదేశాల్లోనే గుండె జబ్బువల్ల చనిపోయారని వార్త వచ్చింది. చనిపోయేముందు వీలునామాలో యీసంచి నీకు అప్పచెప్పాల్సిందిగా వ్రాశారు. ఇదిగో తీసుకో!" అన్నాడు గుమస్తా!

జమీందారుగారి మరణవార్త విని వెంకయ్యా చాలా విచారించాడు. సంచి పుచ్చుకొని పాక చేరుకున్నాడు. సంచి చాలా బరువుగా వుంది. లెక్కపెట్టి చూశాడు. రెండువేల రూపాయలున్నాయి!! చాలా ఆశ్చర్యపోయాడు. తను యిక షాహుకారు కొలువు చేయవలసిన అవసరంలేదు. తన వూరు పోయి, మంచి పొలం ఖరీదుచేసి, దాన్ని కవులుకిచ్చి, దానిమీద వచ్చే రాబడితో హాయిగా కాలం గడుపవచ్చు. అవసరమైతే తన బంధువుల్లో ఎవ్వరినైనా ఒక కుర్రాడిని దత్తత చేసుకోవచ్చు కూడా. ఇలా ఆలోచించుకొంటూ తనలో తానే మురిసిపోయాడు.

అయితే చిన్న చిక్కేర్పడింది! ఇంత డబ్బు ఎక్కడ దాచటం? రామయ్యా కొడుకు తన పాకంతా తిరుగుతాడు. డబ్బు వాడికళ్ల పడకుండా బ్రతకడం చాలా కష్టం! పోనీ ఆపాక తనదైనా కాదు-తాళం వేయడానికి. చివరికి అతనికి ఒక ఆలోచన తట్టింది. పాకలోంచి

కష్టార్జితం

బయటకు వచ్చాడు. పాకకు వుత్తరాన ఒక పెద్ద మామిడి చెట్టు వుంది. దానికి తొఱ్ఱ వున్నట్టు వెంకయ్యకు జ్ఞాపకం! ఎవరూ లేకుండా చూచి మెల్లగా చెట్టు ఎక్కి మూటను. భద్రంగా ఆ తొఱ్ఱలో దాచి దిగి, చక్కా వచ్చాడు.

ఇదంతా రామయ్య కొడుకు అల్లంత దూరంనుంచి గమనిస్తూనే వున్నాడు. ఎప్పుడైతే పెద్దమనిషి వచ్చి, వెంకయ్యతో మాట్లాడుతున్నాడో అప్పుడు అతగాడికి అనుమానం తగిలింది. సంచి తీసుకొని వెంకయ్య పాకకు పోవటం, మళ్లా వచ్చి చెట్టుతొఱ్ఱలో సంచి దాచటం యివన్నీ చూచి, సూరిగాడు యింటికి పోయాడు.

సాయంత్రం లోగా సూరిగాడు, వెంకయ్య చూడకుండా, సంచి కాస్తా దొంగిలించి తీసుకుపోయి తండ్రికిచ్చాడు.

"ఎక్కడిదిరా యింత డబ్బు? ఎక్కణ్నించి తెచ్చావ్!" అన్నాడు రామయ్య గాబరాగా.

"ఎక్కడో ఒకచోట తెచ్చానులే! వెంకయ్య తాతకు ఎవరో ఒక ఆసామి యిచ్చాడు. అది నేను దొంగతనంగా తెచ్చాను." అన్నాడు సూరిగాడు!

రామయ్య చాలా సంతోషించాడు. కొడుకు తెలివితేటలకి.



"చెట్టుతొఱ్ఱలోనుంచే నేను ఆ డబ్బు దొంగిలించాను, నాన్నా!"

రామయ్య పాకిగూడ అంతంత మాత్రంగా వుండడం వల్ల, అతనా డబ్బు సంచి ఎవ్వరికీ తెలియకుండా ఒకచోట దాచిపెట్టి ఏమీ ఎరగనట్లు తిరిగి వచ్చాడు.

ఆరాత్రి వెంకయ్య భోంచేసి షాహుకారువద్దకు వెళ్లి "నాకు రెండు రోజులు శెలవు యిప్పించాలి. మావూరుపోయి రావాలనుకుంటున్నాను." అన్నాడు చేతులు నలుపుకుంటూ!

"ఏం! అంత తొందరపనులున్నాయా! సరే వెళ్లి రా! కాని త్వరగా రావాలి సుమా! ఇక్కడ రామయ్య ఒక్కడూ తోటపని చూడలేడు" అన్నాడు షాహు

(56-వ పేజీ చూడండి)

సీరియల్

విచిత్ర వ్యక్తి



మూలం:- మార్క్ ట్వేన్

జరిగినకథ:—ఆస్ట్రియాలోని ఈ జెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడువాళ్లయిన సెప్పీ, నికొలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీద మా ఆట స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తివచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలు చేసి చూపించాడు. అతడు మాతో ఉన్నంతసేపూ మానవజాతిని నానాబూతులు తిట్టాడు. మానవులు తామేదో గొప్పవారమని అనుకుంటారుగాని నిజానికి వారిలో ఉన్న నైచ్యం ఇంకెక్కడా ఉండదని అన్నాడు. చివరికి మాయమైపోయాడు. మా వూళ్లో ఫాదర్ పీటర్ అని ఒక మతగురువు ఉన్నాడు. ఆయన ఏ నేరమూ చెయ్యకపోయినా, పదవినుండి తొలగించబడ్డాడు. ఆయనకి సహాయంచేద్దామనో, ఏమో సైతాను పదకొండువందల బంగారునాణాలు ఆయనకిదొరికేటుచేశాడు. ఫాదర్ పీటర్‌కు విరోధియైన ఒక జ్యోతిష్కుడు ఆ డబ్బు తన దగ్గిరనుండి దొంగిలించబడిందని ఆరోపణచేశాడు.

జ్యోతిష్కుడు మాతో మాట్లాడి వెళ్ళిపోయిన గంటసేపట్లో ఫాదర్ పీటర్‌ను చెరసాలలో పడవెయ్యటం, సాలమన్ ఐజాక్స్ దగ్గిర ఆయన దాచుకున్న డబ్బు తిరిగి లాక్కుని సంచీలో కుట్టి సీలు వెయ్యటం, అంతా జరిగిపోయింది. ఆ నాణాలు ఫాదర్ పీటర్ ఇచ్చిన నాణాలేననీ, వాటి మొత్తం పదకొండువందల ఏడు డకట్లనీ, వాటిని లెక్కపెట్టిన తరవాత మళ్ళీ తను ముట్టుకోలేదనీ, సాలమన్ ఐజాక్స్‌చేత అధికారులు ప్రమాణం చేయించారు.

ఫాదర్ పీటర్, తన్ను చర్చి న్యాయస్థానం 1 వారిచేతనే విచారణ చేయించాలని పిటీషను పెట్టుకున్నాడు. కాని మా రెండో మతగురువు ఫాదర్ అడాల్ఫ్ ఇందుకు ఒప్పుకోలేదు. మతగురువు ఉద్యోగంనుండి తొలగించబడిన ఫాదర్ పీటర్‌ను చర్చి న్యాయస్థానంచేత విచారణ చేయించటానికి వీల్లేదని ఆయన అన్నాడు. బిషప్ కూడా ఆమాటే అన్నాడు. అందుచేత ఫాదర్ పీటర్ కేసు సివిల్ కోర్టుకి పోయింది. సివిల్ కోర్టు మరికొన్నాళ్ళదాకా సమావేశంకాదు. విల్హెల్మ్ మీడ్లింగ్ ఫాదర్ పీటర్ తరఫున వకాల్తానామా పుచ్చుకున్నాడు. తన శక్తివంచన లేకుండా వాదిస్తానన్నాడు; కాని గెలవటం బహుకష్టమని చాటున ఒప్పుకున్నాడు.

మళ్ళీ మార్గెట్‌కు కష్టాలు ప్రాప్తమైనాయి. నడమంత్రపు సిరి ఎలా వచ్చిందో అలాగే పోవటంతో, స్నేహితులు, బంధువులు మళ్ళీ మొహాలు చాటు చేశారు. మార్గెట్‌ను ఊరడించటానికైనా ఎవరూ రాలేదు. విందుకు రమ్మని ఆహ్వానిస్తూ వచ్చిన ఉత్తరాన్ని రద్దుచేస్తూ సంతకంలేని మరో ఉత్తరం వచ్చింది. పియానో నేర్చుకోటానికి చేరిన ఇద్దరు ముగ్గురు విద్యార్థినులు మళ్లీ మానేశారు. పాపం మార్గెట్ కుంగిపోయింది. ఫాదర్ పీటర్ జైలులో పడటంతో, ఇంట్లో మగదిక్కు లేకుండా పోయింది. అదృష్టవశాత్తూ ఇల్లు మాత్రం పోలేదు. ఫాదర్ పీటర్ సాలమన్ ఐజాక్స్‌కి

1. చర్చి ఉద్యోగులు నేరంచేసినప్పుడు సివిల్ కోర్టు వారిని విచారణచెయ్యటానికి వీలుండేదికాదు; చర్చి న్యాయస్థానమే వారిని విచారణచేసేది.

★ అనువాదం: శ్రీ నందూరి రామమోహనరావు ★

★ విచిత్రవ్యక్తి ★



చెల్లించిన డబ్బు ప్రస్తుతం అధికార్లవద్ద ఉన్నప్పటికీ ఇంటిపైగల తాకట్టు రద్దయినట్లే పరిగణించబడింది.

ఆ యింట్లో మార్గరెట్‌కు తోడుగా ఉర్సులా అనే వృద్ధదాసి కూడా ఉండేది. మార్గరెట్‌ను చిన్నప్పటినుంచీ పెంచి పెద్దచేసింది ఆమే. వంటచెయ్యటం, బట్టలు ఉతకటం, మొదలైన ఇంటిపనులన్నీ ఆమే చేస్తూంటుంది. ఫాదర్ పీటర్ కుటుంబానికి కష్టదినాలు ప్రాప్తమైనా ఆమె ఆ కుటుంబాన్ని విడవకుండా అంటి పెట్టుకుని వుంది. 'దిక్కులేనివారికి దేవుడే దిక్కు' అని ఆమె నిత్యమూ అంటూ ఉండేది.

ఫాదర్ పీటర్ జైల్లోపడిన నాలుగోరోజున వృద్ధదాసి ఉర్సులా మా యింటికి వచ్చింది. "బట్టలుంటే ఉతుకుతాను ఇ"మ్మన్నది. మా అమ్మ దయతలచి కొన్ని బట్టలు ఇచ్చింది. అవి పుచ్చుకుని ఉర్సులా అన్నది: "ఈ సంగతి మార్గరెట్ గారితో చెప్పకండి. డబ్బుకోసం ఇంకొకళ్ళ ఇంట్లో నేను కష్టపడుతున్నానని తెలిస్తే ఆమె ఒప్పుకోదు. పాపం ఆమెకి కడుపు నిండా తింటానికైనా లేదు. రోజురోజుకీ చిక్కిపోతున్నది."

ఉర్సులా కూడా తిండిలేక బాగా క్షీణించి పోయింది. అసలే వృద్ధాప్యం; దానికితోడు తగిన పోషణలేక నీరసించింది. మా అమ్మ ఆమెకు అన్నం పెట్టింది. అన్నానికి మొహంవాచినదానిలాగ గబగబ రెండు నిమిషాల్లో అంత అన్నమూ తిన్నది. మార్గరెట్‌కి కూడా పట్టుకుపొమ్మని మా అమ్మ చెప్పింది. కాని "మార్గరెట్ దయాధర్మంగా పెట్టిన అన్నం తినదు," అని ఉర్సులా అన్నది. బట్టలమూట వీపున వేసుకుని ఉతకటానికి నదివైపు బయల్దేరింది. కాని ఆట్టే దూరం నడవలేకపోయింది. బట్టలమూట కాదుగదా, ఈగ వాలినా మొయ్యలేనంత నీరసంగా ఉన్నది. ఆమెను చూస్తే జాలి వేసింది. మా అమ్మ ఉర్సులాను వెనక్కి పిలిచి మూట తీసుకుని "బట్టలు నువ్వేం ఉతుకుతావులే. ఇది తీసుకో" మని కొంత డబ్బు చేతిలోపెట్టింది. ఉర్సులా మొదట సందేహించింది మార్గరెట్ కోప్పడుతుందేమోనని. ఫరవాలేదు పుచ్చుకోమన్నాము. "మీరు ఊరికే ఇచ్చారని తెలిస్తే మార్గరెట్ ఎలానూ ఊరుకోదు. అందుకని ఈ డబ్బు దోవలో దొరికిందని చెబుతాను," అన్నది. అయితే అబద్ధమాడినట్టు కాగూడదు కనక ఆ డబ్బు తను చూస్తుండగా రోడ్డుమీద పడవెయ్యమని నాతో చెప్పింది. అలాగే పడేశాను. అప్పుడు మా అమ్మదగ్గర సెలవు తీసుకుని ఇంటికి బయల్దేరింది. దోవలో నేను పడేసిన డబ్బు తీసుకుని, నిజంగా దొరికినట్టే ఆశ్చర్యం, సంతోషం ప్రకటించి తనదారిన తను పోయింది.

ఉర్సులాకు అప్పటికేదో డబ్బిచ్చి పంపించినా, రోజూ ఎవరిస్తారు? ఎవరివ్వగలరు? మరి మార్గరెట్‌కి జీవనం ఎల్లా గడుస్తుంది? అన్న ఆలోచనలు నన్ను బాధించాయి. పోనీ ఆమెకు ధైర్యం చెప్పేందుకైనా అప్పుడప్పుడు వాళ్ళింటికి వెళ్ళివద్దామనుకున్నాను. కాని దానికి మా తలిదండ్రులు ఒప్పుకోలేదు. ఊళ్ళో అందరూ వెలివేసిన ఇంటికి రాకపోకలు సాగిం

చటం మంచిదికాదని నన్ను చివాట్లు పెట్టారు. చేసేది లేక ఊరుకున్నాను.

ఒకరోజున ఇలాగే విచారిస్తూ ఒంటరిగా నడుస్తూన్నాను. హఠాత్తుగా నాలో ఏదో మార్పు వచ్చింది. ఒక్కసారిగా సంతోషంతో ఉప్పొంగిపోయాను. వెంటనే సైతాను వచ్చినట్టు గ్రహించాను. సైతాను సమ్ముఖంలో ఉన్నవారి కెవరికైనా ఆ విధమైన అనుభూతి కలుగుతుంది. ఇదివరకు ఆ అనుభూతి ఎరిగివుండటంవల్ల వెంటనే తెలిసింది సైతాను దగ్గిర్లో ఎక్కడో ఉన్నట్టు. చటుక్కున ఆగి నలుదిక్కులా చూశాను. మరి కొద్దిక్షణాల్లో సైతాను నా పక్కన సాక్షాత్కరించి నాతో నడవసాగాడు. తక్షణం అతడు కిందటిసారి వచ్చి వెళ్ళినప్పటి నుంచీ జరిగిన వృత్తాంతమంతా గబగబ ఏకరువు పెట్టాను. మార్గరెట్‌కూ, ఆమె పినతండ్రికీ ఒక్కసారిగా కష్టాలొచ్చిపడ్డాయని చెప్పాను. అలా మాట్లాడుతూ రోడ్డుమలుపు తిరిగాము. ఉర్సులా కనిపించింది. ఒక చెట్టునీడలో కూర్చుని బక్కచిక్కిన పిల్లి నొకదాన్ని ఒళ్ళో పెట్టుకుని నిమురుతోంది. ఆమెను సమీపించాము. "ఆ పిల్లి ఎక్కడి"దని అడిగాను. "ఆ అడివిలోంచి వచ్చింది. పాపం తిండి దొరక లేదో ఏమో నీరసంగా తూలుకుంటూ వచ్చింది. తల్లీతండ్రీ కూడా లేరుగావును. దీన్ని తీసుకుపోయి పెంచుదామని చేరదీశాను," అని చెప్పింది ఉర్సులా.

"నువ్వసలే బీదదానివి. నీ పొట్టకే లేనప్పుడు ఇంకోపొట్టను కూడా ఎక్కడ పోషించగలవు? ఈ పిల్లిమీద నీకంత జాలివుంటే ఏ ధనవంతుడికో అప్పగించరాదూ?" అన్నాడు సైతాను.

ఎవరో కొత్తవ్యక్తి తనతో అలా మాట్లాడటం చూసి ఉర్సులాకు కోపంవచ్చింది. "ధనవంతు డెవడికైనా ఇమ్మంటున్నావా? మంచిమంచి బట్టలు కట్టుకుని తక్కుతూ, తారుతూ వచ్చావు; నువ్వు ధనవంతుడివేగా? నువ్వే తీసుకోరాదూ?" అని వెక్కిరించింది. తరవాత కనుబొమ లెగరేసి అన్నది: "హు. ధనవంతుల కివ్వాలిట, ధనవంతులకి. వాళ్ళకి కళ్ళు నెత్తినుంటాయి; ఈ పిల్లికూన వాళ్ళదృష్టి కెక్కడ ఆనుతుంది? దీన్ని పోషించటానికి వాళ్ళకేమవసరం? నాబోటి బీదలే ఇలాంటి నోరులేని జీవాల్ని కనికరించేది. దిక్కులేనివారికి దేవుడే దిక్కు. ఆయనే పోషిస్తాడు దీన్ని."

"దేవుడు పోషిస్తాడని నీ కెల్లా తెలుసు?" అన్నాడు సైతాను.

ఈ మాటతో ఉర్సులా కింకా కోపంవచ్చింది: "ఎల్లా తెలుసేమిటి, నాకు తెలుసు. దేవుడు చూడకుండా ప్రపంచంలో ఏమీ జరగదు."

"దేవుడు చూస్తేనేం, చూడకపోతేనేం; జరిగేదెల్లాగూ జరుగుతుందిగా."

వృద్ధురాలి ఆగ్రహానికి పట్ట పగ్గాలు లేవు. కోపంలో మొదట మాట్లాడలేకపోయింది. చివరికి "ఏయ్, అబ్బాయ్. నీదారిన నువ్వు పో. లేకపోతే కర్ర తీసుకుని ఒక్కటేస్తాను," అని కసిరింది.

ఉర్సులా అలా అనటంతో నాకు అమితమైన భయం కలిగింది. సైతానుకు కోపం వస్తుందేమో, వస్తే ఉర్సులాను నెత్తిమీద ఒకటివేసి చంపేస్తాడేమోనని భయపడ్డాను. ఎందుకంటే సైతాను మానవులకి పురుగులకంటే ఎక్కువ విలువ ఇవ్వడు! ఒక జీవి ఉన్నా పోయినా అతని కొకటే. కాని సైతాను ఉర్సులా అన్నమాటలకు చలించలేదు. బహుశా అతనికి అవమానం అనేది లేదనుకుంటాను. మహారాజును నల్లి కుడితే అవమానమని ఎలా భావించడో అలాగే అతనికి మానవుల ప్రవర్తన అవమాన కారణం కాజాలదు. అతడు నిశ్చలంగా నవ్వుతూ ఉర్సులాకేసి అలాగే చూస్తూ నుంచున్నాడు. ఆ చూపులో ఏమి మహిమ ఉన్నదో అప్పటిదాకా వణుకుతూ వంగివంగి కూర్చున్న వృద్ధురాలు ఇరవయ్యేళ్ళ యువతిలాగ చురుకుగా లేచి నిలబడింది. అంత చురుగ్గా లేవటం నాకేగాక ఆమెకుకూడా ఆశ్చర్యం కలిగించినట్లుంది. సైతాను సన్నిధిలో సంతోషం, చైతన్యం తప్ప మరొకటి ఉండటానికే వీలులేదు. అతని ప్రభావం పిల్లికూనమీద కూడా ప్రసరించింది. అది లేచి ఉషారుగా గంతులు వెయ్యసాగింది. ఇది మరింత ఆశ్చర్యకారణమైంది.

"ఇదేం విడ్డూరం? ఈ పిల్లికూన ఇప్పటిదాకా నడవనేలేక పోయిందిగదా? ఎల్లా ఎగురుతోందో?" అన్నది ఉర్సులా.

"ఈమాదిరి పిల్లిని నువ్విదివర కెప్పుడూ చూడలేదు. ఇది కొత్తరకం పిల్లి," అని నవ్వాడు సైతాను

★ విచిత్ర వ్యక్తి ★

అసలే సైతానుమీద కోపంగావున్న ఉర్సులా ఈ హేళనకు మరింత మండిపడింది. "ఏయ్, అబ్బాయ్. అసలు నువ్వెవరుకి ఇక్కడికొచ్చి అనవసరంగా జోక్యం కలిగించుకోమని ఎవరు చెప్పారు? నేను ఇదివరకు ఏం చూశానో ఏం చూడలేదో నీకేం తెలుసు?"

"నాకు తెలుసుగనకే చెబుతున్నాను. ఈ పిల్లికి నాలికమీద వెంట్రుకలుంటాయి."

"చాల్లే నీ వేళాకోళం."

"వేళాకోళం కాదు. కావలిస్తే పరీక్షచెయ్."

ఉర్సులా పిల్లిని పట్టుకోబోయింది. కాని పిల్లి చేతికందకుండా దూరంగాపోయింది. ఉర్సులా పిల్లిని పట్టుకోవాలని మహా ప్రయత్నించింది. పిల్లి అందలేదు. చివరికి విసుగుపుట్టి తన ప్రయత్నం విరమించింది.

"ఏదన్నా పేరుపెట్టి పిలు; వస్తుందేమో," అన్నాడు సైతాను.

ఉర్సులా ఏవేవో చాలా పేర్లుపెట్టి పిలిచింది. కాని పిల్లి వినిపించుకోలేదు.

"ఆగ్నెస్ అని పిలు; వస్తుందేమో," అన్నాడు సైతాను.

ఈసారి పిల్లి దగ్గిరికి వచ్చింది. ఉర్సులా దాన్ని పట్టుకొని నోరు తెరచి పరీక్షించింది. "అరె. నిజమే. నాలికమీద వెంట్రుక లున్నాయి. ఇలాంటి పిల్లి నెప్పుడూ చూడలేదు. ఈ పిల్లి నీదా?" అని ఉర్సులా సైతాన్ని అడిగింది.

"కాదు."

"మరి దాని పేరు నీ కెల్లా తెలిసింది?"

"ఈ జాతిపిల్లుల్ని ఆగ్నెస్‌పిల్లు లంటారు. మరే పేరుతో పిలిచినా అవి పలకవు."

"ఎంత చిత్రంగా ఉంది!" అనుకుంది ఉర్సులా. ఇంతలో ఏదో సందేహం కలిగినట్లుంది; పిల్లిని కిందదించి "ఊహు. ఈ పిల్లిని ముట్టుకోగూడదు. వదిలేస్తాను...నాకు భయమని కాదు...ఇట్లాంటి పిల్లుల్ని... ఏమో కొందరు అంటుండగా విన్నాను...కాకపోయినా ఈపిల్లి ఇప్పుడు నిక్షేపంగా వుంది. దాని బతుకు అది చూసుకోగలదు. క్షిన్ని నేను సాక నక్కర్లేదు," అన్నది. "మంచిపిల్లే పాపం. చూట్టాని క్కూడా నాజూగ్గావుంది. మిస్ మార్గరెట్ ఒంటరిగా ఏమీతోచక బాధపడుతోంది. ఈ పిల్లి వుంటే దీంతో కాలక్షేపం చెయ్యొచ్చు. కాని......"

"ఇంతమంచి పిల్లిని వదిలిపెట్టడం భావ్యంకాదు" అన్నాడు సైతాను.

ఉర్సులా ఉత్సాహంతో "ఏం?" అని అడిగింది.

"ఈ జాతి పిల్లుల్ని పెంచితే మంచి అదృష్టం."

"నిజంగా? చెప్పు, అబ్బాయ్, నిజంగానే? ఏమిటా అదృష్టం?"

"ఈ పిల్లులు డబ్బిస్తాయి."

"ఎల్లా ఇస్తాయి?"

"దీన్ని పెంచినవాళ్ళకి ప్రతి ఉదయం జేబులో నాలుగు వెండినాణాలు కనిపిస్తాయి."

ఉర్సులాకు ఒళ్లు మండిపోయింది. కొత్త యువకుడు తన్ను వేళాకోళం చేస్తున్నాడనుకొంది. చూస్తుండగానే ఆమె కోపం రెచ్చిపోయింది. కసితీరా తిడదామనుకుంది. అప్రయత్నంగా గౌనుజేబుల్లో రెండు చేతులూ పెట్టి, నిటారుగా నుంచుని, తిట్లు ప్రారంభించబోయింది. హఠాత్తుగా ఆమె ముఖం మారింది; కోపం మాయమై, ఆశ్చర్యమో, భయమో, సంతోషమో ప్రవేశించింది. నెమ్మదిగా ఒక జేబులోంచి చేయి తీసింది. గుప్పిలి విప్పి చూస్తూ నుంచుంది. చేతిలో నాలుగు వెండినాణాలు మెరిశాయి. అవి మాయనాణాలేమో, మాయమైపోతాయేమోనని అలాగే చూస్తూ నుంచుంది. చివరికి భక్తి విశ్వాసా లుట్టిపడే స్వరంతో అన్నది: "నిజం. నిజం. నువ్వన్నది అక్షరాలా నిజం. క్షమించు. తెలియక కారుకూతలు కూశాను. నువ్వు నిజంగా దేవతవి," అంటూనే పరుగునవచ్చి సైతాను చెయ్యి ముద్దుపెట్టుకుంది. ఆస్ట్రియన్ ఆచారంప్రకారం చెయ్యి మళ్ళీ మళ్ళీ ముద్దుపెట్టుకుంది.

డబ్బు చూసి ఉర్సులా సంతోషించినప్పటికీ, ఈ పిల్లి మంత్రపు పిల్లి అనీ, ఇదంతా సైతానుమాయ

అన్నీ, మనస్సులో అనుకునే వుండాలి. ఏ మాయ అయినా స్వీకరించటాని కామె సిద్ధంగానే వుంది. రోజూ రెండుపూటలా తిండికి సరిపోయిన డబ్బు ఇస్తే చాలు. సైతాను మహిమ అయినా ఫరవాలేదు. నిజానికి ఎంత దైవభీతిగలవారికైనా సైతాను నిజాయితీలో ఉన్నంత నమ్మకం దేవతలమీద కూడా ఉండదు.

ఆగ్నెస్ పిల్లిని చంకబెట్టుకుని ఉస్సులా ఇంటికి బయల్దేరింది. నేనుకూడా ఒక్కసారి మార్గరెట్‌ను చూసి వస్తే ఎంత బావుండు ననుకున్నాను. అనుకోవటమే తడవు మరుక్షణంలో మార్గరెట్ ఇంట్లో ఉన్నాము. మార్గరెట్ కుర్చీలో కూర్చుని వుంది. మెల్లిగా తలఎత్తి మమ్మల్ని చూసింది. మనిషి అమిత బలహీనంగా వుంది. కాని సైతాను సన్నిధిలో బలహీనత, అనారోగ్యం ఉండటానికే వీల్లేదు. సైతాన్ని చూడగానే ఆమె చురుకుగా లేచి నిలబడింది. సైతాన్ని ఆమెకు పరిచయం చేశాను. అతని పేరు ఫిలిప్ ట్రామ్ అని, నా స్నేహితుడనీ చెప్పాను. ముగ్గురం కూర్చున్నాము. సైతాను రెండుక్షణాల్లో మార్గరెట్ బెరుకుపోగొట్టాడు. చిరపరిచితుడితో మాట్లాడినట్లే ఆమె మాట్లాడ సాగింది. తనకు తెలియకుండా, చప్పుడు కాకుండా లోపలికెల్లా వచ్చారంది. తలుపులు తెరిచే ఉన్నాయనీ, ఆమె పరధ్యానంగా ఉండి మారాక గమనించలేదనీ సైతాను చెప్పాడు. అది అబద్ధం. నిజానికి ఏ తలుపులూ తెరిచి లేవు. మేము గోడల్లోంచో, ఇంటికప్పులోంచో, భూమి అడుగునుంచో ఎల్లా వచ్చామో నాకే తెలియదు. కాని సైతాను మాటకు తిరుగులేదు. అతడు చెప్పింది ఎంత పచ్చి అబద్ధమైనా అవతలి మనిషి నమ్మితీరాల్సిందే. సైతాను చెప్పింది నిజమేనని మార్గరెట్ నమ్మింది. అతడు కబుర్లు చెబుతున్నంత సేపూ అతనివంకే చూస్తూ కూర్చుంది. లోకోత్తరమైన అతని సౌందర్యానికి ఎవరు ముగ్ధులు కారు? ఆమె అతనికేసే దీక్షగా చూడటం నాకు కూడా ఒకవిధమైన గర్వం కలిగించింది.

సైతాను అబద్ధాలమీద అబద్ధాలు చెప్పుకుపోతున్నాడు. తనకి తల్లీ, తండ్రీ లేరనీ, చిన్నప్పుడే చనిపోయారనీ చెప్పాడు. మార్గరెట్‌కి చనిపోయిన తన తలిదండ్రులు జ్ఞాపకం వచ్చారోయేమో కళ్ళనీళ్లు పెట్టుకుంది. తనకొక పినతండ్రి ఉన్నాడని, ఆయన బాగా ధనవంతుడనీ, ఆయనే దిక్కులేని తన్ను చేరదీసి పెంచి పెద్దవాణ్ని చేశాడనీ చెప్పాడు. మార్గరెట్‌కి జైల్లోవున్న తన పినతండ్రి జ్ఞాపకంవచ్చి గాభరను, మళ్లీ కన్నీళ్లు జొటజొట కారాయి. తన పినతండ్రీ, అతని పినతండ్రీ ఎప్పుడన్నా కలుసుకుంటే బావుండునని ఆమె అన్నది. ఆమాట వినేటప్పటికే నావొళ్ళు జలదరించింది. "అవును. వాళ్లిద్దరూ ఒకరొకరికి పరిచయం కావటం బాగానే వుంటుంది," అన్నాడు సైతాను. నాకు మళ్లీ వొళ్లు జలదరించింది. [2]

"ఏమో ఎవరికి తెలుసు? ఎప్పుడన్నా కలుసుకుంటారేమో? మీ పినతండ్రి ఏం చేస్తూవుంటాడు?" అని అడిగింది.

"అబ్బో ఆయనకి ఒకటా? లక్షపనులు. ఎప్పుడూ తిరుగుతూనే వుంటాడు."

ఈవిధంగా యిద్దరూ సంభాషణ సాగించారు. మార్గరెట్ ఇన్నాళ్లూ తను పడిన కష్టాలు మరచిపోయింది. ఉత్సాహంతో ఆమె కళ్లు ప్రకాశించాయి. సైతానుమీద క్రమంగా ఆమెకు అనుకూలభావం ఎక్కువవుతున్నట్లు గ్రహించాను. చర్చి ఉద్యోగానికై విద్య అభ్యసిస్తున్నానని అతడు చెప్పినప్పుడు మార్గరెట్‌కు అతనిపై గౌరవం ఇంకా ఎక్కువైంది. తరవాత జైల్లో ఉన్న ఫాదర్ పీటర్‌ను మార్గరెట్ ప్రతి రోజూ చూడగల ఏర్పాట్లు చేస్తానని చెప్పినప్పుడు అతనిమీద ఇష్టం నూరింతలయింది. సైతాను అప్పటికప్పుడే ఒక కాగితంమీద ఏవో వింత అక్షరాలు రాశాడు. అది మార్గరెట్ కిచ్చాడు. జైలు కావలివారికి ఆ కాగితం చూపిస్తే లోపలికి వెళ్లనిస్తారని, బయటికి వచ్చేటప్పుడు మళ్ళీ చూపించమనీ చెప్పాడు. మార్గరెట్ ముఖం వికసించింది. ఎప్పుడు చీకటి పడుతుందా, ఎప్పుడు పోయి పినతండ్రిని చూద్దామా అని తొందరపడింది. ఆ రోజుల్లో శాసనాలు మహాక్రూరంగా ఉండేవి. ఖైదీలు సంవత్సరాల తరబడి బంధుమిత్రులను చూడకుండా కారాగారాల్లో మగ్గేవారు. ఒకపట్టాన సామాన్యజనులెవ్వరూ ఖైదీలను చూసేందుకు అనుమతి లభించేది కాదు. అందుచేత మార్గరెట్ తన అదృష్టానికి పొంగిపోయింది. సైతాను కాగితంమీద గిలికిన అక్షరాలు కావలివారి నిమంత్రించేందుకు ఉపయోగపడతాయని, ఆ కాగితం చూసి కావలివారు ఆకాసేపూ [illegible]

2. మన కథలోవచ్చే సైతాను అసలు సైతాను కాదు అసలు సైతాను తనపినతండ్రి అని ఇతడు చెప్పాడు. అసలు సైతాను దేవుడిమీద తిరుగుబాటు చేసి నరకంలో పడిపోయినవాడు.

ఏం జరుగుతున్నదీ తెలుసుకోలేని స్థితిలో ఉంటారనీ నేను గ్రహించాను.

ఇంతలో ఉర్సులా వంటగదినుండి బయటికి వచ్చి "వంట అయిందమ్మా," అన్నది. నన్నూ, సైతాన్ను చూసి తెల్లబోయింది. నన్ను పిలిచి రహస్యంగా అడిగింది, "పిల్లిసంగతి మార్గరెట్‌తో చెప్పారా?" అని. చెప్పలేదన్నాను. "చెప్పవద్దు. చెబితే మార్గరెట్ వెంటనే మతగురువును పిలిపించి, మంత్రాలు చదివించి, పిల్లి దగ్గరవున్న శక్తులు తీసివేయిస్తుంది. అది మంచిపిల్లి అయినా దెయ్యపుపిల్లి అయినా రెండుపూటలా తిండికి లోటులేకుండా చేస్తుందిగదా! దాన్ని పోగొట్టుకోవటం ఎందుకూ?" అని నన్ను హెచ్చరించింది.

మార్గరెట్ భోజనానికి సిద్ధమవుతున్నది. "వెడదామా" అని సైతాన్ను అడిగాను. "భోజనంచేసి పోదాము," అన్నాడు సైతాను. ఈమాటకు మార్గరెట్ గాబరాపడింది. 'ఇంట్లో ఒక్కమనిషి అర్ధాకలిగా తినటానికైనా పదార్థాలులేవే' అనే చింతలో పడింది ఆమె. ఉండమనటానికీ, పొమ్మనటానికీ కూడా మాట రాక ఆమె స్తబ్ధురాలైంది. ఇంతలో సైతాను మాటలు విన్నది గాబోలు ఉర్సులా అక్కడికి వచ్చింది. మొదట మార్గరెట్ ముఖంలోని తేజస్సు, చురుకుదనం చూసి ఆశ్చర్యపోయింది. తరవాత మా కర్థం కాదనుకుని బొహీమియన్ భాషలో మార్గరెట్‌తో అన్నది! "మిస్ మార్గరెట్! వీళ్ళని పొమ్మను. ఇంట్లో పదార్థాలేమీ లేవు."

మార్గరెట్ సమాధానమిచ్చే లోగానే సైతాను అందుకున్నాడు. బొహీమియన్ భాషలోనే అన్నాడు: "ఇందాక నువ్వే కదూ రోడ్డుమీద నాకు కనిపించావు -"

"అవును."

అతడు బొహీమియన్ భాషలో మాట్లాడటం ఉర్సులాకు, మార్గరెట్‌కూ కూడా ఆశ్చర్యం కలిగించింది.

"అయితే నేనింకా నీకు జ్ఞాపకం ఉన్నానన్నమాట," అంటూ ఉర్సులాను కొంచెం అవతలికి తీసుకుపోయి మార్గరెట్‌కు వినపడకుండా చెప్పాడు: "నీతో ఇందాక చెప్పలా? ఆ పిల్లి కోరినదంతా ఇస్తుంది. ఏమీ భయపడకు. అది ఎంతమందికైనా భోజనం సిద్ధం చెయ్యగలదు."

ఉర్సులా ముఖం చేటంతఅయింది. ఆమె ఆందోళన తీరిపోయింది. కళ్లలో ఆర్థికమైన ఆనందం కందళించింది. పిల్లి విలువ క్షణక్షణానికి హెచ్చుతున్నట్లు ఆమె గ్రహించింది.

"భోజనంచేసి పోదాం" అని సైతాను అన్న మాటకు మార్గరెట్ ఇంతవరకూ సమాధానమివ్వలేదు. తాను అతిథులను తృప్తికరంగా సత్కరించే స్థితిలో లేననీ, అయినా ఉన్నదాంతోనే సంతోషించవలసిందిగా ప్రార్థిస్తున్నాననీ అన్నది.

ఉర్సులా మాకు వంటగదిలో భోజనపు బల్లా, పళ్ళాలూ, అవీ అమర్చింది. మేము సుఖంగా ఆసీనులమయ్యాము. పొయ్యిమీద పెనంలో చేప నొకదాన్ని ఉర్సులా వేయిస్తున్నది. కమ్మటి వాసనలు గది అంతటా ఆవరించి నోరూరించాయి. మార్గరెట్ ఆశ్చర్యపడింది, అదెక్కడినుంచి వచ్చిందా అని. చేప వేగిన తరవాత ఉర్సులా దాన్ని తీసుకువచ్చి మార్గరెట్‌కిచ్చింది. మార్గరెట్ దాన్ని రెండు ముక్కలుగాకోసి ఒకటి నాకూ, ఒకటి సైతానుకూ వడ్డించింది. తనకు చేపలమీద అంత ఇష్టం లేదన్నది. ఇంతలో పెనంలో మరొకచేప వేగుతూండటం చూసింది. ఆశ్చర్యపడింది కాని పైకి ఏమీ అనలేదు. బహుశా ఉర్సులాను తరవాత అడిగి కనుక్కుందామని అనుకునిఉంటుంది. ఇంతలో ఉర్సులా రుచికరమైన మాంసం, ద్రాక్షరసం, పళ్లు వరసగా తీసుకువచ్చి వడ్డించసాగింది. మార్గరెట్ ఇవన్నీచూసి ఆశ్చర్యం ప్రకటించకుండా ఊరుకుంది. అదికూడా సైతాను ప్రభావమే అయివుంటుంది. అతడు భోజనం ఆరగిస్తూ ఇష్టాగోష్ఠిగా సంభాషణ ప్రారంభించాడు. నిమిషానికి వంద అబద్ధాల చొప్పున కల్పించి తియ్యతియ్యగా మాట్లాడాడు. అతడు ఎన్ని అబద్ధాలాడినా అతని కేమీ ఇబ్బందిలేదు. దేవతగనక అతనికి పాపం చుట్టుకోదు; అసలు దేవతలకి పాపపుణ్యాల ప్రసక్తే లేదని అతడే చెప్పాడుగా!

సైతాను ఉర్సులాను అదేపనిగా ముఖస్తుతి చేశాడు. మార్గరెట్‌తో రహస్యంగా చెబుతున్నట్టు నటిస్తూ, బిగ్గరిగా ఉర్సులా వంటను మెచ్చుకున్నాడు. ఉర్సులాకు వయస్సు ముదిరినా ఇంకా అందంగానే ఉందని, ఆమెకు తన పినతండ్రిని పరిచయం చేస్తానని అన్నాడు. ఈ మాటలు ఉర్సులా విననట్టు నటిస్తూనే విన్నది. ఆ వృద్ధురాలి కెక్కడలేని సిగ్గూ వచ్చింది. యువతులకు సహజమైన లజ్జ అభినయిస్తూ గాను నవి

★ విచిత్ర వ్యక్తి ★

రించుకోవటం, జుట్టు సవరించుకోవటం మొదలుపెట్టింది. ఆ దృశ్యం జుగుప్సాకరంగా వుంది. సైతాను మానవజాతిని అవమానిస్తున్నట్టు అనిపించి సిగ్గుతో తలవంచుకున్నాను.

ఇంతలో ఆగ్నెస్‌పిల్లి మా కుర్చీలవద్దకు వచ్చింది. నేను చూడకుండా అది నాచెయ్యి నాకింది. ఆ నాకటంలో ఒక రహస్యం బయటపడింది. దాని నాలుకమీద వెంట్రుకలూ లేవు, గింట్రుకలూ లేవు. "ఇది మామూలు పిల్లే" అనబోయాను; కాని నోట్లో మాట నోట్లోనే ఆగిపోయింది. సైతాను నావంకచూసి నవ్వాడు. అప్పుడర్థమైంది నాకు.

ఆ రోజున చీకటి పడగానే మార్గరెట్ ఒక బుట్టలో భోజనం, ద్రాక్షరసం సీసా, పళ్లు పెట్టుకుని జైలుకి బయల్దేరింది. నేనూ, సైతానూ మా యింటి వైపు నడుస్తున్నాము. నాకు ఒక ఆలోచన కలిగింది, జైలు లోపల ఎల్లా వుంటుందో చూడాలని. నా ఆలోచన సైతాను విన్నాడు. మరుక్షణం మేము జైల్లో ఉన్నాము. మేమున్న గది చిత్రహింసల గది అని సైతాను చెప్పాడు. నేరస్థులను అక్కడ రకరకాలుగా హింసించేందుకు యంత్రాలున్నాయి. ఒకటి రెండు గుడ్డిదీపాలు మినుకుమినుకుమని వెలుగుతూ ఆ గదిని మరింత భయంకరం చేస్తున్నాయి. ఒక బల్లమీద ఖైదీ ఒకడు కాళ్లు చేతులు కట్టివేయబడి పడి వున్నాడు. మృత్యుకింకరుల్లాంటి జైలు అధికారులు, భటులు అతనిచుట్టూ వున్నారు. మమ్మల్ని వారు గమనించనందున మేము అదృశ్యులమై ఉన్నామని గ్రహించాను. ఆ ఖైదీ మతద్రోహి అని ఆరోపణ చేయబడింది. "మతద్రోహి వని ఒప్పుకుంటావా? లేదా?" అని అధికారులు అడుగుతున్నారు. "నేను మతద్రోహిని కాను, కాను, కాను," అని ఖైదీ సమాధానం చెబుతున్నాడు. కొంతసేపైన తర్వాత భటులు ఖైదీ గోళ్లలో గుండుసూదులు దిగవెయ్యసాగారు. అతడు గుండెలు బద్దలయ్యేటట్లు బాధతో అరుస్తున్నాడు. ఆ అరుపులు విని నాకు తల తిరిగిపోయింది. ఆ గుండుసూదులు నాకే గుచ్చబడుతున్నట్లు నిలువెల్లా గజగజ వణికిపోయాను. సైతాను ఎప్పటివలెనే నిశ్చలంగా నవ్వుతూ చూస్తున్నాడు. చివరికి మూర్ఛపోయే స్థితిలో వున్న నన్ను పట్టుకుని బయటికి తీసుకురావలసివచ్చింది. చల్లగాలి సోకగానే నేను మామూలు మనిషి నయ్యాను. చిత్రహింసల గదిని తలుచుకుంటే వొళ్లు గగుర్పొడిచి మళ్ళీ కంపించాను. "అబ్బ! ఎంత ఘోరమైన హింస! వాళ్లు మనుషులా జంతువులా?" అన్నాను.

"కాదు, వాళ్లు మనుషులే. వాళ్ళని జంతువులతో ఎందుకూ పోలుస్తావు? మనుషులు చేసే పనికి జంతువుల నెందుకూ అవమానిస్తావు? తప్పుతప్పు," అన్నాడు సైతాను.

"మీ జాతి ఎంత అబద్ధాలకోరో చూశావా? ఎక్కడలేని సద్గుణాలూ తనకే ఉన్నాయంటుంది. దుర్గుణాలన్నీ, తనకంటే ఉన్నతశ్రేణికి చెందిన జంతువులకు ఆరోపిస్తుంది. అసలు సద్గుణాలనేవి ఉంటేగింటే ఉన్నతశ్రేణి జంతువులకేగాని మానవజాతికి లేనేలేవు. ఏ జంతువూ ఇంత క్రూరహింస చెయ్యలేదు. ధర్మాధర్మ విచక్షణ చెయ్యగల మానవజాతికే అది చేతనైనపని. ఏ జంతువైనా హింసచేసినప్పుడు తను చేసేది హింసఅని దానికి తెలియదు. అందుచేత అది తప్పనీ, అసలు తప్పనేదొకటి వుందనీ దానికి తెలియదు. పైగా ఏ జంతువూ హింసకోసమే హింసచెయ్యదు; తన సంతోషంకోసం అంతకన్నా చెయ్యదు. ధర్మాధర్మవిచక్షణ చేస్తున్నాననే గర్వంతో మానవుడొక్కడే ఆపని చెయ్యగలడు. ఏది ధర్మమో ఏది అధర్మమో నిర్ణయించేశక్తి మానవుడొకడికే ఉన్నది. ధర్మం చెయ్యటమో, అధర్మం చెయ్యటమో నిర్ణయించుకునే శక్తికూడా అతని కొక్కడికే ఉన్నది. ఆ శక్తి ఉండటంవల్ల అతనికొచ్చిన లాభమేమిటి? పది సందర్భాలు తీసుకుంటే తొమ్మిది సందర్భాల్లో మానవుడు అధర్మం చెయ్యటానికే నిర్ణయించుకుంటున్నట్టు కనిపిస్తుంది. అసలు అధర్మం అనేది ఎందుకుండాలి? ధర్మాధర్మ విచక్షణ లేకపోతే అధర్మం అనేదే ఉండదు. కాని మానవుడు ఎంత తెలివితక్కువ వాడంటే, ధర్మాధర్మ విచక్షణ జ్ఞానంవల్లనే, తను జంతుకోటిలో అన్నిటికన్నా అధఃశ్రేణిలో ఉన్నానన్న సంగతి అతడు గ్రహించటంలేదు. ఏమోయ్ థియొడోర్! మాట్లాడవేం? నీ కింకో తమాషా చూపిస్తా నాగు."

(ఇంకా వుంది)



ఎమ్. ఆర్. ఏ. వారి "లేడీడాక్టరు"లో కృష్ణవేణి.



"నువ్వెప్పుడూ ఇంతేబావా" అని చెట్టెక్కి కూర్చుంది సీత జయంతి ప్రొడక్షను వారి "బంగారు భూమి"లో అంజలీదేవి.

విజయవంతమైన చిత్రం
"దాసి"---సమీక్ష

సాంఘిక చిత్రాలనబడే వాటిలో స్థూలంగా రెండు రకాలు ఏదో సమస్య తీసుకుని, ఆ సమస్య ఆధారంగా కథ అల్లి, రచయిత జీవితదృక్పథం వ్యక్తంచేసేది ఒక రకం, ఏ సమస్యా లేకుండా కాశీమజిలీల కథలవలె 'ఎంటర్‌టెయిన్మెంట్' కోసం ప్లాట్ ప్రధానంగా కలది మరొకరకం రాజ్యం పిక్చర్సు వారి "దాసి" రెండోరకానికి చెందిన చిత్రం అయితే రచయిత ఒక కథ రాసిన తరవాత అందులో అతని జీవిత దృక్పథ మంటూ ఉండకపోదు ఈ చిత్రం కథలో దాసీత్వంపై రచయిత్రి గౌరవం కనిపిస్తూ వుంది

ఈ చిత్రంలో కథ తెలుగువాళ్ళకథగా కనుపించదు, బెంగాలీవాసన బాగా కొడుతోంది కథద్వారా రచయిత సాధించదలచినది, చెప్పదలచినది ఏమీ లేదు కథ కోసమే కథ అన్నట్లుగా ఉంది

పిల్లలు లేని ఒక జమీందారు రెండో పెళ్ళి చేసుకుందా మనుకుంటాడు జమీందారు భార్య తన అన్న ప్రోద్బలంవలన, లేడీ డాక్టరు సహాయంతో, గర్భవతిగా ఉన్నట్లు నటించి భర్త రెండో పెళ్ళి ప్రయత్నం మాన్పిస్తుంది దాసి లక్ష్మిని ఒప్పించి ఆమెకు పుట్టిన ఆడపిల్లను తన పిల్లే నని అందరినీ నమ్మిస్తుంది దాసి భర్తచేత అనుమానించబడటం, భర్త రెండో పెళ్ళి చేసుకొని కష్టాల పాలవటం, దాసి ఒక డాక్టరు ఇంట్లో చేరి కొడుకును ప్లీడరీదాకా చదివించటం, జమీందారిణి వద్ద పెరిగి పెద్దదైన ఆడపిల్ల ఆఖరికి తన కన్న

★ "దాసి" సమీక్ష ★

తల్లి దాసియే నని గుర్తించటం, చివరికి దాసీ, ఆమె భర్త, కుమారుడు, కూతురు అంతా కలుసుకోవటం జరిగి, కథ సుఖాంతంగా ముగిసిపోతుంది

ఈ చిత్రాన్ని ఇంటర్వల్ వరకూ చూసి వట్లయితే అది విజయవంతం కాగలదని ఎవరూ ఊహించలేరు రెండో భాగం చూసినతరవాత ఎందుకు విజయవంతమైనదీ అర్థమవుతుంది ముఖ్యంగా క్లైమాక్సు దగ్గిర పడుతున్నకొద్దీ ప్రేక్షకులను కథ బలంగా ఆకర్షించటం ప్రారంభిస్తుంది క్లైమాక్సు దృశ్యాలు ఎంత రాతిగుండెవాడినైనా కరిగించగల శక్తితో చిత్రించబడినవి మొదటి భాగంలో కనిపించే దర్శకత్వ ధోరణికీ, చివరి భాగంలోని దర్శకత్వపు ధోరణికీ బోలెడంత వ్యత్యాసం కనిపిస్తుంది చిత్రం చెడిపోకుండా ఆఖరున ఎవరో సమర్థుడైన దర్శకుడు వచ్చి రక్షించినట్లు తోస్తుంది

మొదటి భాగం ఆఖరయ్యేదాకా పాత్రలు కథలో స్థిరపడక గాలిలో తేల్తున్నట్లు కనిపిస్తారు "అనగనగా ఒక జమీందారుండెను ఆయనకు పిల్లలు లేనందున రెండో వివాహము చేసుకొనదలచెను " అన్న ధోరణిలో దృశ్యాలు ఒకదాని వెనుక ఒకటి నడిచిపోతాయి ఏ సన్నివేశంలో అవసరమైనపాత్ర ఆ సన్నివేశంలో వచ్చి తనమాటలు అప్పజెప్పి నిష్క్రమించటం, సంఘటనలో *Narrative* ప్రాధాన్యంతప్ప *Emotional* ప్రాధాన్యం లేకపోవటంవల్ల పాత్రలకు నిజమైన పాత్రత్వం ఏర్పడదు సన్నివేశాలు పేలవంగా, వార్తాపత్రికలో చదివే రిపోర్టుల్లాగా ఉంటాయి పాత్రలు నిర్జీవంగా కనిపిస్తారు వారిమీద ప్రేక్షకుడికి సానుభూతికలగకపోగా జుగుప్స కలుగుతుంది ఇంత కృత్రిమంగా నడిచే కథ పోనుపోను బలం చేకూర్చుకుంటుంది దాసి భర్త రామయ్య సన్యాసం వదిలిపెట్టి ప్లీడరు పని చేస్తున్న కొడుకుదగ్గరే నౌకరీకి కుదరటం దగ్గిర్నించి, దాసి తన కూతురు చేత గుర్తించబడటం, భర్త రామయ్యను కలుసుకోవటం వరకూ దర్శకుడు చక్కని ప్రతిభ కనబరచాడు ఈ దృశ్యాలవల్ల కథకు ప్రాణప్రతిష్ఠ జరిగింది

కథకు కృత్రిమత్వం ఆపాదించే యాదృచ్ఛిక సంఘటనలు విరివిగా ఉన్నాయి అన్నిటికంటే ఘోరంగా కనిపించేది, దాసి లక్ష్మి ఆత్మహత్యకై యేట్లో పడబోతుండగా కొనఊపిరితో వున్న కొడుకు చేతికి దొరకటం ఆ పిల్లవాడు ఎంతో దూరంనుంచి కొట్టుకొని వస్తున్నా చనిపోక బ్రతికేవుంటాడు


దాసి పాత్రీకరణం ఒకటే దాదాపు నిర్దుష్టంగా ఉన్నది జమీందారిణీ, ఆమె అన్న రామారావు, మరొక దాసి నరసమ్మ మొదలైన పాత్రలు జుగుప్స కలిగిస్తాయి జమీందారు మేనలుడు నారాయణ, దాసి భర్త రామయ్య, రామయ్య రెండో భార్య, ఆమెను లేవదీసుకుపోయిన నటుడు వగైరా కొన్ని పాత్రలు ప్రయోజనానికి మించిన ప్రాధాన్యం గలవి

సదాశివబ్రహ్మంగారు రాసిన సంభాషణల్లోను, ఆత్రేయ రాసిన పాటల్లోను మోతాదు మించిన 'సెంటిమెంటాలిటీ' కనిపిస్తుంది ముఖ్యంగా ఆత్రేయగారి పాటలు ఘోరంగా వున్నాయి జట్కా రామయ్య చేత సగం తురకం, సగం తెలుగు పాట పాడించటంలో అర్థంలేదు ఏ ఒక్క పాటా సందర్భోచితంగా లేదు లక్ష్మిరాజ్యం పాడిన ఒకటి రెండు జోల పాటలుంచి మిగతావన్నీ తీసివేస్తే చిత్రం ఇంకా బాగుండేది చిత్రం ఆఖరుభాగంలో పాటలు అట్టే లేకపోవటంవల్లనే ఆభాగం అంత రక్తి కట్టింది

నటీనటుల్లో ప్రశంసాపాత్రమైన కౌశలం చూపించింది ఒక్క లక్ష్మిరాజ్యమే ఎన్ టి రామారావు నటన



ఫిల్మ్‌నగర్ స్టూడియోస్ వారు తీస్తున్న "షామా—పర్వానా"లో నీల్ కమల్



తన పిల్లలు సుఖంగా ఉండటం చూసి మురిసిపోయాడు. కాని తనే వారి తండ్రినని చెప్పుకోలేని దురవస్థలో పడ్డాడు ఆ అభాగ్యుడు

అవరిండియా వారి "నాయిల్లు" చిత్రంలో నాగయ్య, రామశర్మ, గోపాలకృష్ణ.

అసహజంగా వున్నది రంగారావు కివ్వబడిన పాత్ర ఒక పాత్ర కానే కాదు కనక ఆయన చేసినదేమీ లేదు రేలంగి, శివరావు ఈ చిత్రంలో నవ్వించటానికి వృథాప్రయత్నాలు చేశారు వీరుగాక ఈ చిత్రంలో శ్రీవత్స, దొరస్వామి, శాంతకుమారి, కనకం, వసంత, హేమలత మున్నగువారు నటించారు

ఈ చిత్రంలో కీర్తిశేషుడు సుబ్బరామన్, దక్షిణామూర్తిగార్లు సంగీత దర్శకులు కొన్నిచోట్ల నేపథ్యసంగీతం బాగున్నంతగా పాటల సంగీతం బాగులేదు; సామాన్యంగా ఉందనే చెప్పాలి ఫొటోగ్రఫీ మన చిత్రాల సాధారణ స్థాయిని ఎక్కడా మించలేదు.

ఈ చిత్రానికి నిర్మాత సి. లక్ష్మీరాజ్యం; డైరెక్టరు సి. వి. రంగనాథదాసు; పర్యవేక్షకుడు ప్రసాద్ నవంబరు 30 వ తేదీన మద్రాసు పారగన్‌లో పత్రికలవారికి చూపించబడింది. ★



స్టార్ క్రియేటర్స్ వారి 'పరివార్' హిందీ చిత్రంలో సులోచనా ఛటర్జీ

ప్రశ్నలు..సమాధానాలు

బి. మధుసూదనరావు—విజయవాడ.

ఇటీవల మద్రాసు రేడియో ద్వారా "చిత్రసీమ"నందు వివిధ ప్రశ్నలకు బి. ఎన్. రెడ్డిగారు జవాబులిస్తూ నేటి చిత్రాలకు సెన్సారుబోర్డు అవుసరము లేదని ఒక ప్రశ్నకు జవాబిచ్చారు. నేటి శాస్త్రీయ దేశపు చిత్రాలకి మీదృష్టిలో సెన్సారు బోర్డు అవసరా నవసరముల గూర్చిక్లుప్తంగా తెలుపమనవి.

—అవినీతి యుత ప్రవృత్తులను రెచ్చగొట్టే చిత్రాలను సెన్సారు చేయటం అవసరమే. తెలుగులో అటువంటి చిత్రాలు దాదాపు లేవనే చెప్పాలి. హిందీలో ఉంటే ఉండవచ్చు. హాలీవుడ్ చిత్రాల్లో అధికభాగం అలాటివే. హాలీవుడ్ చిత్రాలను ఆమోదిస్తూ మనదేశపు చిత్రాలపై ప్రభుత్వం చర్యతీసుకోటంలో అర్థంలేదు.

* * *

శ్రీ సి హెచ్. గోపాలకృష్ణమూర్తిగారు-
నిజామాబాద్. (హైద్రాబాదు)

గలివర్సు ట్రావెల్సులో వ్రాసిన లిల్లీపుట్ దేశము ఉన్నదా? బొటనవ్రేలంత మనుష్యులు ఆ దేశములో ఉన్నారా?

—"లిలిపుట్" దేశము కేవలము ఊహాకల్పితమైనది. అట్టి పొట్టి మనుష్యులు లేరు.

* * *

శ్రీ మదనగిరి గోపాలరావుగారు -
బొబ్బిలి.

రాజాజీ నల్లద్దాల కళ్ళజోడు పెట్టుకొనుటచేత మనము పడే కష్టాలు కనిపించవని మా స్నేహితు డంటాడు' మీ ఉద్దేశ్యమేమి?

—మన కష్టాలు భగవంతునకు కన్పించి భగవంతుడు మనలను కనిపెట్టినయెడల, రాజాజీ కళ్లు మూసికొని నిద్రపోయినప్పటికి, మన కష్టాలు ఆయనకు సింహస్వప్నంలాగున కన్పించి తీరుతాయి. మన కష్టాలకూ ఆయన కళ్ళకూ మధ్య అద్దాలు అడ్డంరావు.

* * *

అక్కల కమల—కొండపల్లి.

సినిమాలలో నటించటం చాలా కష్టమని నేను, తేలికని నాస్నేహితురాలు అనుకుంటున్నాము. ఇందు ఏది నిజమంటారు.

—మీరే ప్రయత్నించి చూడండి.

* * *

శ్రీ వి. మురళీధర్ గారు-మచిలీపట్నం.

తమ చేతిలోని కీలుబొమ్మ స్త్రీయనియు, తమకొరకు సృష్టిచేయబడిన విలాసవస్తువనియు పురుషుడు తలచి ఆమె మీద సర్వాధికారములు చలాయించుచుందురు. ఇది ఎంతవరకు నిజము ?

—సహజ సిద్ధమైన శరీరప్రకృతినిబట్టి స్త్రీకంటె పురుషుడు బలవంతుడు. తాను బలవంతుడననే అహంకారముతో స్త్రీని చుల్కనగా చూచి, స్త్రీయొక్క విలువను పురుషుడు పూర్తిగా గ్రహించలేకపోవుట మానవుల అనాగరిక అజ్ఞాన అహంకార అమానుష లక్షణము. స్త్రీయొక్క ఆత్మవికాసానికి అవకాశం కల్పించి అట్టి ఆత్మవికాసంకొరకై స్త్రీకి గౌరవస్థానం యిచ్చినప్పుడు, పురుషుడు కూడా జ్ఞానవికాసం పొంది ఉచ్ఛదశలోకి వస్తాడు. మానవుని అనాగరిక లక్షణం అది, నాగరిక లక్షణం ఇది.

* * *

యస్. యమ్. భాషా నెల్లూరు.

ఎడిటింగ్ - పర్యవేక్షణ అంటేఏమిటి? దాని నిర్వహించువారు చేయవలసిన పనులేమి ?

—వేరువేరు సందర్భాలలో తీసిన షాట్లను కథాక్రమంలో కలపటం ఎడిటింగ్. చిత్రనిర్మాణంలో అందరి పనినీ దర్శకుడే సూపర్ వైజ్ చేస్తాడు. దర్శకుని పనినికూడా ఎవరైనా సూపర్ వైజ్ చేస్తే అతనికి పర్యవేక్షణ అని క్రెడిట్ ఇస్తారు.

* * *

శ్రీ మేలిసీమ రామన్న లత్తవరము—
(అనంతపురంజిల్లా.)

మనకు చింతకాయను చూడగానే నోట్లోనీళ్లూరును కారణమేమి ?

—చింతకాయలను ఇదివరకు తిని ఉన్నాము. అవి అమితమైన పులుపు. ఆ పులుపువల్ల నోటిలో ఉమ్మిఊరును. మనకు అనుభవంవల్ల తెలిసిన విషయం ఈ పూర్వానుభవజ్ఞానం మనలో ఉంది-చింతకాయను చూడగానే దానిని తినకపోయినా తిననట్లుగానే పూర్వానుభవ స్ఫురణ కలిగి అందువల్ల నోటిలో నీరు ఊరును. పూర్వ అనుభవస్ఫూర్తివల్ల ఇటువంటి శరీర వికారములు కలుగుతూ ఉంటాయి. మన మెన్నడూ రుచి చూచి యుండనటువంటి మరొకదేశపు క్రొత్తరకపు పుల్లని కాయను చూచినప్పుడు, దానియొక్క పులుపును గూర్చిన అనుభవజ్ఞానం మనకు లేదుగనుక నోటిలో నీ రూరదు.

* * *

ఎస్. సంజీవరావు—విశాఖపట్నం.

టెంపో, క్లయిమాక్సు అంటే ఏమిటి.

—టెంపో అంటే గమన వేగం. సినిమాలో కథ నడిచే వేగాన్ని టెంపో అంటారు. క్లైమాక్సు అంటే కథ ఒకానొక దృశ్యానికి వచ్చేటప్పటికి పతాకదశ చెందుతుంది. కథ ఏరీతిగా సమాప్త మయ్యేదీ ఆ దృశ్యం నిర్ణయిస్తుంది. అందుచేత అది అత్యంత ప్రధానదృశ్యమై వుంటుంది.

* * *

శ్రీ తోట రంగారావుగారు—తణుకు.

బళ్లు ఓడలు, ఓడలు బళ్లు అవుతాయన్న సామెత యెట్లా వచ్చింది?

—పడవలను మెట్ట నేలమీద నిర్మించి, బండ్లమీద ఎక్కించి లాగుకొనిపోయి నీటిలో వదిలిపెట్టేవారు...ఏదైనా ఒక ఎద్దుబండీని ఏరు దాటించవలసివస్తే బల్లకట్టు అనబడే పెద్ద తెప్పమీద ఆ ఎద్దుబండీని ఎక్కించి ఏరుదాటించడం కలదు' కనుక ఒకప్పుడు నావలమీదనే బళ్లున్నూ బండ్లమీదనే నావలున్నూ రావలసి

వస్తుంది. "ఓపలన్ బంస్లునూ, బండ్లన్ ఓప లునూ" రాగలవు అనే సామెత ఏర్పడింది.

* * *

యస్. వి. వి. సత్యనారాయణ—కాకినాడ.

రాజాజీకి సినిమా పరిశ్రమమీద అంత కోపము వచ్చుటకు కారణ మేమిటండీ?

—వృద్ధాప్యంవల్ల కావచ్చు.

* * *

శ్రీ యస్. లక్ష్మణరావుగారు - మద్రాసు.

"అపాయకరము" అని చూపించడానికి ఎర్రరంగును సాంకేతికంగా ఉపయోగిస్తారు. మరొక రంగును ఎందుకు ఉపయోగించకూడదు?

—"ఎరుపు" అనేది తెనుగు మాట. "రుధిర" అనేది సంస్కృతం మాట. "రెడ్" అనేది ఇంగ్లీషు మాట. "రెడ్" అనే ఇంగ్లీషు మాటకు "రడ్డీ" అనే రూపాంతరం ఉంది. "రడ్డీ" అనే రంగు గాని "రుధిరవర్ణం" అనేదిగాని ఒకే అర్థం కలవై ఉన్నాయి. "రుధిరము" అంటే "రక్తము" అని అర్థం. ఎరుపు అనేది రక్తవర్ణం. హత్య జరిగినప్పుడు ఆ ప్రదేశం అంతా రక్తమయమై ఎర్రబడుతుంది. అది ప్రాణ అపాయమును సూచించే రంగు. ఎర్రజెండా, ఎర్ర దీపం యివన్నీ అపాయసూచకములు. ఎందుచేతనంటే, అది రక్తవర్ణం గనుక - ఎవడైనా కళ్లెర్రజేసినప్పుడు కూడా మనము భయపడి దగ్గరకు వెళ్ళము.

* * *

ఎమ్. అహ్మద్ ఆలీ—ఆకివీడు.

ఫిలిం ఎక్కువ పేరు పొందుటకు దేనిపై ఆధారపడియున్నదో తెలపిస్తారా?

—కథమీద, కథను చిత్రీకరించే దర్శకుడిమీద.

సినిమా తారలు తమ పేర్లను మార్చుకుని వేరే పేర్లు పెట్టుకుందురు. ఎందువలన తెలుపుతారా?

—తార కావటమంటే మరొక- జన్మ ఎత్తటమన్నమాట. అందువలన పాత పేరు మార్చుకుంటారేమో.

* * *

శ్రీ కమ్మిలి సత్యనారాయణగారు - అవనిగడ్డ (కృష్ణా).

గోహత్య మాన్పించండి అని ఆర్. యస్. యస్. వారు ప్రచారము చేయుచున్నారు. గోవులను తప్ప తక్కిన జంతువులను హత్యచేయవచ్చుననియా అర్థము? దీనికంటె, జీవహింస మాన్పించండి అని ప్రచారము చేస్తే బాగుండునుగదా?

—జీవహింస మానండి అనే ప్రచారము అనంతమైన విషయము. చలిచీమ కూడా జీవమే. తేలు, త్రాచుపాము కూడా జీవములే. కలరా పుట్టించే క్రిములు కూడా జీవరాసులే. మన రక్తంలోనే అనేక జీవాణువులు పుట్టి గిట్టుచున్నవి. చెట్లకు కూడా ప్రాణం ఉన్నదన్నారు. కనుక, "ప్రాణిహింస మానండి" అనే ప్రచారం అగాధమైన విషయం. గోవును రక్షించడం మనకు ప్రత్యక్షంగా శ్రేయస్కరం; మంగళప్రదం. అందుచేత గోరక్షణ ప్రచారం ప్రత్యేకంగా చేయడం అవసరం.

* * *

ఎస్. దశరథరెడ్డి—సూర్యాపేట.

ఒక చిత్రం తీయుటకుముందు స్క్రిప్టు కూడ సెన్సార్ చేయుదురా మహాశయా?

—మీరు ప్రశ్న సరిగా వేయలేదు. సెన్సార్ చేసేది చిత్రం తీసిన తరవాత. చిత్రం తీసేది స్క్రిప్టుసహాయంతోటి. అందుచేత స్క్రిప్టును సెన్సారు చేయుట మనే ప్రశ్నే లేదు.

* * *

శ్రీ చలాది పాండురంగారావుగారు— మొవ్వపాలెం.

పురుషుడు ఇద్దరిని వివాహం చేసికొనవచ్చు. ఇద్దరిని ప్రేమించవచ్చు. ఆపని స్త్రీ ఎందుకు చేయలేదు?

—సహజసిద్ధంగా పురుషుడు స్త్రీకంటె ఎక్కువ దేహబలం కలవాడు. అందువల్ల ఇద్దరు భార్యలను వివాహమాడి తన బలాతిశయంవల్లనూ, అధికార ప్రాబల్యంవల్లనూ ఇద్దరు భార్యలనూ ఏలుకొని తన ఆధిపత్యం చలాయించడం ఉన్నది. ఒక్క స్త్రీకి యిద్దరు భర్తలుండినప్పటికీ, ఏభర్తవల్ల ఏ సంతానం కలిగిందో నిర్ణయించడం సాధ్యంకాదు. ఏబిడ్డ ఎవరి వారసుడో తెలియనియెడల ఏ తండ్రి ఆస్తి ఏ బిడ్డకు సంక్రమించవలెనో నిర్ణయంకాదు. కాబట్టి ఆస్తిహక్కులతగాదాలు లేకుండా ఉండాలంటే, బీజమునకు ప్రాధాన్యము ఉండాలన్నారు క్షేత్రమునకు ప్రాధాన్యం యివ్వలేదు పూర్వులు.

* * *

శ్రీ వై. కృష్ణమూర్తి— కర్నూలు.

సంస్కృతి అంటే ఏమిటి? నాగరికత అంటే ఏమిటి?

—"నగరం" అనే మాటనుంచి "నాగరికత" అనేమాట వచ్చింది. బస్తీ మర్యాదలు నగరవాస పద్ధతులు తెలియడంవల్ల పల్లెటూరివానికంటె నాజూకుగా ఉండవచ్చు. బియ్యపు ఫ్యాక్టరీలో తెల్లగా పట్టించిన బియ్యంయొక్క నాజూకువంటిది. నాగరికత - కాని "సంస్కారం" అనేది ఆత్మవికాసంవల్ల కలిగేది. దానినుండి



తన బిడ్డలని పోషించుకోటానికి ఆ ఇల్లాలు పాపం ఎన్ని బాధలు పడుతోందో! "నాయిల్లు"లో రాజకుమారి

ప్రశ్నలు - సమాధానాలు

కచ్చింటే "సంస్కృతి" భమ్మెరపోతన్నగారు పేదరైతుగా జీవించాడు. అయనలో "సంస్కృతి" ఉంది. శ్రీనాథుడు రాజసభలలో, నగరాలలో తిరిగాడు. ఆయనలో "నాగరికత" ఉంది.

"సంఘం నియమములన్నియు, స్వలాభాపేక్షపరులైన మానవ నిర్మితములు—" ఇది ఎంతవరకు నిజము.

—మానవుడు తనకేది శ్రేయస్కరమో లాభకరమో ముందుగా తెలుసుకోవాలి - ఏది నిత్యమంగళకరమైనదో అదే శాశ్వతమైన ధర్మసూత్రంగా ఉంటుంది. నిత్యమైన శాశ్వతమైన సత్యధర్మసూత్రములను బాగా జిజ్ఞాసచేసి నిర్ణయించే టప్పుడు స్వలాభం సంఘలాభం ఒక్కటే అయిపోయి, అద్వైత సిద్ధిపొందుతాయి.

ఇంగ్లీషుకన్న తక్కువ అక్షరాలు గల భాష ఉన్నదా?

—అత్యంత క్లిష్టాక్షర భాష ఆంగ్ల భాషయే.

శ్రీ కే. బి. గౌర—పామర్లకోట.

మన కవులు రచనలలో ప్రస్తావించెడి చకోరమనే పక్షి గుడ్లగూబేనా?

—అది గుడ్లగూబ కాదు. అది కొండ పిట్ట. దీనినే చకోరం అంటారు.

★

"పెణ్‌మనమ్" సమీక్ష

తమిళ నాడు టాకీసు వారు తయారుచేసిన తమిళ సాంఘిక చిత్రం యిటీవల పత్రికల వారికి చూపించారు

పెణ్ మనమ్ అంటే స్త్రీ హృదయం. చిత్రంలో చూపించిన కథనుబట్టి చూస్తే అది ఒకానొక స్త్రీ హృదయాన్నే చాటి చెప్పుతున్నది కానీ, అందరు స్త్రీలకు సామాన్యంగా వుండే గుణాలను నిరూపించటానికి కథా రచయిత ప్రయత్నించినట్లు తోచదు వీరుతీసుకొన్న కథకూడా రెండు తరాలకు సంబంధించినకథ తండ్రి అయినవాడు అప్పులపాలై యిల్లువిడిచి విదేశాలకు పారిపోగా, ఆ యిల్లాలు, - పతివ్రతల కథలలో ఆ పతివ్రత లందరూ పడే కష్టాలన్నీ - అతి ఓర్పుతో అనుభవిస్తుంది. ఈలోగా కొడుకులు యిద్దరూ పెద్దవాళ్లు అవుతారు రెండో కొడుకు దొంగలనాయకుడుగా తయారై ప్రజాకంటకుడనిపించుకొంటాడు. పుత్రవాత్సల్యంకొద్దీ ఆ తల్లి చిన్నకొడుకు చేసే చెడ్డపనులు వారించలేకపోయింది. ఇల్లు విడిచి పారిపోయిన ఆ తండ్రికి తిరిగి యింటికి వచ్చేందుకు పదిహేనేళ్ళ తరువాత అవకాశం వచ్చి, ఆయన స్టేషన్లో రైలు దిగి, పొలాలకు అడ్డంపడి యింటికి వస్తుండగా, తండ్రి అని పోల్చుకోలేని ఆ చిన్నకొడుకు, (తనను పట్టుకోవటంకోసం మారువేషంలోవస్తున్న పోలీసు అధికారి అని పొరపాటుపడి) రివాల్వరు పేల్చుతాడు. భర్త యిన్నాళ్ళకు తిరిగి వస్తున్నాడన్న సంతోషంతో ఆయనకు స్వాగతం చెప్పబోతున్న తల్లికే యీ తుపాకి గుండు తగులుతుంది. చిన్నకొడుకు తన పొరపాటు గ్రహించి దగ్గరకు వచ్చి మన్నించమని తల్లిని వేడుకొంటాడు. కొడుకుపై మమకారంకొద్దీ తాను మన్నించినా, సంఘం యీతని దోషాన్ని మన్నించలేదని అంటూ ఆ తల్లే రివాల్వరుతో ఆ చిన్నకొడుకును కాల్చి చంపేసి, తానూ ప్రాణాలు వదులుతుంది. ఈ కథను సూటిగా చెప్పకుండా మధ్యలో వీధిభాగవతులు, వెగటు హాస్యాలు పెట్టి, చిత్రం పొడుగు, విపరీతంగా పెంచిన కారణంచేత ప్రేక్షకుడికి ఏ పాత్రమీద కూడా అభిమానం కుదురుకోవటం కష్టతరమైంది.

చిత్రాన్ని ఎస్. సౌందరరాజ అయ్యంగార్ డైరెక్టుచేశారు. నటనా కౌశలాన్ని ప్రదర్శించినవారు టి. కె. షణ్ముగం, ఎం. వి. రాజమ్మ. ఫొటోగ్రఫీ చక్కగా వుంది.



సుశీ మానం శంకించి అత్తగారు కోపంలో ఇంటినుంచి పొమ్మని తరుముగా వదిన సీత ఆదరించి యింటికి తీసుకుపోతుంది—అరుణాఫిల్మ్స్ వారి "గుమాస్తాలో" జయమ్మ, పండరీబాయి

సినిమా వార్తలు

చంద్రకళాపిక్చర్స్ వారి "శుకరంభ" హిందీచిత్రంలో నటించటానికి అంజలీదేవి ఇటీవల బొంబాయి వెళ్ళివచ్చింది ఈచిత్రానికి ధీరూభాయ్ దేశాయ్ దర్శకుడు విష్ణూస్టూడియోస్‌లో షూటింగ్ జరుగుతున్నది అంజలీదేవి కాక భారత్ భూషణ్, లలితా పావర్, నిరూపరాయ్ మున్నగువారు నటిస్తున్నారు అంజలీదేవి పదికాల్ షీట్లలో పనిచేసి వచ్చింది. బొంబాయి స్టూడియోలలో సాధారణంగా రీటేక్స్ అంటూ ఉండనే ఉండవట అసలు షూటింగ్ కంటే రిహార్స్ చెయ్యటానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారట నటీనటులు బాగా రిహార్స్ చేసిగాని సెట్టుమీదికి రారనీ, వచ్చినతరవాత అతివేగంగా షూటింగ్ జరుగుతుందనీ, మేకప్‌కి కూడా అరగంటకంటే ఎక్కువ కాలం వెచ్చించరనీ ఆమె చెప్పింది క్లైమాక్స్ దృశ్యాల వంటి ముఖ్యమైన దృశ్యాల్లో తప్ప మామూలు దృశ్యాల్లో షాట్స్‌కు రీటేక్స్ ఉండనే ఉండవట. మొదటిటేక్ అంత నిర్దుష్టంగా లేకపోయినా దర్శకుడు అదే పట్టించుకోడట ఓకే అనేస్తాడట

మరొక విషయంకూడా ఆమె చెప్పింది వేర్వేరు సెట్లమీద అవసరమైన వేర్వేరు షాట్లను ఒకేసారి తీస్తారట అంటే అడవి సెట్టుమీద పని జరుగుతుంటే, ఆ షాట్స్‌తోపాటు మరొక సెట్టుమీద మరొక దృశ్యంలో అవసరమయ్యే క్లోజప్ షాట్ కూడా ఇప్పుడే తీస్తారన్నమాట ఈ విధంగా కాలవ్యయం తగ్గించుకుంటారట

అంజలీదేవి బొంబాయిలో ఉండగా భారత్‌భూషణ్, అతని భార్య ఆమెను భోజనానికి ఆహ్వానించారట

* * *

ప్రతి సినిమా షూటింగ్‌లోను విచిత్ర విషయాలు జరిగినట్టే నాగయ్యగారి "నా యిల్లు" షూటింగ్‌లోకూడా జరిగాయట శివరాం (నాగయ్య) చనిపోయాడని భార్యకు తెలుస్తుంది భార్యగా నటించిన రాజకుమారి గ్లిసరిన్ అవసరం లేకుండానే కన్నీళ్ళు కారుస్తూ విలపించసాగిందట ఆ శోకం తీవ్రమై షాట్ పూర్తయిన తరవాతకూడా ఎంతసేపటికీ ఆగలేదట అలా ఏడుస్తూ ఏడుస్తూ చివరికామె సొమ్మసిల్లి మూర్ఛపోయిందట అంతా గాబరాపడి నీళ్ళుచల్లి స్పృహ తెప్పించారు. ఇలాగే నాగయ్యగారుకూడా ఒకానొక విషాదమయ దృశ్యంలో మూర్ఛపోయారట * * *

వాహినీవారి "పెద్ద మనుషులు" షూటింగ్ ఇప్పటికి రెండు సెట్లమీద పూర్తయిందనీ, త్వరలో "దేవాలయం" సెట్టు వేస్తారనీ తెలుస్తున్నది కె వి రెడ్డిగారి దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రం నాలుగోవంతువరకూ అయింది

★

కాలక్షేపం

(...వ పేజీ తరువాయి)

కన్పింప జేస్తోంది. ఎందుచేత యీ కాల భ్రమణంమనకు కలుగుతూ ఉన్నదో గ్రహించలేకుండా ఉన్నాము. అందుకనే యిది "కాలప్రవాహం" అని చెప్పకుండా, ఇది "కాలచక్రం" అని చెప్పుచున్నాము.

ఈ కాలచక్రపరిభ్రమణము మనకు మతిభ్రమణం కలుగజేస్తోంది. అందువల్ల యీ అజ్ఞానంలోనే పడి నిత్యమైన ఆత్మతత్వం ఏదో అనిత్యమై అనుక్షణం మారుతూ ఉండే భౌతిక తత్వం ఏదో వివక్షణగా గ్రహించలేకుండా ఉన్నాము. ఆత్మతత్వం అనేది లేదని కూడా వాదిస్తూ ఉన్నాము.

ఏమైనప్పటికీ యీ చీకటిలోనే పుట్టి పెరుగుతున్నాము. కండ్లు మూసికొని పాలుత్రాగేపిల్లికి అదే అంధకారం. నేత్రాలు మూసుకొన్నట్లయితే, అదేచీకటి అదే రాత్రి అన్నాడు శ్రీకృష్ణుడు.

"అమ్మ!";—"యనేమిరా? యదు
కులాగ్రణి!";—"గిన్నెయొసంగు";—
"మేల?";—"పా
లిమ్మగ త్రావ";—"లేదిపు";—
"డదెప్పుడు?";—"రే";—
"యదియెట్టిది?";—
"దంధకా
రమ్మగు" నన్న—గన్మొగిచి,
"రాత్రిరివచ్చెను, వేగపాలు తే
తె"మ్మని, తల్లిపైట వడిదీయు
ముకుందుడు నన్ను బ్రోచుతన్.

బాలగోపాల కృష్ణునకున్నూ, యశోదకున్నూ జరిగిన సంభాషణ ఇది.

"అమ్మా?" అని కృష్ణుడు యశోదను పిలిచినాడు.

"అమ్మా!" అని పిలవగానే

"ఏమిరా! కృష్ణా?" అన్నది.

"గిన్నెయిమ్మ" అన్నాడు.

"ఎందుకు?" అన్నది.

"పాలు కమ్మగా త్రాగాలి" అన్నాడు

"ఇప్పుడు లేవు" (పాలు) అన్నది.

"అవి ఎప్పుడు ఉంటాయి?"అని అడిగాడు.

"రాత్రికి" అని జవాబు చెప్పింది.

"రాత్రిఅంటే అది ఎట్టిది?" అన్నాడు.

"రాత్రి అంటే అప్పుడు చీకటిగా ఉంటుంది" అన్నది.

ఆమాట యశోద అనేసరికి చిన్ని గోపాల కృష్ణుడు వెంటనే తన కళ్లు మూసికొని "చీకటిఏర్పడి రాత్రివచ్చింది. కనుకపాలు తే తెమ్మ"ని తల్లిపైటను వడిగా లాగెను. అటువంటి ముకుందుడునన్ను బ్రోచుగాక!

కళ్లుమూసుకుంటే రాత్రి, కళ్లు తెరిస్తే పగలు. రాత్రికీపగలుకూ అంతకంటేభేదం లేదని అతి సూక్ష్మంగా అతిస్థూలంగా లోకానికి బోధపరచినబాలగోపాలకృష్ణుని అమృతవాక్యం అది.

రాత్రి మరొక నాలుగుజాముల కాలము ఉండకుండా అప్పుడే ఎందుకు తెల్లవారిందిరా? అని పరితపించే నవయౌవన జీవిత సౌఖ్య వ్యామోహంలో "లలనా ఏటికి తెల్లవారె?" అనేవారికి, ఎన్ని నిద్రలు చేసినా, ఎన్ని రాత్రిళ్లువచ్చినా పోయిన సంసారవ్యామోహం తీరదు.

ఈ భవబంధములు నానాటికి పెరి[గి] అందుమూలంగా, చేసిన పనులనే చేస్తున్నారు. కాని సిగ్గుపడరు. "పునరుక్తకార్య[ము]ల్ నిచ్చలు సేయుచున్."

ఈ భవాభ్యుచ్చయరీతి చేజెడి, బుద్ధులు సిగ్గువహింప రెంతయున్" ★

మనవిశ్వవిద్యాలయాల విలయం

క్రీస్తుశకము 5 వ శతాబ్దములో గుప్తరాజులు పాటలీపుత్రమును రాజధానిగా ఏర్పరచుకొని భారతదేశాన్ని పరిపాలిస్తూ ఉండేవారు. ఇది 1500 సంవత్సరాల క్రిందటి సంగతి. అప్పుడు నలందాలో ఒక విశ్వవిద్యాలయము గుప్తరాజులచే ప్రతిష్ఠింపబడి వృద్ధిలోనికి తీసికొని రాబడెను. ఇటువంటి విశ్వవిద్యాలయములే ఈ నలందా విద్యాపీఠముయొక్క నమోనాను అనుసరించి భారతదేశ మంతటను అనేక ప్రాంతాలలో ఏర్పాటు చేయబడెను. అవి ఏవనగా:- (1) తక్షశిల (పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రంలో) (2) వల్లభి (కథియవాడ్ - గుజరాట్ లో) (3) విక్రమశిల (బీహారులో) (4) ఓదంతపురి (బెంగాలు) (5) జగద్దాల (బెంగాలు) (6) సోమపురి(బెంగాలు) (7) విక్రమపురి (బెంగాలు) ఈ విశ్వవిద్యాలయాలు ఒక వేయి సంవత్సరాలకాలము బాగా సాగినవి. అటుపిమ్మట మొగలాయి రాజులు యీ దేశంలోకి ప్రవేశించిన తర్వాత జేబరు చక్రవర్తి కాలము మొదలుకొని, యీ విద్యాపీఠములు అంతరించినవి.

ఇవిగాక పెద్దపెద్ద కళాశాలలు యీ క్రింది ప్రదేశాలలో ఆనాటి ప్రాచీనకాలంలో ఉండేవి:-

(1) బుద్ధగయ (2) సాంచి (3) బర్హత్ (4) శ్రవస్తి (5) కౌశాంబి (6) సారనాద్ (7) మధుర (ఉత్తర హిందూస్థాన్) (8) నాసిక (9) అమరావతి (10) నాగార్జునకొండ (11) జగ్గయ్యపేట (12) కాంచీపురం (13) కావేరి పట్టణం (14) మధుర (దక్షిణ హిందూస్థాన్.) ఇవిగాక, అశోకుని కాలమందు ఈ దేశములో సెకండరీ పాఠశాలలుగాని ప్రయిమరీ పాఠశాలలుగాని 84,000 ఉన్నవని డా॥ బారువాగారు ఋజువు చేశారు. కాని, ఆ విద్యాలయాలు అన్నీ అదృశ్యమై నశించినవి. మన విశ్వవిద్యాలయముల విలయగాథ ఇది.

తన యింట్లో అద్దెకు వుంటున్న ఆయన కారుక్రింద పడి ఆస్పత్రిలో వున్నాడని తెలిసి, ఆ యిల్లుగలావిడ చాలా బాధ పడింది. ఆయనను ఒకసారి చూచివద్దామని ఆస్పత్రికి వెళ్లింది.

అక్కడ ఆస్పత్రిలో నర్సు యీవిడను అడిగింది- "మీరు ఆయన భార్యా?" అని.

ఈవిడ ఒళ్లు మండి పోయింది:

"ఛీ-నేను ఆయన యింటావిడను" అని సమాధానం చెప్పింది.

★ ఆకలితో ★

(11-వ పేజీ తరువాయి)

కారణ మేమో-తెలుసా మీకు
రెడ్డిచేతిలో-చీటీ చూడుడు ,,
అందులో ఏమని వ్రాసియున్నదో-
చదివి చూడరండి ‖తంధానో‖
‖కనరా భారతపౌరా, వినరా-
కరువుబాధ నేడు‖

1. పరువు ప్రతిష్ఠలతో బ్రదికామూ-
పూర్వమునుంచియును
కరువు వచ్చి మా వడ్లూ గొడ్లూ-
వట్టిపోయినాయి.
2. ఎల్లకాలము మా చెయి పైనా -
ఎదుటిచేయిక్రింద
అన్నివిధముగా బ్రదికిన మాకూ -
అన్నమె కరువాయె.
3. పూవులమ్మినా చేతులతోనే-
కట్టెలమ్మలేము
ధర్మంచేసిన చేతులతోడనె -
ముష్టినెత్తలేము,
4. నేటితో మాకు జన్మభూమికీ -
ఋణముతీరిపోయె
క్షమియించుడి మా ఆత్మహత్యలకు-
మిత్రులారమీరు,?
5. అని వ్రాసిన యా లేఖ చదివితే -
ఏమనగలమండీ
కరువురాక్షసీ కోరలవాడిని -
కొలువలేము బాబు ‖కనరా‖

—:మూడవ ఛాయాదృశ్యం:—

కనరా భారతపౌరా, వినరా -
కరువుబాధ నేడు‖

1. అడుగడుగో ఆ పడమటి వీధీ -
మిద్దెయిల్లు చూడు
కొత్తకోడలూ కాపురమొచ్చీ -
నెలయు నిండలేదు,
2. కన్నతల్లికీ, కొత్తభార్యకూ -
తిండి సరిగలేదు
కూలిచేయుటకు ఎంత తిరిగినా -
కూలిపనులు లేవు.
3. దొడ్డిడుగొడ్లూ, పెట్టెలునగలూ-
అమ్మివేశినారు
అయినా కరువుకు ఆగలేదయా -
రెండు నెలలకైన
4. ఆకలిబాధతో భార్యను తల్లిని-
జంపివేయుచుంటి
ఇదియంతా నా అసమర్థతయని-
యతడు తలచినాడు
5. అర్ధరాత్రమున గుండెచీల్చుకొ-
ప్రాణం విడిచాడు
కొడుకుపోకడకు గుండెలు పగిలీ-
కన్నతల్లి జచ్చె,
6. పచ్చని మంగళసూత్రం, గాజులు-
వీడననెను భార్య
అంతటి భర్తా, అత్తాపోయిన-
నేను ఎందుకనెను
7. పునిస్త్రీనిగా చావవలెననీ-
పట్టుబట్టినాది
భర్త శవముతోపాటుగ తననూ-
పూడ్చుమంది ఆమె. ‖కనరా‖

[ఛాయాదృశ్యాలు ముగిసినయ్. వెనుక తెరవద్దగల లైట్లు తీసివేసి; ముందుండే లైట్లు వెలిగించాలి...ఈలోగా గానం సాగుతూనే వుంటుంది.]

‖కనరా భారతపౌరా, వినరా -
కరువుబాధ నేడు‖

1. ఈవిధమ్ముగా కరువుబాధలకు-
దేశ మంతటాను
వీండుకుండలా సంసారాలూ-
భళ్ళున పగిలాయి,
2. ప్రేమ చిలికినా హృదయాలన్నీ-
మోడువారినాయి
చెట్టు కొకరుగా, గుట్ట కొకరుగా-
కాందిశీకులైరి ‖కనరా‖

[బుర్రకథకులు చివరివంతతో నిష్క్రమిస్తారు... [ఇంకా వుంది]

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

(33-పేజీ తరువాయి)

తున్న ఆహార విశేషం ఏమిటో తెరచి చూస్తూ వుండటం కూడా మనకళ్లె పడుతూ వుంటుంది.

ఏనుగుల విషయం సర్కసు వాళ్లకు బాగా తెలుసు. వాళ్ల అభిప్రాయం ప్రకారం, ఏనుగులకు ఏ 'ఫీట్' నేర్పాలన్నా, దాని వయస్సు పదేళ్లకు మించకు ముందే నేర్పాలట కాని, యిక ఆ తరువాత దానికి ఏఫీటు కూడా నేర్పటం సాధ్యపడదట. (మనుష్యులకైనా అంతే - 25 ఏళ్లు దాటాక వీళ్లు నేర్చుకోనే మాటల సంఖ్య చాలా తగ్గిపోతుంది.)

తల క్రింద పెట్టి కాళ్లు పైకి పెట్టి నిల్చొనే ఫీటు ఒక్క ఏనుగులకి మాత్రమే నేర్పగలం కానీ, మరీ ఏ యితర జంతువుచేతా యీ 'ఫీటు' చేయించ లేం.

అమెరికాలో రింగ్‌లింగ్ బ్రదర్స్ సర్కస్ అని ఒక పెద్ద సర్కస్ కంపెనీ వున్నది వీళ్ల సర్కస్‌లో ఎన్నో ఏనుగులున్నాయి. వాటిలో ఒక ఏనుగ మామూలుగా ఫీట్స్ చేసే సమయంలో ఒక చిన్న తొట్టిమీద కూర్చుంటుండేది. ఆతొట్టె బీటవారి పోయి వున్నట్లు ఒకసారి ఆఏనుగు గమనించిందట. అప్పటినుంచీ ఆ ఏనుగు ఎన్నిసార్లు ఆ 'ఫీట్' చేయవలసి వచ్చినా, ఎంతో బెరుకు బెరుకుగా అతొట్టి కేసీ చూస్తూ కూర్చుండేదట. ఈ ఏనుగు తొందరగా కూర్చోక పోవటం చూసిన మావటివాడు గద్దిస్తే, వేరే మార్గం లేక యీ ఏనుగు తన వెనుక భాగం ఆతొట్టికి తగలీ తగలకుండా, బరువు అంతా తన వెనక కాళ్లమీదే పడేటట్లు కూర్చోవటం మొదలు పెట్టిందట. అంత కష్టమైన భంగిమలో అది వారాల తరబడి కూర్చొంటూ లేస్తూ గడుపు కొచ్చిందటే కానీ, ఒక్కసారి కూడా ఆతొట్టిమీద తన బరువు అంతాపడేలా కూర్చోనే లేదట.

పై సందర్భంలో మనకు కనిపించే ఒక విశేష మేమంటే-ఆ ఏనుగు తనకు తాను ఆలోచించి, మార్గాన్ని నిర్ణయించుకో గలిగింది. ఇది చాలా రకాల జంతువులకు చేతకాని విషయం.

అంతే కాదు- ఎప్పటికే ఆపద వస్తే, అప్పటికి అందుకు తగ్గట్టుగా నడుచుకో గలగటం అనే గుణం కూడా ఏనుగులకి వున్నంత ఎక్కువగా మరి ఏ యితర జంతువుకీ లేదు. ఒకసారి పెద్ద సర్కసు జరుగుతున్నదట. పెద్ద ఏనుగు ఒకటి చిన్న చిన్న ఏనుగులను తాను ముందు వుండి గోదాచుట్టూ తిప్పుతున్నదట. అలా చేస్తూ చేస్తూ వుండగా దానికి తలమీద అలంకారం కోసం పెట్టిన టోపీ ఏదో క్రిందికి జారివచ్చి కళ్లకు అడ్డంపడి పోయిందట. అయినా సరే - అది అలాగే తాను ముందు వుండి మిగిలిన ఏనుగులను నడిపిస్తూనే వున్నదట. సర్కసు చూడ వచ్చిన దొరసాని ఒకామె అదేదో పెద్ద గంగాళం అంత టోపీ పెట్టుకొని ముందు వరసలో కూర్చొని వుంటే, యీ ఏనుగు లన్నిటిలోకీ చిన్న ఏనుగు ఒకటి ఆటోపీని చూసి బెదిరిపోయి కంగారుగా అరిచెయ్యటం ఆరంభించిందట. మిగిలిన ఏనుగులు కూడా వరసతప్పి, అంతకంటే బిగ్గరగా అరిచెయ్యటం ఆరంభించాయి. అంతా నానా హంగామాగా తయారయింది. కళ్లకు అడ్డంగా టోపీ వున్న కారణంచేత యీ కంగారు అంతా ఎందుకో ఆపెద్ద ఏనుగికి అర్థం కాలేదు. వెంటనే అది సర్కస్‌డేరా తాలూకు గుంజల్లో ఒక దాని దగ్గరకు వెళ్లి, తలను దానికి జోటుపెట్టి, టోపీ పైకి లాక్కొని చుట్టూ ఒక్కసారి చూసి, పరిస్థితి అంతా అర్థం చేసుకొని, మిగిలిన ఏనుగుల నన్నిటిని తొండంతోనూ, కాళ్లతోనూ బాది, మళ్లీ వరసలో నిల్చోపెట్టి అవతల బ్యాండు వాళ్లు వాయిస్తున్న వరసలకు సరిపోయేలాగా యీ అన్ని ఏనుగుల చేతా కదను తొక్కించిందట.

ఏనుగులకు జ్ఞాపక శక్తి ఎక్కువ అంటారు కానీ అందులో నిజమెంతో తెలియదు. సర్కసు ఏనుగులచేత ఆఫీట్స్ అన్నీ ఎప్పటికప్పుడు 'రిహార్సల్సు' వేయించక పోతే అవి చప్పునమరచిపోగలవట.

పిల్ల ఏనుగులు ఒక్కొక్కప్పుడు తల్లి ఏనుగు తోకనే స్తనం అనుకొని చీకటం మొదలు పెట్టుతుంటాయి. ఇది చూస్తే మనకి అందరికీ నవ్వు వస్తుంది. నిజమే. కానీ-మనకు పుట్టే పిల్లలు ఏడాది దాటేదాకా ఏది పడితే అది, ఏదీ దొరక్కపోతే తమ బొటనవేళ్లే నోట్లో వేసుకు చీకుతూ వుంటే మనకది అబ్బురంగానూ వుంటుంది. కాకిపిల్ల కాకికిముద్దు! (ఇంకావుంది)

★ రెండు మహానగరాలు

(25-వ పేజీ తరువాయి)

నా మనస్సులో వున్న వేదననుంచి విముక్తి పొందాలని అనుకున్నాను. ఈ విషయాన్ని నా భార్యకు కూడా చెప్పకుండా రహస్యంగా అట్టే పెట్టాను. నాకు వచ్చే ప్రమాదాన్ని గురించి నేను యెక్కువగా ఆలోచించలేదు; కాని యీ విషయాన్ని ఇతరులు యెవరు తెలుసుకునివున్నా వారికి కొన్ని బాధలు చుట్టుకోవటం తప్పదని ఊహించగలిగాను.

'ఆ వేళంతా నాకు ఊపిరి సలపకుండా పని వుండటంచేత ఆ రాత్రి ఆ ఉత్తరం ముగించలేకపోయాను. తెల్లవారిఝాము నే లేచి పూర్తిచేశాను. ఆవేళ డిశంబరు 31 వ తేదీ. సంవత్సరాంతం. ఉత్తరం అప్పుడే పూర్తిచేసి ముందు పెట్టుకుని బల్లదగ్గిర కూర్చున్నాను. ఇంతలో నే నౌకరు లోపలికి వచ్చి యెవరో ఒక స్త్రీ నాతో మాట్లాడటానికి వచ్చినట్టు చెప్పాడు.

'ఆ స్త్రీ పడుచు వయసులోనే వుంది; అందంగా కూడా వుంది; మంచి సహృదయంగల స్త్రీగా కూడా కనుపించుతోంది; కాని ఆవిడలో యెక్కువ కాలం జీవించే లక్షణాలు లేవు. చాలా ఆందోళనగా కనుపించుతోంది; తాను సెయింట్ ఎవ్రిమాండ్ అనే జమీందారు భార్యనని స్వయంగా చెప్పింది.

'జమీందారు భవనంలో జరిగిన ఆ సంఘటనను గురించి, ఆవిడ కొన్ని విషయాలు కర్ణాకర్ణిగా తెలుసుకుంది. మరి కొన్నిటిని ఊహించుకుంది. ఆ వ్యవహారంలో తన భర్త చర్య, నన్ను పిలిపించటం యిదంతా ఆవిడకు తెలుసు; కాని, పాపం ఆ అమ్మాయి యింకా జీవించి వున్నదనే ఈవిడ అనుకుంటోంది. ఆడదానికి ఆడదానిపట్ల వుండే సానుభూతిని ఆ అమ్మాయికి తెల్పుకోవాలని పాపం ఈవిడ తాపత్రయం. అలా తాను ఏదైనా చెయ్యగలిగితే లోకకంటకంగా తయారైన ఆ కుటుంబంమీద భగవంతుని క్రోధం ప్రసరించకుండా వుంటుందేమో నని ఈవిడ ఆశ.

'తన భర్త దుష్కృత్యానికి గురియైన ఆ స్త్రీకి ఒక చెల్లెలు వున్నట్టు ఆవిడకు యెలాగో తెలిసింది. ఆ అమ్మాయికన్నా సాయపడాలని పాపం యీవిడ అభిలాష. చెల్లెలు వుందన్న సంగతి వొక్కటే నాకు తెలిసింది—అంతకంటే నాకు మాత్రం యేమి తెలుసు? ఆ జమీందారిణికి అంతకంటే నేనూ యేమీ చెప్పలేకపోయాను. ఆ పిల్ల పేరూ, ఆ పిల్ల యెక్కడ వున్నదీ తెలుపగలనేమో నని ఆశతో పాపం ఆవిడ యింతదూరం వనిగట్టుకుని నాకోసం వచ్చింది.

'ఆవిడ చాలా దయాస్వభావంగల స్త్రీ; ఆవిడ వివాహ జీవితం యేమంత శాంతియుతమైనది కాదని ఆవిడ ముఖకవళికలను బట్టే గ్రహించగలిగాను. అవును ఆవిడకు శాంతిసౌఖ్యాలు లభించట మెలా? బావగారికి ఆవిడ అంటే చాలా అసహ్యం, ఆవిడంటే ఏకోశానా నమ్మకం లేదు. ఆవిణ్ణి అణచివేయటానికి బావగారు తన తమ్ముడిమీద తనకున్న పెద్దరికాన్నంతా వినియోగించుతూ వుంటాడు. అందుచేత యీవిడ బావగారన్నా మొగుడన్నా అనుక్షణం భీతితో బ్రతుకుతూవుంటుంది. నేను ఆవిణ్ణి పంపించటానికి వీధిలోకి వచ్చాను. వీధివాకిట్లో నిలిపివున్న బండిలో, రెండు మూడు సంవత్సరాల వయసులోవున్న చక్కని కుర్రవాడొకడు కూర్చునున్నాడు.

"ఇడుగో డాక్టరుగారూ ఈనాపకోసం నేను పడుతున్న తాపత్రయమంతా: ఈ వంశానికి చుట్టుకొన్న శాపం వీణ్ణికూడా కొట్టేస్తుందేమోనని నా భయం. ఇందుకు నేను చేయదగిన ప్రతిక్రియ యేమన్నా వున్నదేమోనని చూస్తున్నాను. ఏవో కొన్ని నగలు మినహా నా దగ్గిర ఇతర ఆస్తి యేమీలేదు. ఆ పిల్లసంగతి తెలిస్తే ఆ నగలను ఆ పిల్లకు పంపించి నా చేతనైన ప్రతిక్రియ చేసుకుందామని ఆందోళనపడుతున్నాను" అన్నదావిడ.

'ఆ పిల్లణ్ణి ముద్దెట్టుకుంది—"నీకోసమే నాయనా నా ఆందోళనా—నువ్వు యిలాంటి దుర్నడతలు నడవకు తండ్రీ!" అన్నది. ఆ కుర్రవాడు, అతి ధీమాగా "అలాగేనమ్మా" అంటూ తల్లిని ముద్దుపెట్టుకున్నాడు. ఆవిడ బండిలోకి ఎక్కి బిడ్డని ఒళ్లోకి తీసుకుంది. బండి కదిలిపోయింది.

'అనంతరం ఆ వుత్తరాన్ని యితరత్రా పంపటానికి యిష్టం లేక నేనే స్వయంగా తీసుకుపోయి మంత్రిగారి కార్యాలయంలో అందజేశాను.

'నాటి అర్ధరాత్రిసమయంలో, నల్లటిదుస్తులు వేసుకున్న ఒకమనిషివచ్చి వీధితలుపుకొట్టాడు. నౌకరుకుర్రాడు డిఫార్జ్ అతన్ని వెంటపెట్టుకుని లోపలికి తీసుకువచ్చాడు.

"కొంచెం అర్జంటుకేసండీ! కాస్త సెయింటు ఆనరీవీధిదాకా దయచెయ్యాలి" అన్నాడు. "కుర్రపు బగ్గీ సిద్ధంగా వుంది లెండి, వెంటనే వచ్చేద్దురుగాని".

ఆ బగ్గీయే నన్ను ఇక్కడికి (ఖైదుకు) చేర్చింది. ఆ బగ్గీయే నన్ని ఈ జీవసమాధిదగ్గిరికి చేర్చింది.

బగ్గీ మాయింటిముందునుంచి కొంచెందూరం సాగగానే, వెనకనుంచి ఒకరు నా నోటిమీదికి నల్లటి ముసుగు విసిరేసి పెదవులు ఆడకుండా కట్టేశారు. చేతులురెండూ వెనక్కు విరిచికట్టారు. ఆ జమీందారీ సోదరు లిద్దరూ చీకటిలోనుంచి రోడ్డుకు అడ్డంగా నడిచి బండిదగ్గిరకొచ్చి నన్ను గుర్తించి తలపంకించారు. పెద్దవాడు నేను మంత్రికి వ్రాసిన ఉత్తరం జేబులోనుంచి బయటికి తీసి, నా కళ్లఎదుట లాంతరుకు ముట్టించి తగలబెట్టాడు. కాలినమసిని నేలమీదపారేసి కచ్చకొద్దీ కాలితో నలిపేశాడు. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. నన్ను ఈ జైల్లో తీసుకువచ్చి పారేశారు. ఈ గదిలో జీవసమాధి చేశారు.

'అలెగ్జాండర్ మానెట్ అనే నేను, ఈ ఖైదులో జీవన మరణవేదనలోవుండి, 1767 డిశంబర్ 31 వ తేదీరాత్రితో ఈ లేఖ ముగించుతున్నాను. ఆ జమీందారీ సోదరులమీదా ఆ వంశం వారిమీదా, అత్యంత క్రూరకర్ములుగా భగవంతునిముందూ, మానవజాతిముందూ నేరారోపణ చేస్తున్నాను.'

ఆ ఉత్తరం చదవటం పూర్తికాగానే కోర్టుహాల్లో తుపాను చెలరేగిపోయింది. ఆ లేఖలోని విషయాలు వినటంతో అక్కడ వున్న యావన్మందికీ వెర్రెత్తిపోయింది. ఆ వంశాన్ని నిర్మూలించి పగ సాధించాలని బొబ్బలు పెట్టేస్తున్నారు. ప్రముఖ దేశభక్తుడూ, రిపబ్లిక్ ప్రభుత్వ ప్రధాన పౌరుడూ అయిన డాక్టర్ గారి మీద అలాంటి అమానుషత్వం జరిపిన కిరాతుల వంశాన్ని ఏమైనా సరే నామరూపాలు లేకుండా చేయవలసిందే—డాక్టర్ గారి ఏకైక పుత్రిక ముండమోసిపోయినా సరే!

మాడమ్ డిఫార్జ్ ప్రతీకారిణి వంక చూసి చిరునవ్వు నవ్వింది: "డాక్టర్ గారికి చాలా పలుకుబడి వుంది—డాక్టర్ గారూ! ఏదీ ఇప్పుడతన్ని రక్షించండి!"

ప్రజాపీడకులూ, రిపబ్లిక్ ప్రభుత్వ శత్రువులూ, అయిన జమీందారీ వంశానికి చెందిన చార్లెస్ డార్నే అని పిలవబడుతూన్న చార్లెస్ ఎవ్రిమాండ్‌ను యిరవై నాలుగు గంటల్లో తల గొట్టివేయవలసిందిగా శిక్ష విధించారు. కాన్సెర్జరీ జైలుకు పంపివేశారు. ★

జమీందారుగారి భార్య మట్ట మధ్యాహ్నం వేళ ఆ షాపుకు వచ్చింది. అక్కడ సరుకులు అందించే కుర్రాడిని 'అది తియ్యి' 'ఇది తియ్యి' మని గంటన్నరసేపు వేధించింది. ఇంత తిప్పలూ పెట్టి ఏ సరుకూ కొనకుండా వెళ్లిపోతూ 'అమ్మయ్య! ఇప్పటికి తగ్గింది నా తలకాయనొప్పి' అని తనలో తను అనుకొంటున్నట్లుగా పైకి అన్నది.

"అమ్మా! ఆ తలకాయ నొప్పి ఎక్కడికీ పోలేదు. మిమ్మల్ని వదిలి నన్ను పట్టుకొంది." అని ఆ కుర్రాడు అన్నాడు.

కష్టార్జితం

(36-వ పేజీ తరువాయి)

కారు. అతనివద్ద శెలవు తీసుకొని వెంకయ్య తనపాకకు తిరిగివచ్చాడు.

తెల తెల తెల్లవారింది. వెంకయ్య పనులన్నీ ముగించుకొని, బట్టలు మూటగట్టుకొని, రామయ్యతో "వెళ్లొస్తా నన్నా! మళ్లా ఎల్లుండి కల్లా తిరిగొచ్చేస్తానులే. తోట జాగ్రత!" అంటూ అతనితో చెప్పి తనవూరువైపుకి ప్రయాణమై పోయాడు.

రామయ్య, సూరిగాడు, వెంకయ్య చూపుకు అందకుండా పోయేటంత వరకూ చూశారు!

"పాపం! వెంకయ్యతాత చెట్టుమీది మూటే మరిచిపోయి నట్టున్నాడు. జ్ఞాపకం వచ్చినప్పుడు మళ్లీ వచ్చి చూసి మూట కనబడక, ఏడ్చి, ఏడ్చి చస్తాడేమో!" అన్నాడు సూరిగాడు ఎక్కడలేని సానుభూతితో! "ఓస్; యిక నంచి వాడికి దొరకడమే? అది ఎక్కడ దాచానో వాడి బాబుకి గూడ అంతు చిక్కదు." అన్నాడు రామయ్య సగర్వంగా నవ్వుతూ!

"ఎక్కడ దాచావేం?"–ప్రశ్న వేశాడు సూరిగాడు.

"మన యీ పూరి పాకలో అంత డబ్బు దాయగలమట్రా! వెంకయ్యతాత పాక ఎంత గొప్పదో, మనదీ అంతేననుకో! డబ్బునంచి మన పాకలో పెడ్తే ఎవడైనా తీసుకుపోవచ్చునని, ఆ కనబడే చెట్టుతొఱ్ఱలో నిన్న రాత్రే దాచేశాను." అన్నాడు రామయ్య ఆచెట్టువంక చూపిస్తూ!

"అరే! చంపేశావ్! నేను తెచ్చిందీ అక్కడ్నించే! ఆచెట్టు తొఱ్ఱలోనే వెంకయ్యతాత డబ్బు దాచింది! నాతో ముందెందుకు చెప్ప లేదు. అయితే 'వెంకయ్యతాత మూటపుచ్చుకొని వెళ్ళిపోయాడన్న మాట" అన్నాడు ముఖం వ్రేళ్లాడేసుకొని సూరిగాడు. రామయ్యకు తేలు కుట్టినట్టయింది. పాకంతా చిందులు త్రొక్కడం మొదలుపెట్టాడు.

వెంకయ్య వూరు చేరుకొని హాయిగా కాలం గడుపుతున్నాడు. ★

కథానాయకుడు

(19-వ పేజీ తరువాయి)

నుంచి "శ్లేష్మంలోపడ్డ ఈగ" అని పిలుస్తూ వచ్చారు. ఆ మాటకు నాకు నవ్వొచ్చింది. అప్పటికీ ఎప్పటికీ కూడ అదేనేమో నా పేరు అనిపిస్తుంది. ఒక సిల్కులాల్చి కుర్రాడు తన సరదాలో నన్ను "నూతిలో కప్ప" అన్నాడు నేను ఆఫీసు కాగితాల్లో మునిగివుండడం చూసి, "నీది ఓ బ్రతుకేనా" అని నన్నుద్దేశించి ఎవరో ఒక కుర్రాడు కవిత్వం అల్లాడుట. ఆ కవిత్వమేమిటో నేను వినలేదుగాని, నిజంగా వినుపాస్తూంది.

ఇంతకీ నా పేరేమిటో చెప్పరూ? నాకు జ్ఞాపకం లేదు!! వెనకటి కొక చిన్న ఈగలా నేడీ చిన్నగుమాస్తా కాగితాలకట్టల్లో పడి పేరు మరచిపోయాడు. మా నాన్న అమ్మ కూడ పోయారు అడిగి తెలుసుకొందామంటే! మా ఆవిడ నా ఆయుస్సు తగ్గిపోతుందని పేరు చెప్పదు??

అయితే మీకు తెలిసినది ఒక్క 'గుమాస్తా' అనే పేరేనా! ఎవరూ, నా పేరు, నిజమైన అసలు పేరు చెప్పరూ? నా పూర్తిపేరు మీకు తెలీదూ' నీ పూర్తి పేరు మాకు తెలియడం ఎందు కంటున్నారా? అయితే నేనొక్క గుమాస్తా పేరు ధరించడానికే పుట్టానా? నేను 'కారణజన్ముడననా' మీ అభిప్రాయం? ఏమిటీ దారుణం! ఏమిటీ ఘోరకలి!! నేను లంచగొండినంటున్నారా! నా పేరు "లంచగొండా?"–నేను బ్రతికేది ఎట్లా; పూర్తిగా శావనీయరేం-సగం సగంచంపుతారేం?

నా దుర్భర సమస్యలతో నన్ను [illegible]కరంగా వర్ణిస్తారేం? బాబూ నన్ను గురించి ఇక రాయకండి పుణ్య ముంటుంది! గురించి ఇక రాయకుండావుంటే వచ్చే జన్మలో కూడా మీకు కృతజ్ఞుడుగా వుంటాను – అథవా ఏ గవర్నరుగానో మీ కడుపున పుట్టటానికి ప్రయత్నిస్తాను. ఇదుగో చూశారా, బాధలతో శరీరం ఎట్లా తూట్లు పడిపోయిందో! నన్ను ఇంకా ఇంకా వాస్తవంగా చిత్రించి, వర్ణించి నన్ను చీలికలు పేలికలు చేయకండి – మీ కెన్ని కథలకి నేను ఉపయోగపడలేదు గనక? ఇంక నన్ను దయదల్చి వదిలెయ్యండి –దయతో కాస్త నా పేరు ఏమిటో చెప్పండి? త్వరగా చెప్పండి? మళ్లీ ఆఫీస్ టైమ్ అవుతూంది. ★


Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras.



కూపమ్ నదిపై నావలు

శ్రీ ఎల్. మునుస్వామిగారు చిత్రించిన రంగుల రేఖాచిత్రం.

(మద్రాసులో ఇటీవల జరిగిన అభ్యుదయ చిత్రకారులసంఘ వార్షిక ప్రదర్శనంలోని చిత్రం).


డిసెంబరు విడుదల
అంజలీ దేవి · నాగేశ్వరరావు నటించిన
అంజలీ పిక్చర్సు వారి
పరదేశి
తెలుగు. తమిళం.
డైరెక్షన్.... ప్రసాద్...
ప్రొడ్యూసర్..... ఆదినారాయణరావు
కెమెరా
కమల్ ఘోష్
రచన
కృష్ణశర్మ
ఆర్టు
టి.వి.యస్.శర్మ · వాలి
మ్యూజిక్
ఆదినారాయణరావు
ANJALI PIXTURES
పూర్ణా రిలీజ్